సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 | వెల: ₹ 5.50 | సంపుటి: 16 | సంచిక: 244

శనివారం 25-11-2023



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'



'షి నీడ్స్' నీలిమ!

నిరుపేద అమ్మాయిలకు అండగా నిలుస్తున్న నీలిమా ఆర్యపై కథనం -13లో



ఎస్‌ఎంసీకి మారుతీ షేర్లు..

మారుతీలో సుజుకీ మోటార్ వాటా అప్.. గుజరాత్ ప్లాంట్ మారుతీ చేతికి - 15లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



రాజస్తాన్ ఎన్నికలకు సర్వం సిద్ధం

రాజస్తాన్‌లోని 199 అసెంబ్లీ నియోజక వర్గాల్లో నేడు పోలింగ్ నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది.

వివరాలు 6లో ▸



24 మంది బందీలకు స్వేచ్ఛ

ఒప్పందం మేరకు హమాస్ 24 మంది బందీలను విడిచిపెట్టగా.. ఇజ్రాయెల్ 39 మందిని విడుదల చేసిందని సమాచారం.

వివరాలు 6లో ▸



భారత్ అప్పీల్ స్వీకరణ

భారత నేవీ మాజీ అధికారులు 8 మందికి మరణశిక్ష పడిన కేసులో భారత్ పెట్టుకున్న అప్పీల్‌ను ఖతార్ కోర్టు స్వీకరించింది.

వివరాలు 6లో ▸



'డీప్ ఫేక్' ఫిర్యాదులపై సహకరిస్తాం

డీప్ ఫేక్ వంటి అభ్యంతరాలకు సంబంధించిన ఫిర్యాదులపై ప్రజలకు సహకరిస్తామని కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ చెప్పారు.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్‌చెక్

రామోజీ మార్కు స్మార్ట్ బ్లండర్!

- ధర తగ్గినా తట్టుకోలేరా?
- కడప జిల్లా వాసులైతే వ్యాపారాలు చేయొద్దా?
- పూర్తి పారదర్శకంగా ఉచిత విద్యుత్ స్మార్ట్ మీటర్ల టెండర్లు
- రీ టెండరింగ్ వల్ల 15.75 శాతం తగ్గిన ధరలు
- పదేళ్లకు పెరిగిన మీటర్ గ్యారంటీ సమయం
- ఇతర రాష్ట్రాలతో ఈనాడు పొంతన లేని పోలికలు

8లో

ఇవిగో నోటీసులు అదిగో అబద్ధం

- రఘురామ పిటిషన్‌పై ఇదీ 'ఎల్లో బ్యాచ్' తీరు
- ఆ పిటిషన్‌ను అసలు విచారించాలో వద్దో తేలుత తెలుస్తామన్న కోర్టు
- దానిపై మీ అభిప్రాయం చెప్పాలంటూ ప్రతివాదులకు నోటీసులు
- దీన్ని పట్టుకుని సోషల్ మీడియాలో చెలరేగిపోయిన టీడీపీ

7లో

జన హోరతులతో జైత్రయాత్ర



ఆత్మకూరు, పాలకొండ, జగ్గయ్యపేటలో సామాజిక సాధికార సభలకు పోటెత్తిన ప్రజలు

2లో

కదంతొక్కిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శ్రేణులు

వందలాది బైక్‌లతో భారీ ర్యాలీలు..

జగన్ పాలనలో దక్కిన సామాజిక సాధికారతను వివరించిన నేతలు

దళితులను, బీసీలను చంద్రబాబు అవమానించారని మండిపాటు

నంద్యాల జిల్లా ఆత్మకూరులో సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

మిలీనియం టవర్స్‌పై రామోజీ విలనీయం!

ప్రభుత్వ భవనాల్ని ప్రభుత్వం వాడుకుంటే అది కబ్జానా?

ఖాళీగా ఉన్న టవర్‌ను తాత్కాలిక అవసరాలకు వాడుకోవటమూ తప్పేనా?

విశాఖకు ఐటీ కంపెనీలు భారీగా వస్తుండటం 'ఈనాడు'కు కనిపించదా?

ఇన్ఫోసిస్, విప్రో, అమెజాన్, బీఈఎల్, రాండ్‌స్టాడ్ వచ్చింది ఇప్పుడేగా?

అదానీ, రహేజా గ్రూపులు డేటాపార్కులు, ఐటీ టవర్స్ నిర్మించటం లేదా?

ఏపీఐఐసీ రూ.2,300 కోట్లతో 'ఐ స్పేస్' ఐటీ పార్కును కడుతోంది కదా!

ఇన్ని చర్యలు తీసుకుంటుంటే తప్పుడు రాతలతో ఇంత అక్కసెందుకు?

హెచ్‌ఎస్‌బీసీ 2016లో ఇండియా వదిలేసినా ఎందుకీ ఫేక్ వార్తలు?

మాకు నోటీసులివ్వలేదని కాండ్యుయెంట్ చెబుతున్నా మీకు పట్టదా?

ఇలా విష ప్రచారంతో జనాన్ని భయపెట్టడం ఇంకెన్నాళ్లు?

సాక్షి, అమరావతి: 'ఈనాడు'కు, దాన్ని నడిపే వాళ్లకు మతిస్థిమితమేమైనా తప్పిందా? ఎక్కడికి పోతున్నారు వీళ్లసలు? ప్రభుత్వాన్ని వ్యతిరేకించాలంటే ఇదేనా పద్ధతి? ప్రభుత్వ భవనాల్ని ప్రభుత్వం తన అవసరాల కోసం వాడుకుంటే.. దాన్ని 'సర్కారు వారి కబ్జా' అని రాయడానికి సిగ్గుండక్కర్లా? అదేమైనా ప్రయివేటు వాళ్ల భవనమా? లేక రామోజీరావు సొంత ఆస్తినా? అయినా బంధువుల భూముల్ని లీజుల పేరిట కబ్జాలు చేసే రామోజీరావుకు ఇలా నీతులు చెబుతూ పత్రిక నడిపే అర్హత ఉందా అసలు? విశాఖలో మిలీనియం టవర్స్‌కు సంబంధించి శుక్రవారం పతాక శీర్షికల్లో 'ఈనాడు' వండి వార్చిన కథనంలో వీసమెత్తయినా నిజం ఉందా? ఎందుకింత అక్కసు? ప్రభుత్వాన్ని నడిపేది మీ వాడు కాకపోతే

మిగతా 12వ పేజీలో ▶



ఉత్తరాంధ్రపై ఎందుకంత అక్కసు?

ఈ ప్రాంతం ఏపీలో లేదా?: మంత్రి గుడివాడ అమర్‌నాథ్

12లో



హైకోర్టు ఆవరణలో మళ్లీ ఎత్తు పరీక్ష

- పిటిషనర్ల ఆరోపణలు అవాస్తవమని తేలితే ఒక్కొక్కరికి రూ.లక్ష జరిమానా
- తేల్చి చెప్పిన హైకోర్టు
- పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల వివరాలివ్వాలని ఆదేశం
- తదుపరి విచారణ 29కి వాయిదా
- ఎస్సై పోస్టుల నియామక ప్రక్రియ వ్యవహారంలో కీలక మలుపు

- వివరాలు 12లో

బోసి నవ్వులకు భరోసా

శిశు మరణాల నియంత్రణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు

2018-19లో ఎస్‌ఎన్‌సీయూల్లో శిశుమరణాల రేటు 12.3

ప్రస్తుతం అది 6.6కు తగ్గుదల.. ఈ ఏడాది సంరక్షణ కేంద్రాల్లో 380 పడకల పెంపు

సర్కారు చర్యలకు కేంద్రం అభినందనలు

ఎన్‌ఐసీయూల్లో 250 మంది వరకూ వైద్యులు, స్టాఫ్ నర్సులు, తదితర పోస్టుల భర్తీ

అత్యాధునిక వైద్య పరికరాలను సమకూర్చిన సర్కార్

12లో

రాజవొమ్మంగి మండలం దూసరపాముకు చెందిన మంగ, అప్పారావు దంపతులకు గత ఏడాది మేలో స్థానిక పీహెచ్‌సీలో పాప పుట్టింది. అయితే, 800 గ్రాములే బరువు ఉంది. అవయవాల ఎదుగుదల లేకపోవడంతో అక్కడి వైద్యులు కాకినాడ జీజీహెచ్‌లోని నవజాత శిశువు సంరక్షణ కేంద్రానికి తరలించారు. అక్కడ 3 నెలల పాటు చికిత్స అందించారు. పాప 1.755 కేజీల బరువు పెరిగి పూర్తి ఆరోగ్యంగా ఉంది. ఇలా పుట్టుకతో బరువు తక్కువగా ఉండటం, ఇతరత్రా ఆరోగ్య సమస్యలున్న చిన్నారులకు రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రులు అండగా నిలుస్తున్నాయి.



విజయవాడ జీజీహెచ్‌లోని నవజాత శిశు సంరక్షణ కేంద్రం

ఇవిగో నవరత్నాల వెలుగులు

నాలుగున్నరేళ్లుగా కొనసాగుతున్న యజ్ఞం	మానవాభివృద్ధే ధ్యేయంగా పథకాల అమలు	జీవన స్థాయిలు పెరిగి పేద వర్గాల ముందడుగు

- విత్తు నాటిన వెంటనే చెట్టయిపోదు. ఫలించడానికి దానికి సమయమివ్వాలి. ఈలోగా సంరక్షించాలి. ఇదిగో.. రాష్ట్రంలో ఇపుడా ఫలాలు కనిపిస్తున్నాయి. ఎన్నికలకు వెళ్లే ముందు మాయమాటలు చెప్పి... గెలిచాక మరిచిపోయే కుటిల రాజకీయాలకు స్వస్తి చెప్పారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. 2019లో ఎన్నికలకు ముందు ప్రకటించిన మేనిఫెస్టోను... గెలిచిన క్షణం నుంచే మనసా వాచా ఆచరణలోకి తీసుకురావటం మొదలుపెట్టారు. కోవిడ్ చుట్టుముట్టి యావద్దేశాన్నీ అతలాకుతలం చేసినా... రాష్ట్రం సైతం ఆర్థికంగా తల్లకిందులైనా... ఆడిన మాట తప్పలేదు. ఆరంభించిన ఏ పథకాన్నీ ఆపలేదు.



- ఫలితం... 'అమ్మ ఒడి'తో స్కూళ్లలో చదువుకునే పిల్లల సంఖ్య పెరిగింది. వృద్ధులు, వితంతువుల పింఛన్లను అన్నట్టే రూ. 3,000 వరకూ పెంచుకుంటూ వెళుతుండటంతో వారికి ఆసరా దొరికింది. డ్వాక్రా రుణాల మాఫీతో మహిళలు తలెత్తుకు నిలబడ్డారు.
- నగదు జమచేసి రైతుకు భరోసా కల్పించటమే కాదు. ఈ-క్రాప్‌తో ఉచితంగా నూరుశాతం బీమా చేయించి పంటనష్టమనే భయం లేకుండా చేశారు. రైతు భరోసా కేంద్రాలతో వ్యవసాయాన్ని లాభసాటి చేశారు. చరిత్రలో తొలిసారి ఉచితంగా ప్రతి పేద మహిళకూ ఇంటి స్థలాన్ని ఇవ్వటమే కాక.. ఇళ్ల నిర్మాణానికీ శ్రీకారం చుట్టారు.
- 'నాడు-నేడు'తో స్కూళ్లు, ఆసుపత్రుల రూపు రేఖలనే మార్చేశారు. విద్యాకానుక, గోరుముద్ద, వసతి దీవెన పేరిట విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు తెచ్చారు.
- ఇక ఆరోగ్య రంగంలో తెచ్చిన సంస్కరణలు అమూల్యం. ఆసుపత్రుల రూపురేఖల్ని మార్చటమే కాదు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి దాదాపు ప్రతి చికిత్సా వచ్చేలా ప్రొసీజర్ల సంఖ్యను గణనీయంగా పెంచారు. ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్‌ను పంపించి, ఉచితంగా మందులిస్తూ పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఇలా చెబుతూ వెళితే ఐదేళ్లలో ఇన్ని చేయటం సాధ్యమా? అనే ఆశ్చర్యం కలగకమానదు. కాకపోతే సంకల్పం కన్నా శక్తిమంతమైనదేదీ లేదని నిరూపించారు వైఎస్ జగన్.

అందుకే.. ఆ 'నవరత్నాల' వెలుగుల్ని ఆయా లబ్ధిదారుల మాటల్లోనే చూపించే ప్రయత్నం ఆరంభించింది సాక్షి..

ఆ వివరాలు ఈ రోజు నుంచీ మీకోసం ప్రత్యేకం

2లో

ఇదండీ సంగతి



ష్! ..మన దాకా రానిచ్చేట్లు లేరుగా!

సంతకం సాక్షిగా.. మద్యంలో ముడుపులు!

నోట్ ఫైళ్లపై చంద్రబాబు, కొల్లు రవీంద్ర సంతకాలు వెలుగులోకి

అడ్డగోలుగా మద్యం దుకాణాలు, బార్ల ప్రివిలేజ్ ఫీజులు రద్దు

ప్రభుత్వ ఖజానాకు రూ.1,299.64 కోట్లు నష్టం

ఆర్థిక శాఖ అనుమతి, ఆమోదం లేకుండా తతంగం


కేబినెట్ భేటీ ముగిశాక గుట్టుగా చీకటి జీవోలు జారీ

టీడీపీ సర్కారు తీరును తప్పుబట్టిన ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్

ఇన్నాళ్లూ మా బాబుకు ఏమీ తెలియదంటూ బుకాయించిన ఎల్లో గ్యాంగ్

సాక్షి, అమరావతి: మద్యం కుంభకోణం ద్వారా అస్మదీయ కంపెనీలకు అడ్డగోలుగా ప్రయోజనం కల్పించిన మాజీ సీఎం చంద్రబాబు నిర్వాకాలు సంతకాలు సాక్షిగా బహిర్గతమయ్యాయి. ఇన్నాళ్లూ ఆయనకు ఏమీ తెలియదంటూ బుకాయించిన టీడీపీ నేతలు, ఎల్లో మీడియా వాదనలో ఏమాత్రం నిజం లేదని నోట్‌ఫైళ్ల సాక్షిగా తేటతెల్లమైంది. మద్యం కుంభకోణానికి కర్త, కర్మ, క్రియ అంతా చంద్రబాబేనని, గుట్టు చప్పుడు కాకుండా ఈ కుంభకోణానికి పాల్పడ్డారని నిరూపించే

మిగతా 7వ పేజీలో ▶



మద్యం దుకాణాలు, బార్లపై ప్రివిలేజ్ ఫీజు రద్దు చేయాలని రూపొందించిన ఫైల్‌పై చంద్రబాబు, కొల్లు రవీంద్ర చేసిన డిజిటల్ సంతకాలు



26, 27న తిరుపతిలో ప్రధాని పర్యటన

- ఈనెల 26వ తేదీ సాయంత్రానికి తిరుమలకు చేరుకోనున్న ప్రధాని
- రాత్రికి అక్కడే బస.. 27వ తేదీన శ్రీవారి దర్శనం
- అనంతరం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం
- ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సీఎస్ జవహర్‌రెడ్డి సమీక్ష

7లో

ఏయూలో చారిత్రక కళావేదిక పునఃప్రారంభం

సంతోషం వ్యక్తం చేసిన సినీ నటుడు అక్కినేని నాగార్జున

ఎందరో కళాకారులకు ప్రాణం పోసిన వేదికను మళ్లీ అందుబాటులోకి తేవడంపై హర్షం

ఏయూలో తన సినిమా చిత్రీకరిస్తానని వెల్లడి

- వివరాలు 8లో



ఏయూలో కళావేదికను ప్రారంభించిన నాగార్జున

9 నుంచి కులగణన



- ప్రజల జీవన స్థితిగతులను మార్చేందుకే కులగణన
- సమగ్ర కులగణన కోసం వివిధ వర్గాల అభిప్రాయాలు సేకరిస్తున్నాం
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ వెల్లడి

- వివరాలు 7లో

ఇవిగో నవరత్నాల వెలుగులు

నా ప్రాణం నిలబెట్టారు..



మాది టెక్కలి సమీపంలోని రాందాస్‌పేట. శ్రీకాకుళం జిల్లా. నేను టెక్కలి రోడ్డులో కొబ్బరికాయలు అమ్ముకుంటూ బతుకుతున్నాను. గతేడాది ఆరో నెలలో ఎక్కువగా గుండె వద్ద నొప్పి వస్తుంటే... అందరూ గ్యాస్టిక్ నొప్పి అని చెప్పారు. శ్రీకాకుళంలోని పెద్ద డాక్టర్‌కు చూపిస్తే వెంటనే ఆపరేషన్ చెయ్యాలని చెప్పారు. అప్పుడే నా గుండె ఆగినంత పనైంది. మా ఆవిడ అమ్ములమ్మతో కలిసి తిరిగి మా ఊరొచ్చేశాము. దిగాలుగా ఉండిపోయాం. నాకు ముగ్గురు ఆడపిల్లలు. ఇద్దరికి పెళ్లి చేసేశాను. ఇంకా ఒక పిల్ల ఉంది. మేము రోజంతా రోడ్డు మీద కొబ్బరికాయలు, పళ్లు అమ్మితేనే ఇళ్లు గడుస్తుంది. ఏం చెయ్యాలిరా దేవుడా అని బెంగపడ్డాను. వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో ఈ డబ్బులు లేకుండానే ఆపరేషన్ చేస్తారని ఎవరో మా ఆవిడకి చెప్పారు. వెంటనే టెక్కలి ఆస్పత్రికి వెళ్లి నా జబ్బు కోసం చెప్పాను. ఇలా చెప్పానో లేదో నాలుగైదు రోజుల్లోనే ఆపరేషన్ చేయిస్తామని కబురు చెప్పారు. శ్రీకాకుళం కిమ్స్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేశారు. పది రోజులు అక్కడే ఉన్నాం. వెంటనే పనికి వెళ్లలేనని ఆసరా పథకం అంటూ పది వేలు నగదు నా ఖాతాకు వేశారు. ఆరోగ్యశ్రీ లాంటి పథకం లేకపోతే..నాలాంటి పేదోడికి దిక్కేది చెప్పండి. నాకోసం రూ.4.30 లక్షలు వరకు ఈ ప్రభుత్వం భరించింది. ఈ ఆరోగ్యశ్రీ యే నా ప్రాణం నిలబెట్టింది. ఇప్పుడైతే నా ఆరోగ్యం బాగానే ఉంది. ఉన్న ఆడపిల్లకు పెళ్లి చేసేశాను. ఆనందంగా ఉన్నాను.

– బోర రామ్మూర్తి, రాందాస్‌పేట

(బి.శివప్రసాద్, విలేకరి, అరసవెల్లి)

మా రెక్కల కష్టానికి మద్దతు



మాది ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఒమ్మెవరం. పదేళ్ల క్రితం వివాహమైంది. మా కుటుంబంలో నేను చిన్న కోడలిని. మాకు సెంటు భూమి కూడా లేదు. భార్యభర్తలమిద్దరం రెక్కల కష్టం మీదే ఆధారపడి జీవిస్తున్నాం. ఒక్క రోజు కూలికి వెళ్లకపోతే ఆ రోజు పస్తు ఉండాల్సిందే. కూలి పనులకు వెళ్తూనే మా ఇద్దరు బిడ్డలు జాస్మిన్ (8వ తరగతి), అమర్ (7వ తరగతి)లను చదివించుకోవాలి. వారికి మంచి దుస్తులు, పుస్తకాలు కొనాలంటే మాలాంటి వారికి తలకు మించిన భారమే. ఈ దుస్థితిలో మా బిడ్డల్ని ఎలా చదివించాలి అని మథనపడేవాళ్లం. వారు పెద్దవుతున్న క్రమంలో ఇంకా భయం పట్టుకొంది. పెద్ద పెద్ద చదువులు చదివించాలంటే మా వల్ల కాదు. మాలాగా మా పిల్లలు ఉండకూడదు. వారిని ఉన్నత చదువులు చదివించాలనేదే నా ముందున్న పెద్ద సవాలు. కానీ మాకు ఆ స్తోమత లేదు. అలాంటి సమయంలో నాలుగేళ్లుగా ఎలాంటి ఆటంకం లేకుండా అమ్మ ఒడి పథకం మాకు కొండంత ఆసరాగా నిలిచింది. నాలుగేళ్లుగా నా బ్యాంక్ అకౌంట్‌లో నేరుగా డబ్బులు పడుతున్నాయి. వాటితో మా బిడ్డలకు కావల్సిన ఇతరత్రా వస్తువులు కొనుక్కుంటున్నాము. ఒకప్పుడు స్కూళ్లు తెరుస్తున్నారంటే ఎంతో భయపడిపోయేవాళ్లం. వారికి ఏ విధంగా డబ్బులు సమకూర్చాలి? ఎక్కడ అప్పు చేయాలి..? అని మేమిద్దరం నెల రోజుల పాటు ఆలోచించేవాళ్లం. ఎంతమందిని అడిగినా అప్పు పుట్టేది కాదు. ఇప్పుడే ఇలా ఉంటే భవిష్యత్ ఏమిటా అని భయపడేవాళ్లం. కానీ అమ్మ ఒడి రూపంలో ఆ దేవుడే కరుణించాడు. ఈరోజు ఏపీలో మా లాంటి నిరుపేదల పిల్లలకు మంచి చదువు దొరుకుతోంది. తొందరలో మాకు సొంతింటి కల నెరవేరనుంది.

– అత్తంటి యేసుమ్మ, ఒమ్మెవరం

(ఎ.మధుబాబు, విలేకరి, నాగులుప్పలపాడు)

ఇదిగో మా సొంతిల్లు



అన్నమయ్య జిల్లా రాయచోటి సమీపంలోని సిబ్యాలకు చెందిన మేము 30 ఏళ్ల క్రితం ముగ్గురు కొడుకులతో కలిసి బతుకుదెరువు కోసం మదనపల్లెకు వలస వచ్చాం. నీరుగట్టువారిపల్లె చౌడేశ్వరినగర్, మాయాబజార్ ఇంకా చానా చోట్ల అద్దె ఇళ్లల్లో ఉన్నాం. బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాళ్లం. ముగ్గురు బిడ్డలకు పెళ్లిళ్లయ్యాక జీవనోపాధికి మగ్గాలు నేసుకునేందుకు వేర్వేరుగా వెళ్లిపోయారు. మాకు వయసై పోవడంతో చంద్రబాబు ఉన్నప్పుడు సొంతింటి కోసం తిరిగాము. చేతిలో అర్జీ పెట్టుకొని తిరగని ఆఫీసంటూ లేదు. చేతులెత్తి మొక్కని ఆఫీసర్ లేడు.. చెప్పులరిగిపోయాయేగానీ పెద్దసార్ల మనసు కరగలేదు. తహసీల్దార్, మున్సిపాలిటీ ఆఫీస్ వద్ద చాలా సార్లు అర్జీలు ఇచ్చాము. తలదాచుకునేందుకు ఓ చిన్న గూడు కట్టుకుందామన్నది మా ఆశ. అది ఈ జన్మలో తీరదనుకుని ఆశ వదిలేసుకున్నాం. ఓ రోజు మా ఇంటికి వలంటీర్ రోజా 'పెద్దయ్య, పెద్దమ్మా.. మీకు ఇల్లు మంజూరు చేస్తే కట్టుకుంటారా' అంటూ మా దగ్గరికొచ్చింది. ఇది కూడా వట్టి మాటలే అనుకున్నాం. కొన్ని రోజులుపోయాక శ్రీవారినగర్ సమీపంలో ఇల్లు మంజూరైందని చల్లని కబురు చెప్పింది. పట్టా కూడా చేతికి రావడంతో నమ్మలేకపోయాం. ప్రభుత్వం ఇచ్చిన సొమ్ముతో, మా కష్టంతో ఇల్లు ఇలా కట్టుకున్నాం.

– సుబ్బరామయ్య, రాములమ్మ దంపతులు

(ఎస్.వంశీధర్, విలేకరి, మదనపల్లి)

నేడు పెందుర్తి, తుని నియోజకవర్గాల్లో సాధికార బస్సు యాత్ర

సాక్షి, అమరావతి: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తోన్న మేలును వివరించడానికి వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర శనివారం కాకినాడ జిల్లా తుని, అనకాపల్లి జిల్లా పెందుర్తి నియోజకవర్గాల్లో జరగనుంది.



నంద్యాల జిల్లా ఆత్మకూరులో జరిగిన సభకు హాజరైన జనసందోహంలో ఓ భాగం

అభిమానుల 'ఆత్మీయ' వరద

- ఆత్మకూరు సామాజిక సాధికార సభకు పోటెత్తిన ప్రజలు
- జన సంద్రంలా పట్టణం
- 500 బైక్‌లతో అభిమానుల ర్యాలీ
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నేతలకు ఘన స్వాగతం

సాక్షి, నంద్యాల: సామాజిక సాధికార యాత్రకు ప్రజలు పోటెత్తారు. ఆత్మకూరు పట్టణం జనసంద్రాన్ని తలపించింది. కనుచూపు మేర ఎటుచూసినా, ఇసుకేస్తే రాలనంతలా జనం తరలివచ్చారు. సుమారు 500 బైక్‌లతో నిర్వహించిన బైక్ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సభ గ్రాండ్‌సక్సెస్ అయింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. గజ మాలలు, డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్లతో తమ అభిమాన నాయకులకు అపూర్వ స్వాగతం పలికారు.

కరోనాలోనూ సంక్షేమ పథకాలు ఆపలేదు: డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా

కరోనా కాటేసినా, ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా ఆపకుండా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా ప్రశంసించారు. నమ్మించి మోసం చేయడం చంద్రబాబు నైజమైతే.. నమ్మిన వ్యక్తిని గుండెల్లో పెట్టుకునే వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అని చెప్పారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశాం కాబట్టే.. తామంతా కాలర్ ఎగరేసి ఓట్లడుగుతున్నట్టు తెలిపారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాలను నమ్మించి నట్టేట ముంచిన చంద్రబాబు ఏ ముఖం పెట్టుకుని వారిని ఓట్లడుగుతారని ఎద్దేవా చేశారు.



వైఎస్సార్ విగ్రహం వద్ద ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు

బీసీ డిక్లరేషన్ ప్రకటించి అమలు చేశారు: మంత్రి కారుమూరి

బీసీ డిక్లరేషన్ సభలో చెప్పిన ప్రతి మాటనూ అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం జగన్ అమలు చేశారని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం యాదవులకు పదవులు ఇవ్వలేదని, కేవలం సీఎం జగన్ మాత్రమే యాదవులకు సముచిత గౌరవం ఇచ్చారని చెప్పారు. మూడుసార్లు సీఎంగా చేసిన చంద్రబాబు.. తన కులం వారికి కాకుండా బీసీ, ఎస్సీ, మైనార్టీలకు ఏనాడూ రాజ్యసభ టికెట్ ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ఆర్.కృష్ణయ్యను రాజ్యసభకు పంపి బీసీల గళాన్ని దేశవ్యాప్తంగా వినిపించేలా సీఎం జగన్ కృషి చేశారని ప్రశంసించారు. ఈ సందర్భంగా తాను అమెరికా వెళ్లినప్పుడు ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తనతో మాట్లాడిన మాటలను కారుమూరి గుర్తు చేసుకున్నారు. 'మా నాన్న ఓ రిక్షా కార్మికుడు.. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజురీయింబర్స్‌మెంట్‌తో నేను చదువుకుని అమెరికాకు రాగలిగా.. మా కుటుంబమంతా వైఎస్సార్ కుటుంబానికి రుణపడి ఉంటుంది'.. అంటూ కళ్లనీళ్లు పెట్టుకున్నాడని చెప్పారు.

దళితుల పట్ల నిబద్ధతను చాటుకున్న సీఎం జగన్ : మంత్రి ఆదిమూలపు

పూర్వకాలంలో దళితులు చదువుకుంటే నాలుక కోసేవారని, చెవుల్లో సీసం పోసేవారని.. కానీ, సీఎం జగన్ తన కేబినెట్‌లో ఓ దళితుడిని విద్యాశాఖ మంత్రిగా చేసి దళితుల పట్ల తనకున్న నిబద్ధతను నిరూపించుకున్నారని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. 2019లో 151 కి.మీ వేగంతో ఫ్యాన్‌ను తిప్పారని, 2024 ఎన్నికల్లో 175 కి.మీ వేగంతో ఫ్యాన్‌ను తిప్పాలని పిలుపునిచ్చారు. ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీలు పోతుల సునీత, ఇసాక్ బాషా, ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, తొగురు ఆర్థర్, కర్నూలు మేయర్ రామయ్య పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో జన సునామీ



ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో జరిగిన సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం

- సామాజిక సాధికార సభలో పోటెత్తిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు
- విజయవాడ వైఎస్సార్ సర్కిల్ నుంచి భారీ ర్యాలీ

పెనుగంచిప్రోలు/జగ్గయ్యపేట: ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో శుక్రవారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్ర జన సునామీని తలపించింది. విజయవాడ రోడ్డులోని వైఎస్సార్ సర్కిల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని బలుసుపాడు రోడ్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభాస్థలి వద్దకు చేరింది. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సామాజిక నినాదం హోరెత్తింది. సభకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. నాలుగున్నరేళ్ల పాలనలో సంక్షేమ పథకాలు తమ ఇంటి ముంగిటకే వస్తున్నాయంటూ సామాజిక సాధికార బస్సు యాత్ర వెంట ఉత్సాహంగా కదిలారు.

సమ సమాజ స్థాపనకు పునాది: మంత్రి ధర్మాన ప్రసాదరావు

రాష్ట్రానికి వైఎస్ జగన్ సీఎం అయ్యాకే సమ సమాజ స్థాపన జరిగిందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా బడుగు, బలహీన, వర్గాలకు మేలు చేసింది జగన్ ఒక్కరేనని స్పష్టం చేశారు. ఆయా వర్గాలకు చెందిన ప్రజలు గతంలో ఎన్నడూ లేని విధంగా సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారని.. దీనికి సీఎం వైఎస్ జగన్ దార్శనికతే కారణమని తెలిపారు.

బడుగు, బలహీన వర్గాలకు భరోసా: మంత్రి రజిని

రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్ ప్రాధాన్యమిస్తూ.. వారికి భరోసా కల్పిస్తున్నారని ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. శాసనసభలో 17 మంది బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారికి మంత్రి పదవులు ఇవ్వడంతో పాటు.. అన్ని రకాల పదవుల్లో 60% అవకాశం కల్పించడం ఓ చరిత్రగా చెప్పారు. భావితరాల బంగారు భవిత కోసం జగనన్నకు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు.



బస్సు యాత్రలో పాల్గొన్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే సామినేని తదితరులు

చంద్రబాబు జైలుకు పంపితే, జగనన్న పార్లమెంట్‌కు పంపాడు: ఎంపీ నందిగం సురేష్

చేయని తప్పుకు అప్పటి చంద్రబాబు ప్రభుత్వం తనను జైలుకు పంపితే.. దళితుడనైన తనను దేశ ప్రధాని పక్కన పార్లమెంట్‌లో కూర్చునే గొప్ప అవకాశాన్ని కల్పించిన మహోన్నత వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ చెప్పారు. రాజధాని ప్రాంతంలో పేదలు ఉండకూడదని కోర్టుల ద్వారా చంద్రబాబు పేదల ఇళ్ల నిర్మాణాలను అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, ఎండీ రుహుల్లా, ఎమ్మెల్యేలు మొండితోక జగన్మోహనరావు, కొక్కిలిగడ్డ రక్షణనిధి, వసంత కృష్ణప్రసాద్, కొలుసు పార్థసారథి, వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్ బాషా, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక తదితరులు పాల్గొన్నారు.

పాలకొండలో గర్జించిన గిరిజనం

- సామాజిక సాధికార సభకు పోటెత్తిన ప్రజానీకం
- తరలి వచ్చిన ఎస్సీ, బీసీ, మైనార్టీలు
- నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచీ ప్రజల రాక



ప్రసంగిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

సాక్షి ప్రతినిధి, విజయనగరం: గిరిజనుల గడ్డ పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో శుక్రవారం నిర్వహించిన సామాజిక సాధికార యాత్రకు జనం పోటెత్తారు. గిరిజనులతో పాటు ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత పాలకొండ మండలం చినమంగళాపురంలో ఆర్బీకే, గ్రామ సచివాలయం భవనాలను ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, అలజంగి జోగారావు, కంబాల జోగులతో కలిసి వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. పాలకొండ వరకూ సాగిన బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. వందలాది కార్యకర్తలు ఉత్సాహంగా బైక్ ర్యాలీ నిర్వహించారు.

సాధికారతకు నేనే నిదర్శనం: ఎమ్మెల్యే కళావతి

సీఎం జగన్ పాలనలో సామాజిక సాధికారత సాకారమైందనడానికి ఆదివాసీ మహిళనైన తానే నిదర్శనమని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. గత టీడీపీ పాలనలో ప్రసంగాలకే పరిమితమైన సామాజిక న్యాయం.. ఇన్నాళ్లకు జగనన్న ప్రభుత్వంలో సాకారమైందని చెప్పారు.

3 లక్షల ఎకరాల భూ పంపిణీ: ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

సీఎం జగన్ నాలుగున్నరేళ్ల పాలనలో 3 లక్షల ఎకరాల భూమిని గిరిజనులకు పంపిణీ చేశారని, గతంలో చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో 40 వేల ఎకరాలు కూడా ఇవ్వలేదని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర చెప్పారు. గిరిజనుల అభివృద్ధి విషయంలో చంద్రబాబుకు, జగన్‌కు నక్కకు, నాగలోకానికి మధ్య ఉన్నంత తేడా ఉందన్నారు. బాబు మోసాలను గుర్తు చేసుకో.. ఫ్యాన్ గుర్తును తలచుకో.. అంటూ వేదికపై పాడిన పాట ఆకట్టుకుంది.

దేశమంతా చర్చ : స్పీకర్ తమ్మినేని

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సామాజిక సాధికారతకు సంబంధించి ఏపీలో జరుగుతున్న బస్సు యాత్రపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం చెప్పారు. గతంలో ఎన్నడూ వెలుగుచూడని 139 వెనుకబడిన కులాలను గుర్తించి 56 కార్పొరేషన్ల ఏర్పాటు ద్వారా నిధులు, విధులు, బాధ్యతలు ఇచ్చి వారి ఆత్మాభిమానాన్ని సీఎం జగన్ పెంచారన్నారు.

ఏపీలో సామాజిక విప్లవం : మంత్రి మేరుగు

దేశంలో మరే ముఖ్యమంత్రి ఆలోచించని విధంగా సీఎం జగన్ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతి కోసం పనిచేస్తున్నారని మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. రాష్ట్రంలో సామాజిక విప్లవం ద్వారా సాధికారత సాధించారని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో చంద్రబాబు అన్ని సామాజిక వర్గాలను అవమానించారని మంత్రి సీదిరి అప్పలరాజు గుర్తుచేశారు. ఉత్తరాంధ్ర టీడీపీ నేతలు ఇంకెంత కాలం చంద్రబాబుకు బానిసలుగా ఉంటారని, బయటకు వస్తే విశాఖను పరిపాలన రాజధాని చేసుకుందామని పిలుపునిచ్చారు. ఎంపీలు గొడ్డేటి మాధవి, బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, ఎమ్మెల్యేలు పాముల పుష్పశ్రీవాణి, రెడ్డి శాంతి, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు, జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతీరాణి పాల్గొన్నారు.

వధూవరులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆశీస్సులు

సాక్షి, అమరావతి/పెనమలూరు: ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ పూనం మాలకొండయ్య, డాక్టర్ మన్నం మాలకొండయ్య ఐపీఎస్ (రిటైర్డ్) కుమారుడి వివాహ వేడుకకు శుక్రవారం సీఎం వైఎస్ జగన్ హాజరయ్యారు. పోరంకిలోని మురళీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ వివాహ వేడుకలో వరుడు శ్రీధర్, వధువు అహల్యకు సీఎం ఆశీస్సులు అందజేశారు. కలెక్టర్ రాజాబాబు, స్థానిక ఎమ్మెల్యే కొలుసు పార్థసారథితో పాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



వధూవరులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్

Presenting

The Carens X-Line

X from a different world

First-in-class	Best-in-class	First-in-class	Class-leading	Best-in-class
Stylish matte graphite exterior and black glossy grille	G1.5 Turbo petrol engine with 117.5 kW (160 ps) power	Rear seat entertainment screen and walk-in lever	Futuristic interiors with spacious 3-rows and captain seats	Kia Connect with 68 smart features

Price starts at ₹18 94 900*.

Book Now | Call 1800 108 5000 | Visit www.kia.com/in | Book Kia Carens



KIA

Movement that inspires

Carens

From a different world

Take all the great things the Kia Carens has to offer and get ready to be transported to a different world. Right from the Xclusive Matte Graphite Exterior to the Space-age Cockpit with Sage Green Upholstery, Walk-in Lever and Rear Seat Entertainment Screen, the Carens X-Line is crafted to immerse you into a different world of style and comfort.

Stylish matte graphite exterior and black glossy grille



make you stand out in the world.

G1.5 Turbo Petrol engine with 117.5 kW (160 ps) power



delivers unmatched power for all your family trips.

Rear seat entertainment screen and walk-in lever



give the freedom to choose your entertainment and adjust your space.

Futuristic interiors with spacious 3-rows and comfortable captain seats



offer more legroom and comfort, which is class-leading.

Kia Connect# skill with Amazon Alexa



lets you control your Kia from the comfort of your home.

Robust 15 Hi-Safety Package

STANDARD ACROSS ALL VARIANTS

6 Airbags, ESC (Electronic Stability Control), VSM (Vehicle Stability Management), BAS (Brake Assist), HAC (Hill-start Assist Control), DBC (Downhill Brake Control), ABS (Anti-lock Brake System), All Wheel Disc Brakes, Highline Tyre Pressure Monitoring System, Rear Parking Sensors, ISOFIX Child Anchor, High Mount Stop Lamp with Emergency Stop Signal, All Seat 3-point Seat Belts with Reminder, Speed Sensing Door Lock and Impact Sensing Door Unlock

Kia Service

Connected · Adaptive · Responsive · Engage

3 Years Unlimited Km Warranty	Extended Warranty Up to 5 Years	My Convenience Plus Best-in-class Cost of Ownership^	IoT Based Smart Services^^	24x7 | 3 Years Nationwide RSA**

Book Now | Call 1800 108 5000 | 093195 91407 | Look for "Kia India" @ | Visit www.kia.com/in | Book Kia Carens

T&C Apply. *Ex-showroom price all India. The product shown is for representation purpose only. Actual features, color and specifications as shown may not be part of standard fitment and may vary. The color shown is subject to availability and may not be available across all variants and may slightly differ from those shown in the ad. Class is defined as 3-row seater car with overall length less than 4 550 mm & height more than 1 680 mm. ^Computed cumulatively with all benefits from comprehensive coverage. ^^IOT based workshops for live vehicle tracking for digital experience.**RSA Coverage across India except Andaman & Nicobar Islands and Lakshadweep Visit your nearest Kia dealership for more details. #Kia Connect comes with 3-year free subscription. Amazon Alexa device is not a standard car accessory and the customer needs to purchase from a third party. Kia Connect skill features may vary depending on the variant, device compatibility, software and network availability both in the vehicle and Alexa device. Kia Connect skill is only available in India and can be interacted with in English and Hindi. Smartwatch and mobile phone are not provided with the vehicle. Kia India Pvt. Ltd. (Formerly known as Kia Motors India Pvt. Ltd.) reserves the right to make any changes with respect to the trims, colors, specifications and other details of any model as mentioned or to discontinue any model or to modify/discontinue any service without prior notice. Kia urges you to follow traffic rules, these are meant to keep you safe on roads. No liability accepted for errors and printing errors.

FOR INFORMATION CONTACT: ANDHRA PRADESH: VIJAYAWADA: SIMHA KIA, PH: 8688836501, ANANTAPUR: MGB KIA, PH: 8333929195, BHIMAVARAM: SIMHA KIA, PH: 8688836544, CUDDAPPAHA: HOSHI KIA, PH: 8688829739, GUNTUR: SIMHA KIA, PH: 8688836566, KAKINADA: KANTIPUDI KIA, PH: 7799740208, KURNOOL: MGB KIA, PH: 8500963906, NELLORE: HOSHI KIA, PH: 8688829718, RAJAHMUNDRY: KANTIPUDI KIA, PH: 7799740208, TIRUPATI: HOSHI KIA, PH: 8688829739, VISHAKHAPATNAM: LAKSHMI KIA, PH: 7997815777, TELANGANA: HYDERABAD: VIHAAN KIA, KUKATPALLY, PH: 9394812345, AUTOMOTIVE KIA, KONDAPUR, PH: 6309908117, NAGOLE, PH: 6309908118, CAR KIA, JUBILEE HILLS, PH: 7997858880, GACHIBOWLI: PH: 7799906846, KARIMNAGAR: MALIK KIA, PH: 7730911111, KHAMMAM: AUTOMOTIVE KIA, PH: 6309908189, MAHBUBNAGAR: AUTOMOTIVE KIA, PH: 9704111425, NALGONDA: AUTOMOTIVE KIA, PH: 6309908183, NIZAMABAD: SUNRISE KIA, PH: 7995944482, SECUNDERABAD: VIHAAN KIA, PH: 9738312345, WARANGAL: MALIK KIA, PH: 9703433333

INNOCEAN-078/23



పుట్టిన వానికి మరణం ఎలా తప్పదో, అలాగే చనిపోయిన వారికి జన్మ తప్పదు.
అందుచేత శోకించనవసరం లేని దాని కోసం నీవు శోకించ తగదు.
– హైందవ ధర్మం

సాక్షి
శనివారం, 25 నవంబర్ 2023

కనీసం ఇప్పటికైనా...

దేన్నయినా పదే పదే చెప్పవలసిరావటం ఎవరికైనా ఇబ్బందే. అందునా రాజ్యాంగ పదవుల్లో వున్నవారికి పదే పదే రాజ్యాంగ నిబంధనలు గుర్తుచేయటం మరింత ఇబ్బందికరమైన వ్యవహారం. కానీ మన సర్వోన్నత న్యాయస్థానానికి ఇది తప్పడం లేదు. తమ శాసనసభ ఆమోదించిన బిల్లులకు గవర్నర్ ఆమోదముద్ర వేయకపోవటాన్ని సవాలు చేస్తూ పంజాబ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పునిస్తూ గవర్నర్ల అధికారాలకుండే పరిధులు, పరిమితుల గురించి సుప్రీంకోర్టు మరోసారి చెప్పక తప్పలేదు. తన ఆమోదముద్ర కోసం వచ్చిన బిల్లుపై 'సాధ్యమైనంత త్వరగా' గవర్నర్ నిర్ణయం తీసుకోవాలని, పునఃపరిశీలన అవసరమని భావిస్తే ఆ సంగతి తెలియజేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం స్పష్టం చేసింది. ఈనెల 10న వెలువడిన ఆ తీర్పు పూర్తి పాఠం గురువారం సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో వెలువడింది. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లును నిలిపి వుంచేందుకు, వెనక్కి పంపేందుకు రాజ్యాంగంలోని 200వ అధికరణ గవర్నర్‌కు అధికారమిస్తోంది. బిల్లు సక్రమంగా లేదని, స్పష్టత కొరవడిందని లేదా రాజ్యాంగ నిబంధనలను అతిక్రమిస్తోందని గవర్నర్ భావించినప్పుడు దాన్ని తిప్పిపంపొచ్చు. అయితే ఆ సందర్భంగా గవర్నర్ ఏం చేయాల్సివుంటుందో కూడా అదే అధికరణ వివరిస్తోంది. గవర్నర్ ఇచ్చిన సలహాను అంగీకరించి బిల్లుకు సవరణలు చేయటమా లేక యధాతథంగా దాన్నే మరోసారి ఆమోదించి పంపటమా అనేది శాసనసభ ఇష్టమని కూడా అదే అధికరణ తేటతెల్లం చేస్తోంది. రెండోసారి వచ్చిన బిల్లును గవర్నర్ ఆమోదించి తీరాలని ఆ అధికరణ వివరిస్తోంది. నిబంధనలు ఇంత స్పష్టంగా వున్నప్పుడు రోజుల తరబడి, నెలల తరబడి నిర్ణయం చెప్పకుండా బిల్లుల్ని పెండింగ్‌లో వుంచటం అసమంజసం, రాజ్యాంగ విరుద్ధం. కానీ మన దేశంలో పదే పదే ఇలాగే జరుగుతోంది.

ఇతరేతర వ్యవస్థలు కాలానుగుణంగా ఎంతోకొంత మార్పులు చెందుతూ వచ్చాయి. గవర్నర్ల వ్యవస్థ మాత్రం అన్నింటికీ అతీతంగా వుండిపోయింది. అంతక్రితం సర్కారియా కమిషనైనా, ఆ తర్వాత వీరప్ప మొయిలీ నేతృత్వంలోని పాలనా సంస్కరణల కమిషనైనా రాజకీయ నేతలకు ఆ పదవులు ఇవ్వొద్దని సూచించాయి. గవర్నర్ పదవిని రాజకీయ పునరావాసంగా మార్చొద్దని 1994లో ఎస్ఆర్ బొమ్మై కేసులో సుప్రీంకోర్టు కూడా హితవు చెప్పింది. రాజకీయాలకు అతీతంగా వుండే వ్యక్తులు లేదా ఏదో ఒక రంగంలో నిష్ణాతులైనవారు ఆ పదవిలో వుంటే మంచిదని సర్కారియా కమిషన్ సూచించింది. కానీ కేంద్రంలోని ఏ ప్రభుత్వమూ ఆ సూచన శిరోధార్యమని భావించలేదు. ఇటీవల గవర్నర్లకూ, రాష్ట్ర ప్రభుత్వాలకూ మధ్య తరచు వివాదాలు తలెత్తుతున్నాయి. పంజాబ్‌తోపాటు తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాల్లో ప్రభుత్వాలకూ, గవర్నర్లకూ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. పంజాబ్‌లో మరీ విపరీతం. అక్కడ ఏకంగా 12 బిల్లుల విషయంలో గవర్నర్ ఎటూ తేల్చకుండా ఆపేశారు. గవర్నర్లు ఇలా వ్యవహరించటం వల్ల ప్రజల దృష్టిలో ప్రభుత్వాలు చులకనవుతాయి. సమస్య అపరిష్కృతంగా వుండిపోవటానికి కారణం తెలియక అధికార పక్షంపై సామాన్యులు విరుచుకుపడతారు. బహుశా అలా జరగాలని గవర్నర్లు కోరుకుంటున్నారేమో తెలియదు. ప్రజలెన్నుకున్న ప్రభుత్వాలపట్ల ఇలా చిన్నచూపుతో వ్యవహరించటం తమ పదవిని తామే చిన్నబుచ్చుకోవటమని గవర్నర్లు ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది.

సమస్యేమంటే తమ ఏలుబడిలోని ప్రభుత్వాలకు గవర్నర్‌లు ఇబ్బందిగా మారినప్పుడు కొత్తగా మొదటిసారి ఇలా జరుగుతున్నట్టు మాట్లాడే పార్టీలు, గతంలో తాము అధికారంలో వుండగా వ్యవహరించిన తీరును పూర్తిగా మరిచిపోతాయి. దేశంలో ఏ మూలైనా గవర్నర్‌కూ, ఒక ప్రభుత్వానికీ మధ్య వివాదం తలెత్తినప్పుడల్లా కేంద్రంలోని జనతాపార్టీ ప్రభుత్వం గుర్తుకు రాకమానదు. 1977లో జనతాపార్టీ అధికారంలోకి రాగానే ఒకే వేటుతో పది రాష్ట్ర ప్రభుత్వాలను రాజ్యాంగంలోని 356వ అధికరణ కింద బర్తరఫ్ చేసింది. 1980లో కేంద్రంలో మళ్లీ అధికారం వచ్చాక కాంగ్రెస్ ఇదే పని చేసింది. ప్రజల ఆమోదంతో అధికారంలోకొచ్చిన ప్రభుత్వాలను ఇలా ఇష్టానుసారంగా, కక్షపూరితంగా రద్దు చేయటం దారుణమని ఆ రెండు పార్టీల ప్రభుత్వాలూ అనుకోలేదు. ఆ తర్వాత కాలంలో కూడా ఇదే ధోరణి కొనసాగాక బొమ్మై కేసులో సుప్రీంకోర్టు విస్పష్టమైన తీర్పునిచ్చింది. అలాంటి చర్యకు పార్లమెంటు ఉభయసభల ఆమోదం వుండితీరాలన్న నిబంధన విధించింది. అటు తర్వాత ఈ నిరంకుశ విధానానికి ఏదోమేరకు బ్రేకు పడిందనే చెప్పాలి. ఇప్పుడు పంజాబ్ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వల్ల కేరళ, తమిళనాడు ప్రభుత్వాలకు కూడా ఊరట వచ్చినట్టే. ఇప్పటికే ఆ రాష్ట్ర ప్రభుత్వాలు తమ బిల్లులు పెండింగ్‌లో వుంచటాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. ఫెడరల్ వ్యవస్థలో గవర్నర్ల పాత్రేమిటన్న అంశంలో మన రాజ్యాంగ నిర్మాతలకు తగిన అవగాహన లేకపోవచ్చు. కానీ 'సాధ్యమైనంత త్వరగా' బిల్లులపై నిర్ణయం తీసుకోవాలనటం ద్వారా గవర్నర్ల బాధ్యతేమిటో స్పష్టంగా చెప్పినట్టయింది. చట్టాల రూపకల్పనలో శాసనసభల పాత్ర వమ్ము అయ్యేలా అధికారాలను వినియోగించటం సరికాదని తాజా తీర్పులో సుప్రీంకోర్టు చెప్పటం హర్షించదగింది. మరోసారి ఇలా చెప్పించుకోవాల్సిన అవసరం రాకుంటే తమకే గౌరవప్రదమని గవర్నర్లు గుర్తించటం మంచిది.

కాప్-28లో భారత్ భూమిక కీలకం!

విశ్లేషణ



కె.పి. నాయర్


వాతావరణ మార్పులపై మనిషి పోరుకు వేదికగా నిలిచిన కాప్ సమావేశాలు నవంబర్ 30న ప్రారంభం కానున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో జరగనున్న ఐక్యరాజ్య సమితి వాతావరణ మార్పుల 28వ సదస్సు మానవాళి భవిష్యత్తును నిర్దేశించవచ్చు. అంతర్జాతీయ వాతావరణ మార్పుల చర్చల్లో సమూలమైన మార్పు తీసుకు రావాలని భారత్ కాంక్షిస్తోంది. ఆతిథ్య దేశంతో భారత్‌కు ఉన్న ప్రత్యేక అనుబంధం కూడా కాప్–28 సమా వేశాలు తమ లక్ష్యాన్ని చేరుకునేందుకు దోహదపడతాయని భావిస్తున్నారు. దీనికి కేంద్రబిందువుగా భారత ప్రభుత్వపు లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్ (లైఫ్) కార్యక్రమం ఉండాలి. సుస్థిర, అతితక్కువ ఇంధన ఖర్చును పోత్సహించే ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునేందుకు లైఫ్ దోహదపడుతుంది.

గత వారం ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షంతో యుఏఈలో జనజీవితం స్తంభించిపోయింది. పాఠశాలలు బంద్ అయ్యాయి. పాఠాలు ఆన్‌లైన్ మార్గం పట్టాయి. కార్యాలయాలకు వెళ్లాల్సిన ఉద్యోగులు వర్క్ ఫ్రమ్ హోమ్‌కు పరిమితమయ్యారు. ఒక్కసారిగా ముంచెత్తిన వాన జోరుకు వీధుల్లో కార్లు పడవలయ్యాయి. పౌరుల భద్రతకు అధికార యంత్రాంగం నానా పాట్లూ పడాల్సి వచ్చింది. చిత్రమైన విషయం ఏమిటంటే... యుఏఈ, సౌదీ, బెహ్రెయిన్ వంటి దేశాల ప్రజలు నిన్నమొన్నటివరకూ నింగి నుంచి నేలకు జారే వాన చినుకులు చూసేందుకు రుతుపవనాల సీజన్‌లో ముంబైకి వచ్చేవారు. కేవలం వాన హోరు, జోరులను ఆస్వాదించేందుకు వీరు నరీమన్ పాయింట్, గేట్ వే ఆఫ్ ఇండియా వంటి ప్రాంతాల్లో సముద్రాభిముఖంగా ఉన్న ఖరీదైన బంగళాలు, హోటళ్లలో దిగేవారు. 1970లలో బయటపడ్డ ముడిచమురు వారి ఈ విలాసానికి సాయపడేది. వాన చినుకులకు వారు ముఖం వాచిపోయి ఉండేవారు. అయితే అది గతం. ఇప్పుడు వారే భారీ వర్షాలను తప్పించుకునేందుకు ప్రయత్నిస్తూండటం వైచిత్రి.

గాలి మూటలు... నీటి రాతలు...

15 రోజులపాటు కొనసాగే కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్(కాప్) 28వ సమావేశానికీ, వాతావరణ మార్పులపై జరిగే ఇతర సమావేశాలకూ మధ్య స్పష్టమైన తేడా ఇదే కానుంది! ధనిక దేశాలు అనేకం కాప్ సమావేశాల్లో పెద్ద మాటలు మాట్లాడతాయి. అలవికాని హామీలూ గుప్పిస్తాయి. సమావేశాల తరువాత అన్నింటినీ మరచిపోతూంటాయి. ఇప్పుడు ఆ దేశాలూ వాతావరణ మార్పుల ప్రభావాన్ని ప్రత్యక్షంగా చవిచూస్తున్నాయి. అయితే అవి యూఏఈ మాదిరిగా పరిస్థితిని సీరియస్‌గా తీసుకుంటాయన్న గ్యారెంటీ లేదు. మరికొన్ని దేశాలు అసలు సమస్యను కాకుండా, లక్షణాలపై ఎక్కువ దృష్టి పెడతాయి. డోనాల్డ్ ట్రంప్ 2025 జనవరి నాటికి మళ్లీ అమెరికా అధ్యక్షుడయ్యే అవకాశాలు కనిపిస్తున్న నేపథ్యంలో వాతావరణ మార్పులపై అతడికి నమ్మకం లేకపోవడం ఇక్కడ చెప్పుకోవాలి. గత పాలకులు సంతకం చేసిన అనేక అంతర్జాతీయ ఒప్పందాల నుంచి అమెరికా తప్పుకొనేలా చేసిన ఘనత ఆయనదే.

రెండేళ్ల క్రితం గ్లాస్గోలో జరిగిన కాప్–26 సందర్భంగా యునైటెడ్ కింగ్‌డమ్ కూడా పెద్ద హామీలిచ్చింది. వాతావరణ మార్పులకు మూల కారణాలను వెతికి సమస్యను పరిష్కరిస్తామని ప్రకటించింది. ఆ ప్రకటన తరువాత ఏం జరిగిందన్నది వెనుదిరిగి చూసుకుంటే... స్వదేశంలో జరిగిన కాప్–26 సమావేశాలకు వైఫల్యం ముద్ర అంటకూడదనే యూకే అలా ప్రకటించి ఉండవచ్చునన్న అనుమానాలు బలపడుతున్నాయి. యూకేతోపాటు పారిశ్రామిక దిగ్గజ జీ–7 దేశాలన్నీ ఇలాంటి మాటలే మాట్లాడాయి. వాతావరణ మార్పుల సమస్యకు



ప్రధాని మోదీతో కాప్28 అధ్యక్షుడు సుల్తాన్ అల్ జబేర్ (యూఈఏ)

చేసింది మాత్రం సున్నకు సున్న హళ్లికి హళ్లి! కాప్–26లో ఇచ్చిన హామీల అమలును మాత్రమే కాదు... 2015 నాటి కాప్–21 అంటే చారిత్రాత్మక ప్యారిస్ ఒప్పందం విషయంలోనూ యూకే వెనకడుగు వేసింది. వాతావరణ మార్పుల విషయంలో ప్యారిస్ ఒప్పందం మొట్టమొదటి అంతర్జాతీయంగా అమలు చేయదగ్గ చట్టంగా మారడం గమనార్హం. మొత్తం 196 దేశాలు సంతకాలు చేసిన ఈ ఒప్పందం విషయంలో ప్రస్తుత బ్రిటిష్ ప్రధాని రిషి సునాక్... వాతావరణంలోకి విడుదలవుతున్న కర్బన ఉద్గారాలను తగ్గించేందుకయ్యే ఖర్చులతో బ్రిటిష్ ప్రజలపై పడే ఆర్థిక భారం ఆమోదయోగ్యం కాదంటున్నారు. మరోవైపు యూఏఈ ఈ ఖర్చులను భరిస్తానని చెప్పడమే కాదు... సంప్రదాయేతర ఇంధన వనరుల రంగంలో పెట్టుబడుల ద్వారా ఇతర దేశాలకూ సాయం చేస్తామని ప్రకటించింది.

సమస్యను పరిష్కరించే గాంధేయవాదం

2015 నాటి కాప్ 21 సమావేశాల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రకటన వాతావరణ మార్పుల విషయంలో నిర్ణయాత్మకంగా మారింది. అప్పటివరకూ సమస్యగా భావించినదే పరిష్కారంలో భాగమైపోయింది. వాస్తవానికి భారత్, కాప్–28కు ఆతిథ్యమిస్తున్న యూఏఈ రెండూ వాతావరణ మార్పుల సమస్య పరిష్కారం విషయంలో ఇతరులకు ఆదర్శప్రాయంగా నిలిచాయి. అందుకే ఈ కాప్–28 సమావేశాల్లో భారత్ పాత్ర కీలకం కానుంది. ప్రపంచ దేశాలన్నీ సమస్య పరిష్కారానికి ఒక్కమాటపై కదిలేలా చేసేందుకూ భారత్ గట్టి ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉంది.

ఈ ఏడాది జనవరిలో యూఏఈ పరిశ్రమలు, ఆధునిక సాంకేతికత శాఖ మంత్రి సుల్తాన్ అహ్మద్ అల్ జబేర్‌ను కాప్–28 అధ్యక్ష స్థానం వరించింది. ఆ వెంటనే ఆయన మొదటగా భారత్ పర్యటనకు విచ్చేశారు. దీన్ని భారత్ మరచిపోలేదు. బెంగళూరులో మాట్లాడుతూ కాప్–28పై జబేర్ తన అంచనాలను వివరించారు. దశాబ్ద కాలంగా అల్ జబేర్ తరచూ భారత్‌కు వస్తున్నారు. భారతీయ నేతలతో ఆయన సంబంధాలు బాగా తెలిసినవే. అల్ జబేర్ మంత్రి మాత్రమే కాకుండా, అబూదబీ నేషనల్ ఆయిల్ కంపెనీ గ్రూపు సీఈవో కూడా. యూఏఈతో సంబంధాలను మెరుగుపరచుకునేందుకు మోదీ ప్రయత్నిస్తున్న సమయంలో ద్వైపాక్షిక ఇంధన సంబంధాలను మార్చేయడంలో అల్ జబేర్ కీలకపాత్ర పోషించారు. అబూదబీ నేషనల్ ఆయిల్ కంపెనీ ద్వారా భారత్ ఇంధన భద్రతకు గట్టి హామీ కూడా ఇచ్చారు. పరస్పర ప్రయోజనకరమైన ఈ అంశం ప్రస్తుత సమావేశాల్లోనూ ఉపయోగపడుతుందని నిపుణులు భావిస్తున్నారు.

కాప్–28 అధ్యక్షుడిగా అల్ జబేర్ మద్దతు ఉండటంతో అంతర్జాతీయ వాతావరణ మార్పుల చర్చ దిశను నిర్ణయాత్మకంగా మార్చాలని భారత్ కూడా ఆశిస్తోంది. ఆయా దేశాలే కేంద్రంగా సాగుతున్న ప్రయత్నాలను సార్వజనీనం చేసేందుకు భారత్ ప్రయత్నించాలి. దీనికి కేంద్రబిందువుగా మోదీ ప్రభుత్వపు లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్ (లైఫ్) కార్యక్రమం ఉండాలి. సుస్థిర, అతితక్కువ ఇంధన ఖర్చును పోత్సహించే ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రజలు అలవర్చుకునేందుకు లైఫ్ కార్యక్రమం దోహదపడుతుంది. దీనికి ప్రపంచ ఆమోదముద్ర పడితే ప్రస్తుత జీవనశైలి భిన్నంగా మారుతుంది. మహాత్మా గాంధీ చెప్పినట్లు ఆలోచనలు ఆచరణ రూపం దాలుస్తాయి. ధనిక దేశాల ఖరీదైన జీవనశైలి, వృథా వ్యవహారాలకు చెక్ పడుతుంది. వీటి కారణంగా భూమ్మీద వనరులు కరిగిపోతున్న విషయం తెలిసిందే.

అబూదబీ నేషనల్ ఆయిల్ కంపెనీ సీఈవో అయిన అల్ జబేర్ ఆ దేశంలో సంప్రదాయేతర ఇంధన వనరుల ప్రోత్సాహానికీ కృషి చేస్తున్న విషయం చెప్పుకోవాలి. యూఏఈ రెన్యూవబుల్ ఎనర్జీ కంపెనీ మస్‌దార్‌కు ఆయన తొలి సీఈవోగా, తరువాతి కాలంలో చైర్మన్‌గానూ పనిచేశారు. ఈ కంపెనీకి దాదాపు 40 దేశాల్లో ప్రాజెక్టులు ఉన్నాయి. కాప్–28లో పర్యావరణానికి హాని కలిగించని ఇంధనాల వాడకం వైపు ప్రపంచం మళ్లేందుకు అల్ జబేర్ కాలుష్య కారక ముడిచమురు పరిశ్రమ వర్గాలతో కలిసి పనిచేయాల్సి ఉంటుంది. యూఏఈ స్వయంగా చమురు అమ్మకాలు చేస్తున్నప్పటికీ పశ్చిమాసియాలో అణుశక్తి కేంద్రం కలిగిన తొలి దేశం కూడా ఇదే కావడం గమనార్హం. పర్యావరణానికి మేలు చేసే స్వచ్ఛమైన టెక్నాలజీలను అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైన ఆర్థిక వనరులు యూఏఈ వద్ద పుష్కలం. ఈ నేపథ్యంలోనే 2015 నాటి ప్యారిస్ సమావేశాల కంటే ఈ సారి జరిగే కాప్ సమావేశాలు మరింత ఫలప్రదమవుతాయని ఆశిద్దాం.

వ్యాసకర్త వ్యూహాత్మక అంశాల విశ్లేషకుడు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మీకేది ముఖ్యం?



మీరు ఒక ఫెస్టివల్ (చలన చిత్రోత్సవం) సినిమా తీయాలనుకుంటున్నారా లేక థియేటర్‌లో ప్రదర్శించేదా? నేను ఆదర్శపూర్వకంగా మాట్లాడుతున్నాను కావొచ్చు గానీ, మీరు నమ్మే సినిమాను తీయడం ముఖ్యం.

– నమ్రతా జోషి, సినీ విమర్శకురాలు

నమ్మగలమా?



శిక్ష నుంచి మినహాయింపు ఉండి (ఇంప్యూనిటీ), యూఎస్ గడ్డ నుంచి తీవ్రవాద బెదిరింపులకు పాల్పడుతున్న ఒక్క సిక్కు అతివాదిని ఇండియా లక్ష్యంగా చేసుకుందంటూ యూఎస్ కల్పిత కథనం ఒక పత్రికలో వచ్చింది. జో బైడెన్ ప్రభుత్వం నమ్మదగిన భాగస్వామి అని ఇండియాలో అనుకుంటున్నవాళ్లు కాస్త ఆలోచించుకోవాలని చెప్పడానికి ఇదొక ఉదాహరణ.

– బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల నిపుణుడు

పేరు ప్రాచీనం



నేను యూదుడిని అయినప్పటికీ, నా పేరులో 'ఖాలెద్' అని ఎందుకు ఉందని జనం అడుగుతూనే ఉంటారు. ఇస్లాం రావడానికి ముందే ఈ పేరు ఉనికిలో ఉందని తెలుసుకోండి.

– ఖాలెద్ హసన్, పరిశోధకుడు

వారే విజేతలు



సాహసోపేత జర్నలిజం కోసం ఉన్న ప్రతి అవార్డునూ ఈ యేడాది గెలుచుకోవడానికి పాలస్తీనా జర్నలిస్టులు అర్హులు.

– రానా అయూబ్, జర్నలిస్ట్

అదే ముఖ్యం



మీరు ఎన్ని ఉదయాలు సంతోషంగా నిద్రలేస్తున్నారు అనేదాన్ని బట్టి, విజయాన్ని నిర్వచించాలి.


– రిశద్ ప్రేమ్‌జీ, పారిశ్రామికవేత్త

ప్రగతిశీల సాహితీవేత్త

'వెనుక తరములవారి వీర చరితల సిరులు నార్పోసి త్యాగమ్ము నీర్వెట్టి పెంచరా, విరిసి సుఖములు పండురా' అనే స్ఫూర్తిమంతమైన సందేశాన్ని ముందు తరాలకు అందించిన దార్శనికుడు కామ్రేడ్ పులుపుల వెంకట శివయ్య. తన సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ కార్యకలాపాల ద్వారా 20వ శతాబ్దిలో తెలుగు నేలను ప్రభావితం చేసిన ప్రముఖులలో పులుపుల ప్రసిద్ధులు.

1910 నవంబర్ 14న పల్నాటి సీమలో జన్మించిన పులుపుల విద్యార్థిగానే స్వాతంత్య్రోద్యమంలో ప్రవేశించి జైలు పాలయ్యారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ (ఆనర్స్) చదివారు. కాశీ నుండి రాగి చెంబులో గంగాజలం పట్టుకు రాకుండా కమ్యూనిస్టు సాహిత్యాన్ని తీసుకువచ్చి, ఆంధ్రలో కమ్యూనిస్టు చైతన్య స్రవంతిని ప్రవహింపజేసిన ఆయన కమ్యూనిస్టు ఉద్యమ ఆద్యులలో ఒకరు. 1937, 38లలో కొత్తపట్టణం, మంతెనవారి పాలెంలో కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన రాజకీయ పాఠశాలలకు శివయ్య ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. స్వాతంత్య్ర సమరయోధునిగా, కమ్యూనిస్టు ఉద్యమ కార్యకర్తగా శివయ్య నెల్లూరు, అల్లీపురం, బళ్లారి జైళ్లలో 1930 ఉప్పు సత్యాగ్రహం నుండి 1944 వరకూ 38 నెలల జైలు జీవితం గడిపారు. 1952, 62లలో వినుకొండ శాసనసభ నియోజకవర్గం నుండి శాసనసభ్యునిగా ఎన్నికైనారు.

శివయ్య అభ్యుదయ సాహితీవేత్త. 1934లో ప్రారంభమైన 'ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం'లో క్రియాశీల పాత్ర పోషించారు. విలువైన గేయాలు, వ్యాసాలు రాశారు. ఆయన పలనాటి సీమను గురించిన సమగ్ర గీతం రాశారు. 'రాబోయే రోజుల్లో రాజయ్యే మొనగాడా/రాబోయే రోజుల్లో రచయించే బుగారా...' అని వైతాళిక గీతం ఆలపించిన కవి శివయ్య. ఆయన రాసిన 'రాజమండ్రిలో పంతులుగారు', 'గిడుగు గ్రాంథిక భాషావాదుల పాలిటి పిడుగు', 'భాష–పుట్టు పూర్వోత్త రాలు' చాలా విలువైన సమాచారంతో కూడిన సాహిత్య వ్యాసాలు.



శివయ్య 1944లో రాజమండ్రిలోని హితకారిణీ సమాజం కార్యదర్శి శివరావును కలిసి వీరేశలింగం రచనల పునర్ముద్రణకు హక్కులు సాధించారు. ఈనాడు వీరేశలింగం రచనలు మన చేతుల్లో ఉన్నాయంటే శివయ్యే కారణం. 'నయాగరా' కవిత్రయానికి శివయ్య మార్గదర్శి. 1943లో నరసరావుపేటలో ఏర్పడిన 'నవ్యకళా పరిషత్తు' సభ్యులైన అనిసెట్టి సుబ్బారావు, నయాగరా కవిత్రయం, రెంటాల గోపాలకృష్ణ వీరంతా ఆరుద్ర అన్నట్లు 'యవ్వనంలో పులుపుల వెంకటశివయ్యగారి రహస్య కమ్యూనిస్టు పాఠాల బోధనల వల్ల ప్రభావితులు' (రెంటాల గోపాలకృష్ణ కవితా సంపుటి 'శివ ధనువు'కు ఆరుద్ర రాసిన ముందు మాటలో).

1976 జూలై 14న మాస్కోలో మృతి చెందే నాటికి శివయ్య 'అరసం' గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షులుగా, 'ఆఫ్రికా–ఆసియా రచయితల సంఘం' ఆంధ్రప్రదేశ్ సమితి అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. 'ఈ నిరంకుశ రాజ్యమేలేటి కాలాన ఎలుగెత్తి పాడాను స్వాతంత్ర్య గీతాన్ని, మరణింపగాబోను అమరజీవిని నేను' అన్న మాటలకు నిదర్శనం శివయ్య జీవితం.

– పెనుగొండ లక్ష్మీనారాయణ,
అరసం జాతీయ అధ్యక్షులు

(రేపు గుంటూరులో 'కా॥ పులుపుల వెంకటశివయ్య గేయాలు–వ్యాసాలు' పుస్తకం ఆవిష్కరణ)

సామాజిక విప్లవానికి నాంది కులగణన

అభిప్రాయం



డానీ

గెలిచే అవకాశాలున్న పార్టీలో ఎన్నికల ముందు ఎక్కువ సీట్లు అడగడానికీ, గెలిచిన పార్టీలో ఎన్నికల తరువాత ఎక్కువ పదవులు కోరడానికీ రాజకీయ నాయకులు కులం కార్డును వాడడం సహజం. ఇలాంటి సందర్భాల్లో ప్రతీ కులం తన జనాభా సంఖ్యనూ, శాతాన్ని పెంచి చెపుతుంటుంది. ఈ శాతాలన్నింటినీ కూడితే సులువుగా 300 దాటుతుంది! ఎన్నికల సంవత్సరంలో కులగణన చర్చ మరింత వేడెక్కుతోంది.

సమాజంలో విభిన్న సమూహాల మధ్య సంబంధాలను నిర్ణయించడంలో వేల సంవత్సరాలుగా కులం ప్రధాన పాత్ర పోషిస్తున్న దేశం మనది. ప్రతి కులానికి ప్రత్యేకమైన చరిత్ర, సంస్కృతి ఉంటుంది. మన దేశంలో 5 వేలకు మించి కులాలున్నాయని అంచనా. కులాలతోనే మన దేశంలో సామాజిక అంతస్తుల దొంతర ఏర్పడుతోంది. వీటిని అర్థం చేసుకోవడానికి కులగణన ఒక చారిత్రక అవసరంగా మారింది. సామాజిక విప్లవానికి కులగణన నాంది పలుకుతుంది.

ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగంలోనే విద్యా, ఉపాధి రిజర్వేషన్లు కల్పించారు. సామాజిక వివక్షకు గురవుతూ, విద్యారంగంలో అవకాశాలు కోల్పోతున్న సమూహాల కోసం ఉద్దీపన చర్యలు చేపట్టడంలో చాలా తాత్సారం జరిగింది. 1979 జనవరి 1న ప్రధాని మొరార్జీ దేశాయి ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించడానికి 'సోషల్లీ అండ్ ఎడ్యుకేషనల్లీ బ్యాక్ వర్డ్ క్లాసెస్ కమిషన్'ను నియమించారు. స్వల్ప కాలం బిహార్ ముఖ్యమంత్రిగా పనిచేసిన బిందేశ్వరీ ప్రసాద్ మండల్‌ను చైర్మన్‌గా నియమించడంతో దానికి 'మండల్ కమిషన్' అనే పేరు వచ్చింది. రెండేళ్ళ పరిశీలన తరువాత 1980 డిసెంబరు 31న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీకి బీపీ మండల్ తన నివేదికను సమర్పిస్తూ ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సిఫార్సు చేశారు. ఇక్కడ ఒక విచిత్రం వుంది. మండల్ కమిషన్ ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ ఇమ్మందిగానీ, కులగణన నిర్వహించమనలేదు. బ్రిటిష్ కాలపు రికార్డుల ప్రకారం దేశంలో బీసీల జనాభా 54 శాతం ఉంటుందని అంచనా వేసి అందులో 50 శాతం అనగా 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సిఫార్సు చేసింది.

ఓబీసీ రిజర్వేషన్ల కేసు మీద అంతిమ తీర్పు రాకముందే 1990 ఆగస్టు 7న అప్పటి ప్రధాని వీపీ సింగ్ మండల్ కమిషన్ సిఫార్సుల్లో కొన్నింటిని అమలుపరచ బోతున్నట్టు ప్రకటించారు. అప్పటి రాజకీయ పరిస్థితుల్లో ఇది చాలా సాహసోపేతమైన నిర్ణయం. జనతాదళ్ నాయకుడైన వీపీ సింగ్‌కు లోక్ సభలో మెజారిటీ లేదు. ఎన్టీ రామారావు నాయకత్వంలోని నేషనల్ ఫ్రంట్ అభ్యర్థిగా రంగంలో దిగి, బయటి నుండి బీజేపీ ఇచ్చిన మద్దతుతో ఆయన 'మైనారిటీ ప్రభుత్వానికి' ప్రధాని అయ్యారు.

అప్పట్లో బీజేపీకి లోక్ సభలో 85 సీట్లున్నాయి. ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తే తన ఓటు బ్యాంకు అయిన ఓసీలు పార్టీకి దూరం అయిపోతారని ఆ పార్టీ భయపడింది. అప్పటి బీజేపీ అధ్యక్షులు ఎల్‌కే అడ్వాణి 1990 సెప్టెంబరు 25న సోమనాథ్ నుండి అయోధ్య వరకు 35



రోజుల 'రామ్ రథయాత్ర' మొదలెట్టారు. దీనికి రెండు లక్ష్యాలున్నాయి. మొదటిది; మండల్ కమిషన్ సిఫార్సుల అమలును అడ్డుకోవడానికి ఏకంగా వీపీ సింగ్ ప్రభుత్వాన్ని పడగొట్టడం. రెండోది, ముస్లింల మీద ద్వేషాన్ని రెచ్చగొట్టి హిందూ ఓటు బ్యాంకును సమీకరించడం. ఈ రెండు లక్ష్యాల రథయాత్రను రాజకీయ విశ్లేషకులు 'మండల్–కమండల్' అని పిలిచేవారు. బీజేపీ తన మద్దతును ఉపసంహరించుకోవడంతో 1990 నవంబరు 7న వీపీ సింగ్ ప్రభుత్వం పడిపోయింది.

రెండేళ్ల తరువాత 1992 నవంబరు 16న 'ఇంద్ర సహానీ కేసు'లో సుప్రీం కోర్టు ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను ఆమోదిస్తూ తుది తీర్పు ఇచ్చింది. అయితే, మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదనీ, క్రీమీలేయర్ కుటుంబాలను రిజర్వేషన్ పరిధి నుండి తప్పించాలనీ కొత్తగా రెండు నిబంధనలు పెట్టింది. సుప్రీం కోర్టు తీర్పు వచ్చిన పక్షం రోజుల్లోనే కరసేవకులు బాబ్రీ మసీదును కూల్చి వేశారు.

బ్రిటిష్ పాలకులు భారత దేశాన్ని పరిపాలించాలంటే ఇక్కడి సమాజ స్వభావాన్ని, ముఖ్యంగా కుల, మత స్వభావాలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాల్సిన అవసరముందని గుర్తించారు. 1881లో తొలిసారిగా జనగణన నిర్వహించారు. ఆ మరు సంవత్సరం అంటే 1882లో విలియం విల్సన్ హంటర్ నాయకత్వాన ఏర్పడిన కమిషన్ దేశంలో కులగణన నిర్వహించింది. అప్పటి నుండి ప్రతి పదేళ్ళకు ఒకసారి జనగణన కార్యక్రమం క్రమం తప్పకుండ సాగుతోంది. కానీ, కులగణన జరగలేదు.

స్వతంత్ర భారత దేశంలో తొలిసారిగా కులగణన చేపట్టిన ఘనత బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌కు దక్కుతుంది. దేశంలో అంతటి చొరవను చూపిన మరో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే. బిహార్‌లో 214 కులాలున్నట్టు తేలింది. అయితే, ఆంధ్రప్రదేశ్‌లో 7 వందలకు పైగా కులాలున్నట్టు అంచనా. ఆ లెక్కన ఏపీ కులగణన ప్రాజెక్టు బిహార్ కన్నా మూడు నాలుగు రెట్లు పెద్దది.

రెండేళ్ళ క్రితం బిహార్ రాష్ట్ర అఖిలపక్షం ఢిల్లీ వెళ్ళి కులగణన చేపట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్‌షాలను కోరింది. దానికి వాళ్ళు అంగీకరించలేదు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఎస్సీ, ఎస్టీ మినహా మరెవ్వరికీ కులగణన నిర్వహించడం తమ విధానం కాదని 2021 జులై 20న పార్లమెంటులో ఒక విస్పష్ట ప్రకటన చేశారు.

బీజేపీది ఒక విచిత్రమైన వ్యవహారం. ఒకవైపు, ఉచితాలు దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తాయి అంటుంది; ఎన్నికల ప్రచారంలో తామరతంపరగా ఉచితాలను ప్రకటిస్తుంది. ఒకవైపు, కులం వంటి సంకుచిత భావాలకు తాము దూరం అంటుంది. ఎన్నికలకు ముందు కుల సమ్మేళనాలు నిర్వహిస్తుంది. ఈ ఏడాది మొదట్లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీజేపీ నిర్వహించిన కుల సమ్మేళనాలను చూశాం. ఇప్పుడు ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మళ్ళీ అలాంటివే చూస్తున్నాం. ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ లో 'బీసీ సమ్మేళనం'లో పాల్గొన్నారు; నాలుగు రోజుల్లో మళ్ళీ వచ్చి 'మాదిగ సమ్మేళనం'లో పాల్గొన్నారు. కానీ, విధాన పరంగా వారు కులగణనకు వ్యతిరేకం.

నిజానికి సామాజిక న్యాయానికి కులగణన ఒక ప్రాతిపదిక అవుతుంది. సంక్షేమ పథకాలను అడగడానికి ప్రజలకూ, వాటిని రూపొందించడానికి ప్రభుత్వాలకూ అది ఆధారంగా మారుతుంది. ఇప్పుడు కులగణన 'ఇండియా కూటమి'కి కొత్త అస్త్రంగా మారింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధి ప్రతి సభలోనూ 'జిత్నీ ఆబాదీ; ఉత్నా హక్', 'జిస్కి జిత్ని భాగేదారీ; ఉస్కీ ఉత్నీ హిస్సేదారీ' (ఎంత జనాభో అంత హక్కు) అంటున్నారు. ఏపీలో తలపెట్టనున్న కులగణన విజయవంతం కావడం రాజకీయంగా వైసీపీ కన్నా సమాజానికి మరింత మేలు చేస్తుంది.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.త్రయోదశి సా.4.34 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** అశ్విని ప.2.57 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** ఉ.11.09 నుండి 12.37 వరకు, తదుపరి రా.12.16 నుండి 1.48 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.14 నుండి 7.42 వరకు, **అమృతఘడియలు:** ఉ.8.03 నుండి 9.54 వరకు, శనిత్రయోదశి; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.13, **సూర్యాస్తమయం:** 5.20.

క్లుప్తంగా...

నేడు 'హార్టీకల్చర్' ఆఖరి విడత కౌన్సెలింగ్

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని తొమ్మిది ఉద్యాన కళాశాలల్లో బీఎస్సీ (హార్టీకల్చర్) డిగ్రీ కోర్సులో ప్రవేశానికి ఆఖరి విడత కౌన్సెలింగ్ శనివారం పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని పరిపాలనా భవనంలో జరుగనుంది. గతంలో ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు, ఆసక్తి ఉండి దరఖాస్తు చేసుకోలేకపోయిన విద్యార్థులు కూడా హాజరుకావచ్చు. విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాల్సి ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు సంబంధించి 100 సీట్లకు పైగా కౌన్సెలింగ్ జరుగుతుందని, ఇతర వివరాలకు ఉద్యాన వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడవచ్చునని రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు పేర్కొన్నారు.

నిట్‌లో పీహెచ్‌డీకి దరఖాస్తుల ఆహ్వానం



తాడేపల్లిగూడెం: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌లో 2023 సెషన్‌కు సంబంధించి పీహెచ్‌డీ, ఎంఎస్‌బై రీసెర్చ్ కోర్సులకు గాను ఫుల్‌టైం, పార్ట్‌టైం అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్టు అకడమిక్ డీన్ డాక్టర్ టి.కురుమయ్య శుక్రవారం ఒక ప్రకటన తెలిపారు. ఫుల్‌టైం అభ్యర్థులు మాస్టర్ డిగ్రీతో పాటు గేట్‌లో తప్పనిసరిగా అర్హత సాధించాలని పేర్కొన్నారు. పార్ట్‌టైం అభ్యర్థులు మాస్టర్ డిగ్రీతో పాటు ఏదైనా అకడమిక్ ఇన్‌స్టిట్యూట్‌లో గానీ, పరిశ్రమలో గానీ రెండేళ్లు పనిచేసిన అనుభవం ఉండాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు డిసెంబర్ ఒకటో తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 12 విభాగాలకు సంబంధించి మొత్తం 52 పీహెచ్‌డీ సీట్లు ఉన్నాయని వెల్లడించారు. ఇందులో ఫుల్‌టైం 42, పార్ట్‌టైం 10 ఉన్నాయని తెలిపారు. అర్హులైన వారు రాత పరీక్ష, ముఖాముఖి పద్ధతుల ద్వారా ఎంపిక చేస్తామని అడ్మిషన్ల అధికారి డాక్టర్ పి.తపస్ వివరించారు.

5 వర్సిటీలకు ఇన్‌చార్జ్ వీసీల నియామకం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 5 విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ల పదవీకాలం శుక్రవారం ముగియడంతో ఇన్‌చార్జి వీసీలను నియమిస్తూ ఉన్నత విద్య ముఖ్యకార్యదర్శి జె.శ్యామలరావు ఉత్తర్వులిచ్చారు. ఏయూలో రెక్టార్‌గా పనిచేస్తున్న కె.సమతను ఏయూ ఇన్‌చార్జి వీసీగా నియమించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి విక్రమ సింహపురి వీసీ జీఎం సుందరవల్లి, శ్రీకృష్ణదేవరాయ వర్సిటీకి యోగి వేమన వర్సిటీ వీసీ చింతా సుధాకర్, రాయలసీమ వర్సిటీకి అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీ వీసీ ఫజుల్ రెహమాన్, ద్రవిడియన్ వర్సిటీకి శ్రీపద్మావతి మహిళా వర్సిటీ వీసీ డి.భారతికి ఇన్‌చార్జి వీసీలుగా బాధ్యతలప్పగించారు. రెగ్యులర్ వీసీలను నియమించే వీరు ఆయా వర్సిటీలకు ఇన్‌చార్జిలుగా వ్యవహరించనున్నారు.

ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో టౌన్ ప్లానింగ్ ఓవర్‌సీర్ ఫలితాలు

సాక్షి, అమరావతి: ఏపీ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ విభాగంలో టౌన్ ప్లానింగ్ అండ్ బిల్డింగ్ ఓవర్‌సీర్ పోస్టు భర్తీ నియామక ఫలితాలను కమిషన్ వెబ్‌సైట్ https://psc.ap.gov.in లో ఉంచినట్టు ఏపీపీఎస్సీ కార్యదర్శి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీన్ని అభ్యర్థులు గమనించాలని పేర్కొన్నారు.

అంతర్రాష్ట్ర 'సైబర్' ముఠా గుట్టురట్టు

- ఐదుగురు అరెస్టు
- కాజేసిన సొమ్ము దుబాయ్‌లో విత్ డ్రా
- 16 ఫేక్ అకౌంట్ల ద్వారా రూ.35.59 కోట్ల లావాదేవీలు
- కీలక సూత్రధారి కింగ్ పిన్ కోసం ముమ్మర గాలింపు


టెక్నికల్ టీమ్‌ను అభినందిస్తున్న అనంతపురం జిల్లా ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: అమాయక ప్రజల కష్టార్జితాన్ని కమీషన్ల పేరుతో కాజేసే అంతర్రాష్ట్ర ముఠా గుట్టును రట్టు చేసిన అనంతపురం పోలీసులు ఐదుగురు సైబర్ నేరగాళ్లను శుక్రవారం అరెస్టు చేశారు. ఈ ముఠా 16 ఫేక్ అకౌంట్ల ద్వారా ఏపీలో రూ.35.59 కోట్ల లావాదేవీలు జరిపినట్లు తేల్చి.. రూ.14.72 లక్షలను ఫ్రీజ్ చేయించారు. ఈ 16 ఫేక్ అకౌంట్ల నుంచి మరో 172 ఫేక్ అకౌంట్లలోకి సొమ్మును మళ్లించారు. ఇలా దేశవ్యాప్తంగా జరిగిన లావాదేవీలను అంచనా వేస్తే రూ. 350 కోట్లకు పైగానే కొల్లగొట్టినట్లు పోలీసుల అంచనా. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ స్థానిక పోలీసు కార్యాలయంలో వివరాలు వెల్లడించారు.

ఇలా వెలుగులోకి..

అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కల్లూరు అగ్రహారం గ్రామానికి చెందిన అనిల్ కుమార్ తనకు జరిగిన సైబర్ మోసంపై జిల్లా పోలీసు కార్యాలయం స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గార్లదిన్నె పోలీసు స్టేషన్లో ఈ నెల 15న కేసు నమోదయ్యింది. దీంతో తీగలాగితే డొంక కదిలింది.

ఐదుగురు అరెస్టు ..

ఈ కేసును సవాలుగా తీసుకున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాలతో ప్రత్యేక పోలీసు బృందాలు దర్యాప్తు ప్రారంభించాయి. ఈ క్రమంలో నిందితులకు సంబంధించిన కొన్ని ఆధారాలు లభించాయి. ఉత్తర భారత దేశానికి చెందిన కింగ్ పిన్‌ను కీలక సూత్రధారిగా గుర్తించిన అనంత పోలీసులు.. కింగ్ పిన్ ముఠాలో పనిచేస్తున్న తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన మహ్మద్ సమ్మద్, వెంకటగిరికి చెందిన వెంకటాచలం, తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన సందీప్, ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన అజయ్‌రెడ్డి, అనంతపురానికి చెందిన సంధ్యారాణిని అరెస్టు చేశారు. కింగ్ పిన్ కోసం విస్తృతంగా గాలిస్తున్నారు. కాగా ప్రస్తుతం అరెస్టయిన ముఠా సభ్యులకు కింగ్‌పిన్ నుంచి కమీషన్ రూపంలో రూ.20 లక్షలకు పైగా అందడం గమనార్హం.

వివిధ రూపాల్లో మోసాలు..

యూట్యూబ్ యాడ్స్ సబ్ స్క్రైబ్, రేటింగ్‌లకు అధిక కమీషన్లు, ఆన్‌లైన్ గేమింగ్, ఓటీపీ, పార్ట్ టైం జాబ్స్ ఇలా రకరకాల పేర్లతో సైబర్ నేరగాళ్లు మోసాలకు తెగబడ్డారు. వీరిపై దేశవ్యాప్తంగా నేషనల్ క్రైం రికార్డు బ్యూరో (ఎన్‌సీఆర్బీ) పోర్టల్‌లో 1,550 ఫిర్యాదులు నమోదయ్యాయి. రూ.350 కోట్లకు పైగా లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఇలా దోపిడీ చేసిన సొమ్మును దుబాయ్‌లో డ్రా చేస్తున్నట్లు తేల్చారు.

అప్రమత్తంగా ఉండాలి..

సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. నిరుద్యోగ యువతను కొన్ని సైబర్ ముఠాలు లక్ష్యంగా చేసుకున్నాయి. అనవసరమైన లింకులు, వాట్సాప్ కాల్స్, మెసేజీలకు స్పందించొద్దు. ఏదైనా సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 సైబర్ పోర్టల్, స్థానిక పోలీసు స్టేషన్లో సమాచారం ఇవ్వాలి.

– కేకేఎన్ అన్బురాజన్, జిల్లా ఎస్పీ, అనంతపురం

శాస్త్రోక్తంగా కైశికద్వాదశి ఆస్థానం


మాడవీధుల్లో ఊరేగుతున్న ఉత్సవ మూర్తులు

తిరుమల: కైశిక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీవారి ఆలయంలో శుక్రవారం కైశిక ద్వాదశి ఆస్థానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 4.45 నుంచి 5.45 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఉగ్ర శ్రీనివాసమూర్తి ఆలయ మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వేంకటతురైవార్, స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి భూదేవి సమేతంగా ఒక్క కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు మాడవీధులలో ఊరేగిస్తారు. అనంతరం ఉదయం 6 నుంచి ఉదయం 7.30 గంటల వరకు స్వామి, అమ్మవార్లను బంగారు వాకిలి చెంత వేంచేపు చేసి అర్చకులు పురాణ పఠనంతో కైశిక ద్వాదశి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తిరుమల పెద్ద జీయర్‌స్వామి, తిరుమల చిన్నజీయర్‌స్వామి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు పలువురు పాల్గొన్నారు.తిరుమల వసంత మండపంలో శ్రీతులసి దామోదర పూజ ఘనంగా నిర్వహించారు. అలాగే తిరుమలలో చక్రతీర్థ ముక్కోటి శాస్త్రోక్తంగా జరిపారు.

26న కార్తీక పర్వదీపోత్సవం..27న పౌర్ణమి గరుడసేవ

శ్రీవారి ఆలయంలో ఆదివారం సాలకట్ల కార్తీక పర్వదీపోత్సవం జరగనుంది. శ్రీవారికి సాయంకాల కైంకర్యాలు, నివేదనలు పూర్తయిన తర్వాత ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయంలో సహస్రదీపాలంకరణ సేవను టీటీడీ రద్దు చేసింది. కాగా, పౌర్ణమి సందర్భంగా శ్రీవారి ఆలయంలో ఈ నెల 27న గరుడసేవ జరగనుంది. రాత్రి ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల నడుమ సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడునిపై తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు.

ఏసీబీకి చిక్కిన ఆర్థిక శాఖ సెక్షన్ అధికారి

- జగనన్న విదేశీ విద్యా దీవెన స్కాలర్‌షిప్ మంజూరుకు రూ.50 వేలు లంచం డిమాండ్
- రూ.40 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



సాక్షి, అమరావతి/నగరంపాలెం: జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం లబ్ధిదారు నుంచి రూ.40వేలు లంచం తీసుకుంటూ రాష్ట్ర సచివాలయంలో ఆర్థిక శాఖ(సంక్షేమ విభాగం-2) సెక్షన్ అధికారి ఒంటెద్దు నాగభూషణ్ రెడ్డి ఏసీబీకి చిక్కారు. వివరాల్లోకి వెళితే...గుంటూరు నగరం కొరిటెపాడులోని గౌతమినగర్ 4వ వీధికి చెందిన ఒంటెద్దు నాగభూషణరెడ్డి వెలగపూడి ఏపీ సచివాలయంలో ఆర్థిక శాఖ భవనం-2 (సంక్షేమం-2)లో సెక్షన్ అధికారిగా ఉన్నారు. మైనార్టీ విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన విదేశీ విద్యా దీవెన పథకానికి కర్నూలులోని బాలాజీనగర్‌కు చెందిన మహమ్మద్ నదీమ్ హుస్సేన్ తన కుమారుడు అజంతుల్లా షరీఫ్ కోసం దరఖాస్తు చేశారు. దీంతో అజంతుల్లా షరీఫ్‌కు సుమారు రూ.15 లక్షలు మంజూరయ్యాయి. అయితే మంజూరైన ఉపకార వేతనం విడుదల చేసేందుకు సెక్షన్ అధికారి నాగభూషణరెడ్డి దరఖాస్తుదారు మహమ్మద్ నదీమ్ హుస్సేన్‌ను రూ.50 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు కర్నూలు జిల్లాలోని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులను ఆశ్రయించాడు. వారు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఏసీబీ అధికారులకు ఫిర్యాదును బదలాయించారు. ఈ క్రమంలో మహమ్మద్ నదీమ్ హుస్సేన్ శుక్రవారం ఉదయం 10.10 గంటలకు నాగభూషణరెడ్డికి సచివాలయ ఆవరణలోని పార్కింగ్ ప్రదేశంలో రూ.40 వేలు లంచం ఇవ్వగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ప్యాంట్ జేబులోని డబ్బులను స్వాధీనం చేసుకున్నారు. నాగభూషణ్ రెడ్డిపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. బాధితుడు తొలుత రూ.10 వేలు ఫోన్ పే చేసినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఏసీబీ అదనపు ఎస్పీ మహేంద్ర మత్తే, అధికారులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా సత్యదేవుని తెప్పోత్సవం


పంపానదిలో హంస వాహనంపై విహరిస్తున్న సత్యదేవుడు, అమ్మవార్లు

అన్నవరం/అరసవల్లి: కాకినాడ జిల్లా అన్నవరంలోని రత్నగిరిపై వెలసిన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి తెప్పోత్సవం క్షీరాబ్ధి ద్వాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం రాత్రి పంపా నదిలో కన్నుల పండువగా జరిగింది. సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన హంసవాహనంపై సత్యదేవుడు, అమ్మవార్లు నదిలో విహరించారు. ఈ తెప్పోత్సవానికి భక్తులు వేల సంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం 5-30 గంటలకు సత్యదేవుడు, అమ్మవార్లను, క్షేత్రపాలకులు సీతారాములను రత్నగిరి నుంచి ఊరేగింపుగా పంపా తీరాన గత పూజా మండపం వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 6-30 గంటలకు స్వామి అమ్మవార్లను హంస వాహనంపై కూర్చోబెట్టి తెప్పోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కే రామచంద్ర మోహన్, ఏసీ రమేష్‌బాబు పాల్గొన్నారు. సుమారు 150మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వైభవంగా ఆదిత్యుని తెప్పోత్సవం

ప్రఖ్యాత అరసవల్లి ఆదిత్య క్షేత్రంలో క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా శుక్రవారం తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు.


ఇంద్ర పుష్కరిణిలో విహరిస్తున్న ఆదిత్యుని హంస వాహనం

ఉషాపద్మినిఛాయా దేవేరులతో స్వామి వారు హంస వాహనంపై పవిత్ర ఇంద్రపుష్కరిణిలో 12 సార్లు జలవిహారం చేశారు. అలాగే రోజంతా ఆదిత్యుడు పూర్తి స్వర్ణాలంకరణలో దర్శనమిచ్చారు. ఈ అద్భుత దృశ్యాలను తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ సమక్షంలో హంస నావలో శ్రీచక్రార్చన పూజలు నిర్వహించారు.

ఉపాధ్యాయులు డిజిటల్ బోధనను అందించాలి

సాక్షి, అమరావతి: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు నిర్మాణాత్మక పాత్ర పోషించాలని సమగ్ర శిక్ష రాష్ట్ర పీడీ బీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆంధ్రా లయోలా కాలేజీ ప్రాంగణంలో 'రాష్ట్ర సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలల్లో 9, 10 తరగతులకు నిర్మాణాత్మక బోధన శాస్త్రంలో పాఠ్య ప్రణాళిక తయారీ' పై వర్క్‌షాపు నిర్వహించారు. విద్యార్థులకు డిజిటల్ పద్ధతిలో బోధన అందించాలని సూచించారు. సీబీఎస్ఈ పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేలా బోధన ప్రణాళిక ఉండాలన్నారు. త్వరలోనే ఐఐటీ, ఐఎస్ఈఆర్ (తిరుపతి) అధ్యాపకులతో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తామన్నారు. రెసిడెన్షియల్ విధానంలో దశల వారీగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తూ వారి అభ్యాసన సామర్థ్యాన్ని పరీక్షిస్తామన్నారు.

శ్రీకాకుళం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సస్పెన్షన్

సీఐ సహా ఏడుగురు ఉద్యోగులపై వేటు

సాక్షి, అమరావతి: శ్రీకాకుళం జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సేల్స్‌మెన్, సూపర్‌వైజర్లు, మద్యం దుకాణాల భవనాల యజమానుల నుంచి భారీగా లంచాలు వసూలు చేసిన ఎక్సైజ్‌శాఖ అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. శ్రీకాకుళం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్, డిపో మేనేజర్ వై.ఆదినారాయణమూర్తితోపాటు ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ కె.మల్లికార్జునరావు, అకౌంటెంట్ సోమేశ్వరరావు, మద్యం షాపు సూపర్‌వైజర్లు సకలాబత్తుల నీలకంఠం, కె.రామోజీరావు, సేల్స్‌మ్యాన్ ఎ.సంతోష్, మరో షాప్ సూపర్‌వైజర్, టీఎఫ్‌సీ సూపర్‌వైజర్‌ను ఎక్సైజ్ శాఖ సస్పెండ్ చేసింది. ఈ మేరకు ఎక్సైజ్‌శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాకుళం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్, డిపో మేనేజర్ వై.ఆదినారాయణమూర్తి, కొందరు ఎక్సైజ్ శాఖ ఉద్యోగుల ద్వారా ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని సేల్స్‌మెన్, సూపర్‌వైజర్ల నుంచి భారీ వసూళ్లకు పాల్పడ్డారు. వారిని ఉద్యోగాల్లో కొనసాగించాలంటే తమకు లంచాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వ మద్యం దుకాణాలు నిర్వహిస్తున్న భవనాల లీజులను పొడిగించేందుకు కూడా యజమానుల నుంచి డబ్బులు డిమాండ్ చేశారు. ఈ వ్యవహారం జిల్లావ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. దీనిని తీవ్రంగా పరిగణించిన ఎక్సైజ్ శాఖ విచారణకు ఆదేశించింది. ఆదినారాయణమూర్తితోపాటు ఇతర ఉద్యోగులపై వచ్చిన ఆరోపణలు వాస్తవమని నిర్ధారణ కావడంతో వారిని సస్పెండ్ చేసింది. పల్నాడు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.సుబ్బారావును శ్రీకాకుళం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేసింది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు దుర్మరణం



నారాయణవనం బైపాస్ వద్ద కాలేజ్ వ్యాన్‌ను ఢీకొట్టిన కారు


కావలి వద్ద జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

- తిరుపతి జిల్లాలో స్కూల్ బస్సును ఢీకొట్టిన కారు, నలుగురు మృతి
- కావలిలో మహిళను, కంటైనర్‌ను ఢీకొన్న కారు, ముగ్గురు మృతి

నారాయణవనం/కావలి: తిరుపతి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి... తిరుపతి జిల్లా, పుత్తూరు మండలం, పరమేశ్వరమంగళానికి చెందిన రమేశ్ నాయుడు (60), భార్య పుష్ప (55), వదిన వనజాక్షి (60), సమీప బంధువులు భాను, శివమ్మ కారులో నిశ్చితార్థానికి చెన్నైలోని పెరంబూరు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కారు నారాయణవనం బైపాస్ వద్ద వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి, ఎదురుగా వస్తున్న కాలేజ్ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో రమేశ్ నాయుడు, పుష్ప, వనజాక్షి, భాను అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడ్డ శివమ్మను పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మరో ఘటనలో... హైదరాబాద్ నుంచి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు కారులో తిరుమల వచ్చారు. తిరుగు ప్రయాణంలో కారు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కావలి సమీపంలోని మద్దూరుపాడు వద్ద గడ్డిమోపుతో రోడ్డు దాటుతున్న కరకమిట్ల సుబ్బమ్మ (55)ను ఢీకొంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం అంతే వేగంతో ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న మహంకాళి సునీత (40), డ్రైవర్ జీవన్ కుమార్ (45) అక్కడికక్కడే మృతి చెందగా, భవాని (57), శేఖర్ (58) తీవ్రంగా గాయపడ్డారు.

ఈ ప్రదర్శనను ఆపండి...!

యూపీ మంత్రిని వారించిన వీర జవాను తల్లి

న్యూఢిల్లీ: ఒక వైపు కన్నకొడుకును కోల్పోయి పుట్టెడు దుఃఖంలో మునిగి ఉన్న ఓ మాతృమూర్తి..పరిహారం చెక్కు ఇస్తూ ఫొటో తీయించుకోవాలనే మంత్రి యావను చూసి అసహనం వ్యక్తం చేశారు. 'ఈ ప్రదర్శనను ఆపండి' అంటూ అక్కడున్న వారిని వేడుకున్నారు. యూపీలో చోటుచేసుకున్న ఈ ఘటన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. మంత్రి తీరును ప్రతిపక్ష పార్టీల నేతలు తీవ్రంగా ఎండగట్టారు. జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీలో గురువారం ఉగ్రవాదులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో యూపీలోని ఆగ్రాకు చెందిన కెప్టెన్ శుభమ్ గుప్తా అసువులు బాశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున పరిహారం చెక్కు అందజేసేందుకు మంత్రి యోగేంద్ర ఉపాధ్యాయ్ శుక్రవారం ఆయన కుటుంబాన్ని కలుసుకున్నారు. తీవ్ర శోకంలో ఉన్న కెప్టెన్ శుభమ్ గుప్తా తల్లితో మంత్రి మాట్లాడారు. అనంతరం పరిహారం చెక్కు ఇచ్చేందుకు మంత్రి ప్రయత్నించగా ఆమె తీసుకోలేదు. 'నాకు ఏమీ వద్దు, ఈ ఎగ్జిబిషన్(ప్రదర్శని మత్ లగావో)ను ఇక ఆపండి' అంటూ వేడుకున్నా చెక్కును అలాగే పట్టుకుని ఫొటో తీయించుకునేందుకు మంత్రి ప్రయత్నిస్తున్నట్లు వీడియోలో రికార్డయింది.

అదానీ గ్రూప్‌పై ఆధారాలున్నాయా?

సీనియర్ లాయర్ ప్రశాంత్ భూషణ్‌కు సుప్రీంకోర్టు ప్రశ్న

న్యూఢిల్లీ: విదేశీ రిపోర్టులను సాక్ష్యాధారాలుగా పరిగణించలేమని, అందులోని అంశాలను స్వచ్ఛమైన నిజాలుగా భావించలేమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. భారత్‌కు చెందిన అదానీ గ్రూప్ ఇద్దరు విదేశీ ఇన్వెస్టర్ల ద్వారా ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడిందని ఆరోపిస్తూ ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు (ఓసీసీఆర్పీ) అనే విదేశీ స్వచ్ఛంద సంస్థ ఓ నివేదిక విడుదల చేసిన సంగతి తెలిసిందే. అమెరికా బిలియనీర్ జార్జి సోరోస్ ఈ సంస్థను స్థాపించారు. ఈ నివేదిక వెలువడిన నేపథ్యంలో.. అక్రమాలకు పాల్పడిన అదానీ గ్రూప్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు వ్యక్తులు సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం తాజాగా విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ హాజరయ్యారు. ''విదేశీ నివేదికలను కచ్చితంగా నిజాలుగా ఎందుకు స్వీకరించాలి? ఓసీసీఆర్పీ నివేదికను మేము తోసిపుచ్చడం లేదు. కానీ, అదానీ గ్రూప్ అక్రమాలకు పాల్పడినట్లు సాక్ష్యాధారాలు కావాలి. అదానీ గ్రూప్‌నకు వ్యతిరేకంగా మీ దగ్గరున్న ఆధారాలేమిటి?'' అని ప్రశాంత్ భూషణ్‌ను ప్రశ్నించింది.

రిషి సునాక్ పాపులారిటీ రేటింగ్ 25%

లండన్: యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) ప్రధానమంత్రి రిషి సునాక్‌కు, అధికార కన్జర్వేటివ్ పార్టీకి ఇదొక పెద్ద ఊరట. ఇటీవల మంత్రివర్గంలో మార్పుల తర్వాత సునాక్ ప్రభుత్వానికి కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. పార్టీలో అసమ్మతి మొదలైంది. అయితే, శీతాకాల బడ్జెట్‌లో కొన్నిరకాల పన్నులను తగ్గించనున్నట్లు ప్రకటించారు. దీంతో రిషి సునాక్‌తోపాటు ప్రభుత్వానికి ప్రజాదరణ స్వల్పంగా పెరిగినట్లు తాజాగా 'ద టైమ్స్' పత్రిక నిర్వహించిన ఓపీనియన్ పోల్స్‌లో వెల్లడయ్యింది. బడ్జెట్‌ను బుధవారం పార్లమెంట్‌లో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. పన్ను మినహాయింపుల పట్ల ప్రజలు సానుకూలంగా స్పందించారు. సర్వేలో సునాక్ ప్రభుత్వ పాపులారిటీ రేటింగ్ 25 శాతానికి చేరినట్లు తేలింది. గత వారంతో పోలిస్తే ఇది 4 పాయింట్లు అధికం కావడం విశేషం. ఇటీవలి కాలంలో కన్జర్వేటివ్ పార్టీకి దక్కిన అత్యధిక రేటింగ్ ఇదే. ఇదిలా ఉండగా, ప్రతిపక్ష లేబర్ పార్టీ రేటింగ్‌లో ఎలాంటి మార్పు జరగలేదు. ప్రజాదరణ 44 శాతంగానే ఉన్నట్లు సర్వే వెల్లడించింది.

సత్యేందర్ జైన్ బెయిల్ గడువు మళ్లీ పొడిగింపు

న్యూఢిల్లీ: మనీల్యాండరింగ్ ఆరోపణలెదుర్కొంటున్న ఢిల్లీ మాజీ మంత్రి సత్యేందర్ జైన్ మధ్యంతర బెయిల్ గడువును సుప్రీంకోర్టు మరోసారి పొడిగించింది. బెయిల్ గడువు శుక్రవారంతో ముగియడంతో జస్టిస్ ఏఎస్ బొపన్న సారథ్యంలోని ధర్మాసనం విచారించాల్సి ఉంది. ఆయన అందుబాటులో లేకపోవడంతో జస్టిస్ బేలా ఎం. త్రివేది బెయిల్ గడువును డిసెంబర్ 4వ తేదీ వరకు పొడిగిస్తూ ఆదేశాలిచ్చారు. జైన్ పెట్టుకున్న రెగ్యులర్ బెయిల్ దరఖాస్తుపై విచారణ కూడా అదే రోజున ఉంటుందని స్పష్టం చేశారు. మనీ ల్యాండరింగ్ ఆరోపణలపై గత ఏడాది మేలో జైన్‌ను ఈడీ అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే.

భారత్ అప్పీల్‌ను స్వీకరించిన ఖతార్ కోర్టు

న్యూఢిల్లీ: భారత నేవీకి చెందిన 8 మంది మాజీ అధికారులకు మరణశిక్ష పడిన కేసులో భారత ప్రభుత్వం పెట్టుకున్న అప్పీల్‌ను ఖతార్ న్యాయస్థానం స్వీకరించింది. ఈ పరిణామంపై భారత విదేశాంగ శాఖ స్పందించలేదు. అక్కడి కోర్టు ఈ కేసుపై త్వరలో విచారణ చేపట్టవచ్చని భావిస్తున్నారు. ఖతార్‌లోని అల్ దహ్రా సంస్థలో పనిచేస్తున్న భారత నేవీ మాజీ అధికారులను గూఢచర్యం ఆరోపణలపై గత ఏడాది ఆగస్టులో అధికారులు అరెస్ట్ చేశారు. విచారణ జరిపిన ఖతార్ ఫస్ట్ ఇన్‌స్టాన్స్ కోర్టు వారికి మరణశిక్ష విధిస్తూ అక్టోబర్ 26న తీర్పు వెలువరించింది.

'చీఫ్ సెక్రటరీ' వివాదానికి సుప్రీం పరిష్కారం

న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నియామకంపై కేంద్రం, ఆప్ ప్రభుత్వం మధ్య నలుగుతున్న వివాదానికి సుప్రీంకోర్టు ఒక పరిష్కారమార్గం చూపింది. చీఫ్ సెక్రటరీ హోదాకు అర్హులైన అయిదుగురు సీనియర్ పరిపాలనాధికారుల పేర్లను ఈనెల 28న ఉదయం 10.30 గంటల్లోగా సూచించాలని కేంద్రాన్ని కోరింది. అందులో నుంచి ఒకరి పేరును అదే రోజు ఎంపిక చేసుకుని, ఈ వివాదానికి ముగింపు పలకాలని ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. తమతో ఎటువంటి సంప్రదింపులు జరపకుండా కొత్తగా చీఫ్ సెక్రటరీని కేంద్రం నియమించజాలదంటూ ఢిల్లీ ప్రభుత్వం వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం ఈ సూచనలు చేసింది. అంతకుముందు, కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీలోని ఆప్ సర్కార్ చీఫ్ సెక్రటరీ నియామకం విషయంలో పోటాపోటీగా వాదనలు వినిపించాయి.

మందు పాతర పేలి.. ఇద్దరు కూలీలు మృతి

చర్ల(తెలంగాణ): పోలీసు బలగాలను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టులు ఏర్పాటుచేసిన మందు పాతర పేలి ఇద్దరు కూలీలు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూంబింగ్‌కు వచ్చే బలగాలే లక్ష్యంగా మావోయిస్టులు మందు పాతరలను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం నారాయణపూర్ జిల్లా చోటే డోంగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజ్‌పూర్‌కు చెందిన కూలీలు గనుల వద్దకు అటవీ మార్గాన వెళ్తున్నారు. పొరపాటున మందుపాతరపై కాలు పెట్టిన ఇద్దరు కూలీలు ప్రాణాలు కోల్పోయారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.

బిల్లులను అడ్డుకొనే స్వేచ్ఛ గవర్నర్లకు లేదు: సుప్రీం

న్యూఢిల్లీ: రాష్ట్రాల గవర్నర్ల తీరుపై అత్యున్నత న్యాయస్థానం మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేసింది. అధికారాన్ని దుర్వినియోగం చేయవద్దని గవర్నర్లకు సూచించింది. అసెంబ్లీలో తీర్మానించిన బిల్లులపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా నిరవధికంగా పెండింగ్‌లో కొనసాగించడం తగదని తేల్చిచెప్పింది. అలాంటి స్వేచ్ఛ గవర్నర్లకు లేదని స్పష్టం చేసింది. ప్రజల చేత ఎన్నిక కాని గవర్నర్లకు రాజ్యాంగబద్ధంగా కొన్ని అధికారాలు ఉన్నప్పటికీ రాష్ట్రాల శాసనసభల్లో చట్టాలు చేసే ప్రక్రియను అడ్డుకోవడానికి ఆ అధికారాలను ఉపయోగించుకోవద్దని హితవు పలికింది. ఇలాంటి చర్యలు ప్రజల చేత ఎన్నికైన ఎమ్మెల్యేల అధికారాన్ని తగ్గించేలా ఉంటాయని తేల్చిచెప్పింది. అసెంబ్లీలో తీర్మానించిన నాలుగు కీలక బిల్లులపై గవర్నర్ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ పంజాబ్‌లోని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ నెల 10న 27 పేజీల తీర్పు వెలువరించింది. ఈ తీర్పు వివరాలను సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. రాష్ట్రపతి నియమించే గవర్నర్ రాష్ట్రానికి నామమాత్ర అధిపతి మాత్రమేనని ఉద్ఘాటించింది. ఈ ఏడాది జూన్ 19, 20వ తేదీల్లో పంజాబ్ అసెంబ్లీలో తీర్మానించిన బిల్లులపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని గవర్నర్ భన్వరీ లాల్ పురోహిత్‌ను ధర్మాసనం ఆదేశించింది.

అతి పెద్ద ఐస్‌బర్గ్...
40 ఏళ్ల తర్వాత కదిలింది

గ్లోబల్ వార్మింగే కారణం | క్రమంగా కరిగిపోతున్న వైనం

అది ప్రపంచంలోనే అతి పెద్ద ఐస్‌బర్గ్. పేరు ఏ23ఏ. విస్తీర్ణం ఏకంగా 4,000 చదరపు కిలోమీటర్లు. మరోలా చెప్పాలంటే పరిమాణంలో గ్రేటర్ లండన్‌తో పోలిస్తే రెండింతలకు పై చిలుకే. అంతటి విస్తీర్ణంతో, ఏకంగా 400 మీటర్ల మందంతో భారీ సైజుతో అలరారుతూ చూసేందుకది ఓ మంచు ద్వీపకల్పంలా కన్పించేది. అలాంటి ఐస్‌బర్గ్ దాదాపు 40 ఏళ్ల తర్వాత కదలడం మొదలు పెట్టింది. ఈ పరిణామం పర్యావరణ నిపుణులను ఆందోళన పరుస్తోంది. గ్లోబల్ వార్మింగ్ తాలూకు దుష్పరిణామాలకు దీన్ని తాజా సంకేతంగా వారు భావిస్తున్నారు...

1986 నుంచీ...

ఏ23ఏ ఐస్‌బర్గ్ అప్పుడెప్పుడో 1985 చివర్లో అంటార్కిటికా తీరం నుంచి విడిపోయింది. అంటార్కిటికా తాలూకు అతి పెద్దదైన ఫిల్క్‌నర్ మంచు ఫలకం నుంచి విడిపోయిన భారీ ఐస్‌బర్గ్‌ల్లోకెల్లా పెద్దదిగా ఇది రికార్డులకెక్కింది. అప్పటికే ఏ23ఏపై సోవియట్ యూనియన్ ఒక పరిశోధన కేంద్రం కూడా ఏర్పాటు చేసుకుంది! అందులోని సామగ్రినంతటినీ అది హుటాహుటిన తరలించడం మొదలు పెట్టింది. కానీ కొద్దిపాటి ప్రయాణం అనంతరం 1986కల్లా అంటార్కిటికా పరిధిలోని వెడెల్ సముద్రంలో ఐస్‌బర్గ్ నిశ్చలంగా నిలిచిపోయింది. ఒకరకంగా సముద్రం తాలూకు అడుగు భాగంతో కలిసిపోయి అలా నిలబడిపోయింది.

కరిగిపోతోంది...

ఇంతకాలం నిశ్చలంగా ఉన్నది కాస్తా ఏ23ఏ ఇప్పుడు మరోసారి కదులుతోంది. దీనికి కారణాలపై సైంటిస్టులంతా దృష్టి సారించగా, ఇది అంటార్కిటికా సముద్ర జలాల ఉష్ణోగ్రత క్రమంగా పెరుగుతున్న ఫలితమేనని తేలింది! ''దాదాపు 40 ఏళ్ల కాలగమనంలో ఐస్‌బర్గ్ పరిమాణంలో కుంచించుకుపోయింది. దానికి గ్లోబల్ వార్మింగ్ తోడైంది'' బ్రిటిష్ అంటార్కిటిక్ సర్వే రిమోట్ సెన్సింగ్ నిపుణుడు డాక్టర్ ఆండ్రూ ఫ్లెమింగ్ తెలిపారు. వాస్తవానికి ఏ23ఏలో 2020లోనే అతి తక్కువ స్థాయిలో కదలికలు మొదలయ్యాయని చెప్పుకొచ్చారు. సముద్ర పవనాల హోరు, ప్రవాహాల జోరుకు అదిప్పుడు వేగం పుంజుకుందన్నారు. ఇప్పుడది క్రమంగా అంటార్కిటిక్ ద్వీపకల్పపు ఉత్తరాగ్రంకేసి కదులుతోంది. చివరికది ఐస్‌బర్గ్‌ల క్షేత్రంగా పిలిచే అంటార్కిటికా దక్షిణ ప్రాంతానికి చేరేలా కన్పిస్తోంది.



ప్రమాద ఘంటికే...!

ఎంత పెద్ద ఐస్‌బర్గ్‌లైనా కాలక్రమంలో చిక్కిపోవడం, క్రమంగా కనుమరుగవడం పరిపాటే. కానీ అందుకు వందలు, కొన్నిసార్లు వేలాది ఏళ్లు కూడా పడుతుంటుంది. అలాంటి ప్రస్తుతం ప్రపంచంలోకెల్లా అతి పెద్దదైన ఏ23ఏ ఐస్‌బర్గ్ ఇలా శరవేగంగా కరుగుతుండటం, కదిలిపోతుండటం ప్రమాద సూచికేనని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అది దక్షిణ జార్జియా కేసి సాగితే అక్కడి జీవావరణానికి పెద్ద సమస్యగా కూడా మారవచ్చని చెబుతున్నారు. దాని నుంచి కరిగే నీటితో పెరిగిపోయే సముద్ర మట్టం ఆ ద్వీపకల్ప తీరంలో లక్షలాది సీల్స్, పెంగ్విన్లు, సముద్ర పక్షుల పునరుత్పత్తి ప్రాంతాలను ముంచెత్తవచ్చన్నది వారి ఆందోళన. అయితే ఈ పరిణామంతో కొన్ని లాభాలూ లేకపోలేదట! ''ఐస్‌బర్గ్‌లు జీవనప్రదాలు కూడా. కరిగే క్రమంలో వాటినుంచి విడుదలయ్యే ఖనిజ ధూళి సమీప సముద్ర జీవజాలానికి ప్రాణాధారంగా మారుతుంది'' అని సైంటిస్టులు చెబుతున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

24 మంది బందీలకు స్వేచ్ఛ

అమల్లోకి వచ్చిన ఇజ్రాయెల్‌-హమాస్ ఒప్పందం

- 13 మంది ఇజ్రాయెలీలు, 10 మంది థాయ్‌లాండ్ పౌరులు, ఒక ఫిలిప్పైన్స్ జాతీయుడికి విముక్తి
- విడుదలైన బందీలను ఈజిప్టుకు తరలించిన రెడ్‌క్రాస్ సంస్థ
- గాజాలో కాల్పుల విరమణ ప్రారంభం.. ఆగిన ఇజ్రాయెల్ దాడులు
- మొదటి దశలో 39 మంది పాలస్తీనా ఖైదీలను విడిచిపెట్టిన ఇజ్రాయెల్!
- ఈజిప్టు నుంచి గాజాకు మానవతా సాయం, ఇంధనం చేరవేత

గాజా స్ట్రిప్/జెరూసలేం: సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. గాజా స్ట్రిప్‌లో శుక్రవారం భూతల, వైమానిక దాడులు ఆగిపోయాయి. ప్రపంచంలోనే అతిపెద్ద బహిరంగ జైలుగా పేరుగాంచిన గాజాలో ఏడు వారాల తర్వాత ప్రశాంత వాతావరణం కనిపించింది. పాలస్తీనియన్ల ఎదురు చూపులు ఫలిస్తున్నాయి. విదేశాల నుంచి పెద్ద ఎత్తున మానవతా సాయం, ఇంధనం గాజాకు చేరుకుంటోంది. అమెరికా, ఈజిప్టు, ఖతార్ దేశాల చొరవతో ఇజ్రాయెల్‌–హమాస్ మధ్య కుదిరిన సంధి శుక్రవారం ఉదయం నుంచే అమల్లోకి వచ్చింది. తాత్కాలిక కాల్పుల విరమణ నాలుగు రోజులపాటు కొనసాగనుంది. ఒప్పందం మేరకు హమాస్ చెరలోని బందీల విడుదల ప్రక్రియ ప్రారంభమైంది. మొదటిరోజు 13 మంది ఇజ్రాయెలీ బందీలకు హమాస్ మిలిటెంట్లు స్వేచ్ఛా వాయువులు ప్రసాదించారు. వీరిలో ఆరుగురు వృద్ధులు, నలుగురు పిల్లలున్నారు. వారిని రెడ్‌క్రాస్ సంస్థకు అప్పగించారు. మొత్తం 24 మంది బందీలను హమాస్ విడిచిపెట్టిందని, వారిని 4 వాహనాల్లో ఈజిప్టుకు చేర్చామని రెడ్‌క్రాస్ వెల్లడించింది. వీరిలో 13 మంది ఇజ్రాయెల్ పౌరులు, 10 మంది థాయ్‌లాండ్ పౌరులు, ఒకరు ఫిలిప్పైన్స్ పౌరుడున్నట్లు ఖతార్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ప్రకటించారు. విడుదలైన బందీలంతా ఆరోగ్యంగానే కనిపిస్తున్నారని ఇజ్రాయెల్ వైద్య శాఖ తెలియజేసింది. హమాస్ డిమాండ్‌ను నెరవేరుస్తూ ఇజ్రాయెల్ కూడా మొదటి దశలో 39 పాలస్తీనా ఖైదీలను విడుదల చేసిందని సమాచారం. వీరిలో 24 మంది మహిళలు కాగా 15 మంది చిన్నారులు. వారిని తీసుకుని వాహనాలు వెస్ట్ బ్యాంక్‌లోని జైళ్ల నుంచి రమల్లాకు బయల్దేరాయి. నాలుగు రోజుల వ్యవధిలో 50 మంది బందీలకు హమాస్ విముక్తి కల్పించాల్సి ఉంది. అలాగే 150 మంది ఖైదీలను జైళ్ల నుంచి ఇజ్రాయెల్ విడిచిపెట్టాలి. ప్రస్తుతం 7,200 మంది పాలస్తీనియన్లు ఇజ్రాయెల్ జైళ్లలో మగ్గుతున్నారు.



హమాస్ విడుదల చేసిన బందీలతో గాజా నుంచి బయల్దేరిన వాహనం.



టెల్ అవీవ్‌లో బంధువుల ఆనందోత్సాహాలు

'ఉత్తరాది వలస'లపై కాల్పులు..

ఇజ్రాయెల్ వైమానిక, భూతల దాడులు ఆగిపోవడంతో దక్షిణ గాజా నుంచి జనం ఉత్తర గాజాకు కాలినడకన తిరిగివస్తున్నారు. వారిని ఎక్కడికక్కడ అడ్డుకొనేందుకు ఇజ్రాయెల్ సైన్యం ప్రయత్నిస్తోంది. శుక్రవారం పలుచోట్ల వారిపై కాల్పులు జరిపింది. ఎవరూ వెనక్కి వెళ్లొద్దంటూ సైన్యం హెచ్చరికలు జారీ చేసింది. ఈ కాల్పుల్లో ఇద్దరు మరణించారని, 11 మంది గాయపడ్డారని స్థానిక మీడియా తెలియజేసింది. అక్టోబర్ 7న గాజాపై దాడులు మొదలైన తర్వాత ఇజ్రాయెల్ హెచ్చరికల వల్ల ఉత్తర గాజా నుంచి లక్షలాది మంది ప్రాణభయంతో దక్షిణ గాజాకు వలసవెళ్లారు. వారంతా స్వస్థలాలకు తిరిగి రావాలని భావిస్తున్నారు.

గాజాకు 1.30 లక్షల లీటర్ల డీజిల్

కాల్పుల విరమణ, బందీల విడుదల ప్రక్రియ ప్రారంభం కావడంతో గాజాకు మానవతా సాయం చేరవేతలోనూ వేగం పెరిగింది. ఆహారం, నిత్యావసరాలు, ఔషధాలు, వైద్య పరికరాలు, దుస్తులు తదితర సామగ్రితో దాదాపు 90 వాహనాలు శుక్రవారం ఈజిప్టు నుంచి రఫా క్రాసింగ్ గుండా గాజాలోకి ప్రవేశించాయి. అలాగే 1.30 లక్షల లీటర్ల డీజిల్ కూడా గాజాకు అందింది. డీజిల్ లేక, జనరేటర్లు పనిచేయక గాజా ఆసుపత్రుల్లో వైద్య సేవలు ఇప్పటికే నిలిచిపోయాయి. కాల్పుల విరమణ అమల్లో ఉన్న నాలుగు రోజుల్లో రోజుకు 1.30 లక్షల లీటర్ల డీజిల్‌ను గాజాకు సరఫరా చేయడానికి ఇజ్రాయెల్ అనుమతి ఇచ్చింది. వాస్తవానికి గాజాకు నిత్యం 10 లక్షల లీటర్ల డీజిల్ అవసరం.

కాల్పుల విరమణ పొడిగిస్తారా?

ఇజ్రాయెల్‌–హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కేవలం నాలుగు రోజుల పాటే అమల్లో ఉంటుంది. ఆ తర్వాత కూడా ఒప్పందాన్ని పొడిగిస్తారని సమాచారం. హమాస్ చెరలో 240 మంది బందీలు ఉన్నారు. వారందరినీ విడుదల చేయించాలంటే నాలుగు రోజుల సమయం సరిపోదు. అందుకే ఒప్పందం పొడిగింపునకు ఇజ్రాయెల్ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

రాజస్తాన్ ఎన్నికలకు సర్వం సిద్ధం

- 199 నియోజకవర్గాల్లో నేడు పోలింగ్
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- కాంగ్రెస్ అభ్యర్థి మరణించడంతో ఒక స్థానంలో పోలింగ్ వాయిదా

జైపూర్: రాజస్తాన్ శాసనసభ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల దాకా పోలింగ్ జరుగనుంది. 200 నియోజకవర్గాలకుగాను 199 నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అధికారులు సిద్ధమయ్యారు. శ్రీగంగానగర్ జిల్లాలోని కరణ్‌పూర్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే గుర్మీత్‌సింగ్ కూనార్ మరణించడంతో ఇక్కడ పోలింగ్‌ను వాయిదా వేశారు. రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి 1,862 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. రాష్ట్రంలో మొత్తం 5.25 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లోనూ తమ అభ్యర్థులను బరిలోకి దించింది. కాంగ్రెస్ పార్టీ భరత్‌పూర్ స్థానాన్ని తమ మిత్రపక్షం రాష్ట్రీయ లోక్‌దళ్(ఆర్‌ఎల్డీ)కి కేటాయించింది. కాంగ్రెస్, బీజేపీతోపాటు సీపీఎం, ఆర్‌ఎల్పీ, భారత్ ఆదివాసీ పార్టీ, భారతీయ ట్రైబల్ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ, ఎంఐఎం తదితర పార్టీలు సైతం పోటీకి దిగాయి. పెద్ద సంఖ్యలో తిరుగుబాటు అభ్యర్థులు బరిలోకి దిగడం కాంగ్రెస్, బీజేపీలకు ఆందోళన కలిగిస్తోంది.

బరిలో ఉద్ధండులు..

పోలింగ్ సజావుగా జరగడానికి అన్ని చర్యలు తీసుకున్నామని, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని రాజస్తాన్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ప్రవీణ్ గుప్తా తెలిపారు. ఎన్నికల్లో ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత అశోక్ గహ్లోత్, పీసీసీ అధ్యక్షుడు గోవింద్‌సింగ్, అసెంబ్లీ స్పీకర్ సీపీ జోషీ, మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ తదితరులు మరోసారి అదృష్టం పరీక్షించుకుంటున్నారు. బీజేపీ నుంచి సీనియర్ నేతలు వసుంధర రాజే, రాజేంద్ర రాథోడ్, సతీష్ పూర్ణియా, ఎంపీలు దివ్యా కుమారి, రాజ్యవర్ధన్ రాథోడ్, బాబా బాలక్‌నాథ్, కిరోడీలాల్ మీనా తదితరులు పోటీపడుతున్నారు. అధికార కాంగ్రెస్, విపక్ష బీజేపీ మధ్య హోరాహోరీ పోరు సాగుతోంది.



జోధ్‌పూర్‌లో పోలింగ్ సామగ్రిని అందుకుంటున్న సిబ్బంది

గహ్లోత్, సచిన్ పైలట్ సయోధ్య!

రాజస్తాన్ సీఎం అశోక్ గహ్లోత్, మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్ మధ్య విభేదాల సంగతి తెలిసిందే. తాము ఐక్యంగా ఉన్నామని చాటేందుకు ఎన్నికల వేళ గహ్లోత్ ప్రయత్నించారు. సచిన్ పైలట్ ప్రజలను ఓట్లు అభ్యర్థిస్తున్న వీడియోను గహ్లోత్ శుక్రవారం సోషల్ మీడియాలో పోస్టుచేశారు. తద్వారా ప్రజలకు సానుకూల సంకేతం ఇచ్చేందుకు ప్రయత్నించారు.

ఒకే ఒక్క కుటుంబం కోసం పోలింగ్ బూత్

సాక్షి, న్యూఢిల్లీ: రాజస్థాన్ అసెంబ్లీకి నేడు జరగనున్న ఎన్నికల్లో ఒకే ఒక్క కుటుంబం కోసం అధికారులు ప్రత్యేకంగా ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పాకిస్తాన్ సరిహద్దులో ఉన్న బార్మర్ జిల్లా పార్ గ్రామంలో రాష్ట్రంలోనే అతి చిన్న పోలింగ్ కేంద్రం ఉంది. ఇక్కడ ఒక కుటుంబంలోని 35 మంది సభ్యులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. సరిహద్దుకు ఆనుకుని ఉన్న ఈ గ్రామ ప్రజలు గత ఎన్నికల వరకు ఓటేయడానికి 20 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వచ్చేది. ఎడారిలో రోడ్లు లేకపోవడంతో ప్రజలు కాలినడకన, ఒంటెలపై పోలింగ్ బూత్‌కు చేరుకొనేవారు. పోలింగ్ కేంద్రం చాలా దూరంగా ఉండటంతో వృద్ధులు, మహిళలు పలుమార్లు ఓటు వేయలేకపోయారు. ఈ పరిస్థితిపై సమాచారం అందుకున్న ఎన్నికల కమిషన్ అధికారులు గ్రామంలో ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో మూడు వేర్వేరు ఇళ్లలో నివసించే ఒకే కుటుంబానికి చెందిన 17 మంది మహిళలు, 18 మంది పురుషులు మొత్తం 35 మంది ఓటేయనున్నారు. కాగా, సిరోహి జిల్లాలోని అబు–పింద్వారా అసెంబ్లీ నియోజకవర్గంలో 4,921 అడుగుల ఎత్తులో ఉన్న షేర్‌గావ్ ఓటర్లు తొలిసారిగా తమ సొంతూళ్లోనే ఓటు వేయనున్నారు. గ్రామంలోని 117 మంది గిరిజనుల ఓటర్ల కోసం ఎన్నికల సంఘం ఈసారి ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఎన్నికల సిబ్బంది దట్టమైన అటవీప్రాంతంలో దాదాపు 18 కిలోమీటర్లు నడిచి పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు.

చంపితే ఎలా ఉంటుందో చూసేందుకు...
నిజంగానే మర్డర్ చేసింది!

ఆమె పేరు జుంగ్ యూ జుంగ్. వయసు 23 ఏళ్లు. ఉండేది దక్షిణ కొరియాలోని బుసాన్‌లో. నేరాలు, ఘోరాలంటే మహా పిచ్చి. ఎంతగా అంటే, టీవీల్లో రియల్ క్రైమ్ స్టోరీలను విపరీతంగా చూసేది. క్రైం నవలలు కూడా తెగ చదివేది. వాటి స్ఫూర్తితో, హత్య చేస్తే ఎలా ఉంటుందో అనుభవపూర్వకంగా తెలుసుకోవడానికి నిజంగానే ఘోరానికి తెగబడింది. హత్య ఎలా చేయాలో, శవాన్ని ఎలా మాయం చేయాలో తెలుసుకునేందుకు ఇంటర్నెట్‌లో నెలల పాటు సెర్చ్ చేసి మరీ రంగంలోకి దిగింది. ముక్కూ మొహం తెలియని ఓ అమాయక టీచర్‌ను విచక్షణా రహితంగా పదేపదే పొడిచి పొట్టన పెట్టుకుంది! చివరికి శవాన్ని మాయం చేసే క్రమంలో అద్దెకు తీసుకున్న ట్యాక్సీ డ్రైవర్ పోలీసులకు ఉప్పందించడంతో కటకటాల పాలైంది! నేరాల సంఖ్య తక్కువగా ఉండే దక్షిణ కొరియా లో ఈ ఉదంతం సంచలనం సృష్టించింది...

విద్యార్థి తల్లిగా నమ్మించి...

జుంగ్ ఓ నిరుద్యోగి. తాతతో కలిసి నివసించేది. చేసేందుకు పనేమీ లేకపోవడంతో క్రైం ప్రోగ్రాంలు, సంబంధిత రియాల్టీ షోలకు, క్రైం నవలలకు బానిసగా మారింది. హత్యానుభవం ఎలా ఉంటుందో చూడాలని నిర్ణయించుకున్నాక సంబంధిత సమాచారం కోసం ఇంటర్నెట్‌లో వెదికింది. అనంతరం తగిన వ్యక్తి కోసం ట్యూటరింగ్ యాప్‌ల్లో నెలల పాటు వేట సాగించింది. హోం ట్యూషన్లు చెబుతారా అంటూ కనీసం 50 మందిని సంప్రదించింది. చివరికి గత మే నెలలో ఒక 26 ఏళ్ల మహిళను ఎంచుకుంది. తనను తాను ఓ హైస్కూలు స్టూడెంట్ తల్లిగా పరిచయం చేసుకుంది. తన బిడ్డకు ఇంగ్లిష్ పాఠాలు చెప్పాలంటూ నమ్మించింది. అందుకామె సమ్మతించాక ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి స్కూల్ యూనిఫాం కూడా తెప్పించుకుంది! అది వేసుకుని ట్యూటర్ ఇంటికి వెళ్లింది. ఆమె తలుపు తీసి లోనికి రానివ్వడమే ఆలస్యం, వెంట తీసుకెళ్లిన కత్తితో పదేపదే దాడికి దిగింది. ఏకంగా 100 సార్లకు పైగా పొడిచింది! చనిపోయిన తర్వాత కూడా దాడి ఆపలేదట! ఆ తర్వాత తాపీగా మృతదేహాన్ని ముక్కలుగా నరికింది. వాటిని సూట్‌కేస్‌లో కుక్కి, ఓ ట్యాక్సీలో తీసుకెళ్లి దూరంలో నది దగ్గర పడేసి చేతులు దులుపుకుంది. రక్తమోడుతున్న సూట్‌కేసును ఓ అమ్మాయి అడవిలో పడేసిందంటూ ట్యాక్సీ డ్రైవర్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు. జుంగ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కోర్టు యావజ్జీవ ఖైదు విధించింది.



- సాక్షి, నేషనల్ డెస్క్

సొరంగం పనులకు మళ్లీ ఆటంకం

కార్మికులను రక్షించే ప్రయత్నాలకు అంతరాయం

ఉత్తరకాశీ: ఉత్తరాఖండ్‌లోని సిల్ క్యారా సొరంగంలో 12 రోజులుగా చిక్కుకుపోయిన కార్మికులను రక్షించే పనులకు శుక్రవారం మళ్లీ అవరోధం ఏర్పడింది. గురువారం సాంకేతిక సమస్యల కారణంగా నిలిచిపోయిన డ్రిల్లింగ్‌ను 25 టన్నుల భారీ ఆగర్ యంత్రంతో శుక్రవారం తిరిగి ప్రారంభించారు. అయితే, కొద్దిసేపటికే మరోసారి సమస్యలు రావడంతో నిలిపివేశారు. వాటిని సరిచేసి మళ్లీ పనులు ప్రారంభించినా గంటలోనే మళ్లీ అంతరాయం ఏర్పడిందని అధికారులు తెలిపారు. కూలిన శిథిలాల గుండా సొరంగంలోకి ఒకదానికొకటి వెల్డింగ్‌తో కలిపిన స్టీలు పైపులను పంపించి, వాటిగుండా కార్మికులను వెలుపలికి తీసుకు వచ్చేందుకు అధికారులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. రెండు రోజులుగా ఏర్పడుతున్న అంతరాయాలు టన్నెల్ వద్ద ఆత్రుతగా ఎదురుచూస్తున్న కార్మికుల సంబంధీకుల్లో ఆందోళన రేపుతోంది. అయితే, మిగిలి ఉన్న 5.4 మీటర్ల మేర శిథిలాల్లో డ్రిల్లింగ్‌కు అవరోధాలు ఎదురుకాకపోవచ్చని ప్రత్యేక రాడార్ ద్వారా తెలిసిందని అధికారులు తెలిపారు. ఇలా ఉండగా, టన్నెల్ నుంచి వెలుపలికి వచ్చాక కార్మికులకు వైద్య పరీక్షలు చేసి, ఆ వెంటనే గ్రీన్ కారిడార్ ద్వారా ఆస్పత్రులకు తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్లు గఢ్వాల్ రేంజ్ ఐజీ కేఎస్ నంగ్యాల్ చెప్పారు.

'డీప్ ఫేక్' ఫిర్యాదులపై ప్రజలకు సహకరిస్తాం

- ఐటీ సేవల్లో లోపాలపైనా కూడా..
- కేంద్ర మంత్రి రాజీవ్ చంద్ర శేఖర్

న్యూఢిల్లీ: సామాజిక మాధ్యమాల్లో డీప్ ఫేక్ వంటి అభ్యంతరకర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులపై ప్రజలకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ సహాయమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ చెప్పారు. సామాజిక మాధ్యమ వేదికలపై ఐటీ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి ప్రజలిచ్చే ఫిర్యాదుల కోసం తమ శాఖ త్వరలో ఒక వేదికను అందుబాటులోకి తేనుందని వెల్లడించారు. ప్రస్తుతమున్న గ్రీవెన్స్ అప్పిలేట్ కమిటీ(జీఏసీ)కి ఇది అదనమన్నారు. సామాజిక మాధ్యమ వేదికల ప్రతినిధులతో సమావేశమైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఐటీ నిబంధనలకు అనుగుణంగా సోషల్ మీడియా సంస్థలు వాటి వినియోగ నిబంధనలను సర్దుబాటు చేసుకునేందుకు వారం సమయం ఇచ్చినట్లు వెల్లడించారు. డీప్ ఫేక్‌గా గుర్తించిన కంటెంట్‌ను సోషల్ మీడియా వేదికల నుంచి తొలగించడానికి బదులుగా ఆ కంటెంట్‌పై డీప్‌ఫేక్ అనే లేబుల్ వేసినా సరిపోతుందని తెలిపారు. 2022 అక్టోబర్‌లో నోటిఫై చేసిన ఐటీ నిబంధనల్లోని 7వ సెక్షన్ అమలు కోసం ప్రత్యేకంగా ఒక అధికారిని నియమిస్తామన్నారు. దీనివల్ల అభ్యంతరకర కంటెంట్‌పై బాధితులు ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఎఫ్ఐఆర్‌ల నమోదు ప్రక్రియలో తమ మంత్రిత్వ శాఖ సహాయకారిగా ఉంటుందని కూడా తెలిపారు. ఐటీ నిబంధనల్లోని సెక్షన్–7 సామాజిక మాధ్యమ వేదికల హోదాను తక్షణమే రద్దు చేసేందుకు వీలు కల్పిస్తుంది. నిబంధనలను పాటించని వారిపై చర్యలు తీసుకునేందుకు సైతం వీలుంటుంది. 'నిబంధనలను లక్ష్యపెట్టని సోషల్ మీడియా సంస్థలపై కేసులు నమోదవుతాయి. సంబంధిత కంటెంట్‌ను పోస్ట్ చేసిన వారిపైనా కేసులుంటాయి' అని మంత్రి తెలిపారు. ఆయా సంస్థలు చట్టానికి లోబడి వ్యవహరిస్తే డీప్ ఫేక్ వంటి సమస్యలు ఇకపై తలెత్తే అవకాశమే లేదన్నారు.

క్లుప్తంగా...

విశాఖ పేరెత్తితే బాబు గుండెల్లో రైళ్లు

1,153వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: విశాఖ నుంచి పరిపాలన అంటేనే చంద్రబాబు, ఆయన బినామీలు, పచ్చమీడియా గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 1,153వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ పరిపాలనా రాజధానిగా విశాఖ కానుండడంతో కులవాదుల దురాశకు తూట్లు పడినట్లు చెప్పారు. నాయకులు మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, ఈపూరి ఆదాం, పులి దాసు, నూతక్కి జోషి పాల్గొన్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి 45 ఏళ్ల జైలు



విజయనగరం క్రైమ్/గుర్ల: పోక్సో కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి 45 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 5వేలు జరిమానా విధిస్తూ ప్రత్యేక పోక్సో న్యాయస్థానం శుక్రవారం తీర్పు వెలువరించింది. విజయనగరం జిల్లా గుర్ల మండలానికి చెందిన యాళ్ల గణపతి(29) తన కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఓ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుర్ల పోలీస్ స్టేషన్‌లో 2023, ఫిబ్రవరి నెలలో పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదైంది. ఈ కేసును ప్రాధాన్యత జాబితాలో చేర్చి, 9 నెలల్లో ప్రాసిక్యూషన్ పూర్తయ్యేలా చర్యలు చేపట్టామని ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. విచారణలో నేరం రుజువు కావడంతో ముద్దాయి గణపతికి పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి కె.నాగమణి పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్పీ వివరించారు.

కేంద్ర నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి: పురందేశ్వరి



శ్రీకాకుళం న్యూకాలనీ: కేంద్ర నిధులతోనే ఏపీలో అభివృద్ధి జరుగుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. శ్రీకాకుళంలోని ఓ కార్యక్రమంలో శుక్రవారం ఆమె పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు. పలువురిని బీజేపీలో చేర్చుకున్నారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర నిధులతో సీఎం జగన్ బటన్‌లు నొక్కే కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఎటు చూసినా ఇసుక, మద్యం మాఫియాలే కనిపిస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ, ఏపీలోను బీజేపీ, జనసేనలు మిత్రపక్షంగా ఉన్నాయని, తెలంగాణలో జనసేనకు కేటాయించిన 8 నియోజకవర్గాల్లో తాను ప్రచారం చేశానని చెప్పారు.

అప్పటివరకు చంద్రబాబుపై తొందరపాటు చర్యలొద్దు

సాక్షి, అమరావతి: అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు, ఉచిత ఇసుక పథకంపై దాఖలు చేసిన కేసుల్లో తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంత వరకు చంద్రబాబుపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని సీఐడీని హైకోర్టు శుక్రవారం ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జున రావు శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో సీఐడీ తరఫున అడ్వొకేట్ జనరల్(ఏజీ) వాదనల నిమిత్తం విచారణను ఈ నెల 29కి, ఉచిత ఇసుక పథకం కేసులో విచారణను 30కి వాయిదా వేశారు. కాగా, ఇన్నర్ రింగ్ రోడ్డులో అక్రమాలు, ఉచిత ఇసుక కేసుల్లో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ చంద్రబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు శుక్రవారం న్యాయమూర్తి వద్దకు విచారణకు వచ్చాయి. సీఐడీ స్పెషల్ పీపీ శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి స్పందిస్తూ ఈ వ్యాజ్యాల్లో ఏజీ వాదనలు వినిపిస్తారని, అందువల్ల విచారణను వాయిదా వేయాలని కోరారు. అందుకు న్యాయమూర్తి అంగీకరిస్తూ విచారణను వాయిదా వేస్తూ పై విధంగా ఆదేశాలు జారీ చేశారు.

రఘురామ పిటిషన్లు జత చేసిన సుప్రీం

సాక్షి, న్యూఢిల్లీ: ఎంపీ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లను సుప్రీం కోర్టు జతచేసింది. సీఎం వైఎస్ జగన్ బెయిల్ రద్దు చేయాలన్న పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేయటాన్ని సవాల్ చేస్తూ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్‌లతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం శుక్రవారం విచారించింది. కేసు విచారణ హైదరాబాద్ నుంచి ఢిల్లీలోని ఏదైనా కోర్టుకు బదిలీ చేయాలంటూ దాఖలు చేసిన మరో పిటిషన్ మరో ధర్మాసనం వద్ద పెండింగ్‌లో ఉందని రఘురామ తరఫు న్యాయవాది తెలిపారు. దీంతో రెండు పిటిషన్లను జత చేస్తామని, అన్ని పిటిషన్ల విచారణపై సీజేఐ తగిన నిర్ణయం తీసుకుంటారని ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణ జనవరి తొలి వారానికి వాయిదా వేసింది.

ఇవిగో నోటీసులు.. అదిగో అబద్ధం..

హైకోర్టులో రఘురామ పిటిషన్‌పై ఇదీ 'ఎల్లో బ్యాచ్' తీరు

- ఆ పిటిషన్‌ను అసలు విచారించాలో వద్దో తొలుత తేలుస్తామన్న కోర్టు
- దానిపై మీ అభిప్రాయం చెప్పాలంటూ ప్రతివాదులకు నోటీసులు
- దీన్ని పట్టుకుని సోషల్ మీడియాలో చెలరేగిపోయిన టీడీపీ
- ఎల్లో చానెళ్లు, పత్రికలు సరేసరి... 'జగన్‌కు నోటీసులు' అంటూ హడావుడి
- అసలు విషయం చెప్పకుండా... విచారణ 14కు వాయిదా అంటూ కథనాలు
- కోర్టు ఆదేశాలను వక్రీకరించేలా 'ఈనాడు' ఉద్దేశపూర్వకంగా తప్పుడు కథనం
- కేసు పూర్వాపరాల్లోకి వెళ్లి మరీ హైకోర్టు నోటీసులిచ్చిందనే రీతిలో దుష్ప్రచారం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వంపై కక్ష కట్టి నిత్యం తప్పుడు కథనాలను వండి వార్చడమే పనిగా పెట్టుకున్న ఎల్లో మీడియా న్యాయస్థానాల్లో జరిగే కేసుల ప్రొసీడింగ్స్ విషయంలోనూ అదే పంథాను అనుసరిస్తోంది. పేదల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలకు అవినీతిని ఆపాదిస్తూ ఎంపీ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన 'పిల్'పై విచారణ సందర్భంగా హైకోర్టులో జరిగిన ప్రొసీడింగ్స్‌ను వక్రీకరించి 'ఈనాడు' మరోసారి తన వక్ర బుద్ధిని చాటుకుంది. కోర్టులో జరిగింది, ధర్మాసనం తేల్చి చెప్పింది ఒకటైతే అందుకు విరుద్ధంగా ఈనాడు తప్పుడు కథనాన్ని ప్రచురించింది. ప్రజలను తప్పుదోవ పట్టించే యత్నం చేసింది.



న్యాయవర్గాల్లో విస్మయం

'సీఎం జగన్‌కు హైకోర్టు నోటీసులు' అనే శీర్షికతో ఈనాడు శుక్రవారం ప్రచురించిన కథనంపై న్యాయవర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. రఘురామ పిల్ విచారణార్హతపై అభ్యంతరాలు వ్యక్తం చేయాలంటూ కోర్టు నోటీసులు ఇస్తే.. కేసు లోతుల్లోకి వెళ్లి నోటీసులు ఇచ్చారనే అర్థం వచ్చేలా ఈనాడు కథనాన్ని వెలువరించింది. రఘురామ దాఖలు చేసిన వ్యాజ్యం విచారణార్హతపై అడ్వొకేట్ జనరల్ (ఏజీ) తీవ్ర అభ్యంతరం తెలిపిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంలో ముఖ్యమంత్రి జగన్, ఎంపీ విజయసాయిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తదితరులను వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా చేర్చడాన్ని ఏజీ తీవ్రంగా వ్యతిరేకించారు. రఘురామకృష్ణరాజు వ్యాజ్యంలో తనపై ఉన్న కేసుల గురించి, ఎంపీ అనర్హతకు సంబంధించి లోక్‌సభ స్పీకర్‌కు అందిన ఫిర్యాదు గురించి పేర్కొనకపోవడాన్ని కూడా ఏజీ ప్రస్తావించారు. రుణ సంస్థలకు రూ.వందల కోట్ల రుణాన్ని ఎగవేసినందుకు ఆయనపై సీబీఐ కేసు నమోదు చేసిన విషయాన్ని కూడా ఏజీ కోర్టు దృష్టికి తెచ్చారు. రఘురామకృష్ణరాజు రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ పెద్దల పట్ల ఎలా కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారో కోర్టుకు నివేదించారు. ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేయడం వెనుక ఆయనకున్న దురుద్దేశాలను స్పష్టంగా కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. రఘురామ విశ్వసనీయతను ఏజీ ప్రశ్నించారు. తొలుత ఈ వ్యాజ్యం విచారణార్హతపై తేల్చాలని ఏజీ పట్టుబట్టారు.

తేల్చిన తరువాతే తదుపరి అడుగులు..

పిల్ విచారణార్హత విషయంలో ఏజీ వ్యక్తం చేసిన అభిప్రాయాలతో హైకోర్టు ధర్మాసనం సంతృప్తి చెందింది. రఘురామ వ్యాజ్యం విచారణార్హతపైనే ముందుగా తేల్చాలని నిర్ణయించింది. అందుకే వాదనల సందర్భంగా ధర్మాసనం పదేపదే 'విచారణార్హత' గురించే ప్రస్తావించింది. ఈ పిల్‌ను విచారణకు సైతం స్వీకరించడం లేదని తేల్చి చెప్పింది. విచారణకు స్వీకరించే ముందు ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తున్నామని పేర్కొంది. ప్రతివాదులకు ఎందుకు నోటీసులు ఇస్తున్నామనే విషయాన్ని కూడా ధర్మాసనం చాలా స్పష్టంగా వివరించింది. విచారణార్హతపై ప్రతివాదులందరూ తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేయవచ్చని సూచించింది. న్యాయస్థానం తమకు ఈ పిల్ విచారణార్హతపై వాదనలు వినిపించే అవకాశం ఇవ్వలేదని భవిష్యత్తులో ఎవరూ అనకుండా అందరికీ అభ్యంతరాలను తెలియచేసే అవకాశం ఇస్తున్నామని ఇరు పక్షాలకు చాలా స్పష్టంగా పలుమార్లు చెప్పింది. అందరి అభ్యంతరాలను విని విచారణార్హతను తేల్చిన తరువాతే కేసు లోతుల్లోకి వెళతామని తేల్చి చెప్పింది. అయితే ఈనాడు మాత్రం ఉద్దేశపూర్వకంగా తన మొత్తం కథనంలో 'విచారణార్హత' గురించి నామమాత్రంగానే ప్రస్తావించింది. రఘురామ చేసిన ఆరోపణలకు స్పందించి కేసు లోతుల్లోకి వెళ్లి మరీ హైకోర్టు నోటీసులు జారీ చేసిందన్నట్లుగా కథనాన్ని ప్రచురించింది. రఘురామ ఆరోపణలకు తన ఉద్దేశపూర్వక కథనంలో ప్రాముఖ్యతనిచ్చిన ఈనాడు విచారణార్హతపై ఏజీ వ్యక్తం చేసిన అభ్యంతరాలను మాత్రం నామమాత్రంగానే ప్రస్తావించింది. వాస్తవానికి రఘురామ ఆరోపణల జోలికి ఇప్పుడు వెళ్లే అవకాశం లేదని కోర్టు చెప్పినా కూడా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు న్యాయస్థానం ఆదేశాలను ఈనాడు వక్రీకరించింది.

వైఎస్సార్‌సీపీలోకి జనసేన నేత 'డాక్టర్ మేడా'

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన సీఎం వైఎస్ జగన్


సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన మేడా గురుదత్తప్రసాద్

సాక్షి, అమరావతి: తూర్పుగోదావరి జిల్లాలోని రాజానగరం నియోజకవర్గ జనసేన పార్టీ మాజీ ఇన్‌చార్జ్ డాక్టర్ మేడా గురుదత్తప్రసాద్ శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. గురుదత్తప్రసాద్‌కు సీఎం జగన్ పార్టీ కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆయనతో పాటు జనసేన నాయకులు మండపాక శ్రీను, అడబాల సత్యనారాయణ, వడ్డి చిన్నా, నాగవరపు భానుశంకర్, వల్లేపల్లి రాజేష్, చొంగా మణికంఠ వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే విద్యార్థుల సాధికారత

విజయవాడలో విద్యార్థుల భారీ ర్యాలీ



విజయవాడ ఏలూరు రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విద్యార్థుల సాధికారత సీఎం జగనన్నతోనే సాధ్యం.. అంటూ విద్యార్థులు నినదించారు. విజయవాడలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్ భవన్ వద్ద నుంచి సీతారామపురం ట్రాఫిక్ సిగ్నల్స్ వరకు, అక్కడ నుంచి తిరిగి బీఎస్ఎన్ఎల్ భవన్ వరకు ర్యాలీ సాగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ స్కూళ్ల రూపు రేఖలు మార్చేశారని చెప్పారు.


సంతకం సాక్షిగా.. మద్యంలో ముడుపులు!

▶ మొదటి పేజీ తరువాయి

కీలక ఆధారాలు లభ్యమయ్యాయి. నాడు ఆర్థిక శాఖ ఆమోదం లేకుండా, కేబినెట్‌కు తెలియకుండా అస్మదీయులకు చెందిన బెవరేజీలు, మద్యం దుకాణాలు, బార్లకు చంద్రబాబు ప్రయోజనం కల్పించారు. 2012 నుంచి మద్యం దుకాణాలపై ఉన్న 8 శాతం ప్రివిలేజ్ ఫీజు ప్లస్ జీఎస్టీ, బార్లపై ఉన్న 9 శాతం ప్రివిలేజ్ ఫీజు ప్లస్ జీఎస్టీని తొలగిస్తూ రెండు చీకటి జీవోలు జారీ చేశారు. తద్వారా ఖజానాకు రూ.1,299.64 కోట్ల మేర గండి కొట్టారు. ఈమేరకు సంబంధిత నోట్ ఫైళ్లపై నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర డిజిటల్ సంతకాలు చేసినట్లు అధికారిక రికార్డులు వెల్లడిస్తున్నాయి. ఖజానాకు తూట్లు పొడిచి సన్నిహితులు, బినామీలకు చెందిన కంపెనీలకు లబ్ధి చేకూర్చేందుకు చంద్రబాబు సాగించిన మద్యం కుంభకోణం ఇలా సాగింది!!


To
The Commissioner of Printing and Stationery and Stores Purchase, Hyderabad(He is requested to furnish 200 copies to Government and 500 copies to the Commissioner of Prohibition & Excise, A.P,Hyderabad and 50 copies to Special Commissioner of Information and Public Relations, Hyderabad.)
The Commissioner of Prohibition and Excise, Andhra Pradesh, Hyderabad.
Copy to:
The PS to Principal Secretary to CM.
The PS to Minister for Excise and Prohibition
The PS to Spl. CS to Govt, Revenue Department.

ప్రివిలేజ్ ఫీజు రద్దు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వుల కాపీని నాటి సీఎం చంద్రబాబు ముఖ్య కార్యదర్శికి పంపినట్లు ఆధారం



GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT
Rules – The Andhra Pradesh Excise (Grant of licence of selling by shop and conditions of licence) Rules, 2012 – Amendments – Orders – Issued.

REVENUE (EXCISE-II) DEPARTMENT

G.O.Ms.No.218 Dated:22.06.2015.
Read the following:

1. G.O.Ms. No.391, Rev (Ex.II) Dept, dated:18.06.2012
2. G.O.Ms. No.357, Rev (Ex.II) Dept, dated:22.06.2013
3. G.O.Ms. No.216, Rev (Ex.II) Dept, dated:22.06.2015
4. G.O.Ms. No.217, Rev (Ex.II) Dept, dated:22.06.2015
5. From the Commr.of Prohibition & Excise, A.P., Hyderabad, D.O.Lr.in Cr.No.999/2015/CPE/E3, Dated: 22.06.2015.

కేబినెట్ ఆమోదం లేకుండా మద్యం దుకాణాలపై ప్రివిలేజ్ ఫీజు రద్దు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో-218 కాపీ


Rule 10(a) : The licensee shall pay a Privilege Fee @ 9% and Value Added Tax (VAT) thereon, on the Sale Price of Indian Made Foreign Liquor and Foreign Liquor purchased from the Andhra Pradesh Beverages Corporation Limited when the cumulative value of his/her purchases during the licence year exceeds [six times] of the annual Licence Fee.

Rule 10(2): The mode of levying licence fee is on the basis of population [and other factors] as notified by the Government from time to time. The rates a notified by the Government from time to time are applicable at the time of issue of 2B licence to one consumption enclosure including any contiguous enclosure of the premises which is licensed by the local authority for establishing a Hotel/Restaurant:

(4) In Rule10, –
(i) sub-rule (2) shall be omitted.

బార్లపై ప్రివిలేజ్ ఫీజు రద్దు చేస్తూ జీవోలో పేర్కొన్న అంశం

ఆర్థిక శాఖ అనుమతి లేదు... కేబినెట్ ఆమోదం లేదు

అధికారంలో ఉండగా మద్యం విధానం ముసుగులో చంద్రబాబు ప్రభుత్వం యథేచ్ఛగా అవినీతికి పాల్పడింది. 2012 నుంచి అమలులో ఉన్న ప్రివిలేజ్ ఫీజును నిబంధనలకు విరుద్ధంగా తొలగించింది. కనీసం ఆర్థిక శాఖ అనుమతిగానీ కేబినెట్ ఆమోదంగానీ లేకుండానే కథ నడిపించింది. రెండు జీవోలకు కేబినెట్ తీర్మానం చేసి ప్రివిలేజ్ ఫీజు తొలగించే కీలకమైన జీవోను మాత్రం అడ్డదారిలో తేవడం చంద్రబాబు పన్నాగానికి నిదర్శనం. 2015లో చంద్రబాబు ప్రభుత్వం కొత్త మద్యం విధానాన్ని తెచ్చింది. నాడు కేబినెట్ సమావేశానికి ముందు అప్పటి ఎక్సైజ్ కమిషనర్ ఓ నోట్ ఫైల్‌ను ప్రభుత్వానికి పంపారు. మద్యం దుకాణాలు, బార్లపై ప్రివిలేజ్ ఫీజును కొనసాగించడమే కాకుండా 10 రెట్లు పెంచాలని అందులో ప్రతిపాదించారు. అయితే ఆ ప్రతిపాదనను చంద్రబాబు కేబినెట్ దృష్టికే తీసుకెళ్లలేదు. నూతన మద్యం విధానంపై కేబినెట్ సమావేశంలో చర్చించి 2015 జూన్ 22న జీవోలు 216, 217 జారీ చేయగా ఆ రెండు జీవోల్లోనూ మద్యం దుకాణాలకు (ఏ 4 షాపులు) ప్రివిలేజ్ ఫీజు తొలగిస్తున్నట్లు ఎక్కడా పేర్కొనలేదు. అయితే అదే రోజు సాయంత్రం అప్పటి ఎక్సైజ్ కమిషనర్ ప్రభుత్వానికి ఓ నోట్ పంపారు. మద్యం దుకాణాలపై ప్రివిలేజ్ ఫీజు తొలగించాలని ప్రతిపాదిస్తూ అందుకోసం ఎక్సైజ్ చట్టం 16(9) నిబంధనను రద్దు చేయాలని అందులో సిఫార్సు చేశారు. ఆ నోట్ ఫైల్‌ను చంద్రబాబు కార్యాలయానికి పంపారు. ఈమేరకు 'కాపీ టు పీఎస్ టు సీఎం' అని నోట్‌ఫైల్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. అంటే ప్రివిలేజ్ ఫీజును తొలగిస్తున్న విషయం చంద్రబాబుకు స్పష్టంగా తెలుసని తేలిపోతోంది.

సాయంత్రం గుట్టుగా జీవో

చంద్రబాబు ఆమోదంతోనే ప్రివిలేజ్ ఫీజును రద్దు చేస్తూ అదే రోజు అంటే 2015 జూన్ 22న సాయంత్రం గుట్టుగా జీవో 218 జారీ అయింది. ఈ జీవో గురించి కేబినెట్‌లో చర్చించలేదు. అజెండాలో ఆ అంశమే చేర్చలేదు. ఖజానాకు నష్టం వాటిల్లే అంశాలపై ముందుగా ఆర్థిక శాఖ ఆమోదం తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ ప్రివిలేజ్ ఫీజు రద్దు విషయాన్ని ఆర్థిక శాఖకు తెలియచేయలేదు. అనుమతి తీసుకోలేదు. అంటే కేబినెట్‌కు తెలియకుండా, కనీసం ఆర్థిక శాఖ అనుమతి లేకుండా కథ నడిపించాలని చంద్రబాబు ముందే నిర్ణయించుకున్నట్లు స్పష్టమవుతోంది.

బార్లలోనూ అదే బరితెగింపు...

మద్యం దుకాణాలపై అడ్డగోలుగా ప్రివిలేజ్ ఫీజును రద్దు చేసిన చంద్రబాబు అంతటితో ఆగలేదు. తన సన్నిహితులైన బార్ల యజమానులకు కూడా అదే రీతిలో లబ్ధి చేకూర్చారు. ఈమేరకు చంద్రబాబు ఆదేశాలతో బార్లపై ప్రివిలేజ్ ఫీజును రద్దు చేయాలని, అందుకోసం ఎక్సైజ్ చట్టం 10(ఏ) నిబంధన తొలగించాలంటూ అప్పటి ఎక్సైజ్ కమిషనర్ 2015 సెప్టెంబరు 1న ఓ సర్క్యులర్ ఇచ్చారు. ప్రివిలేజ్ ఫీజు రద్దు చేయాలని బార్ల యజమానులు ప్రభుత్వాన్ని అభ్యర్థించినట్లు కనికట్టు చేశారు. 2015 సెప్టెంబరు 9న బార్ల యజమానులు ఈ మేరకు వినతిపత్రం సమర్పించినట్లు రికార్డుల్లో చూపడం గమనార్హం. సెప్టెంబరు 9న వినతి పత్రం సమర్పిస్తే దానికి వారం రోజులు ముందుగానే సెప్టెంబరు 1నే ప్రివిలేజ్ ఫీజు రద్దు చేయాలని ఎక్సైజ్ కమిషనర్ సర్క్యులర్ ఎలా ఇచ్చారన్నది చంద్రబాబే చెప్పాలి. బార్లకు ప్రివిలేజ్ ఫీజు రద్దుపై కూడా ఆర్థిక శాఖ అనుమతి తీసుకోలేదు. కేబినెట్ ఆమోదమూ పొందలేదు. ఏకపక్షంగా రద్దు చేయాలని నిర్ణయించారు. బార్లపై ప్రివిలేజ్ ఫీజును రద్దు చేస్తూ 2015 డిసెంబర్ 11న జీవో 468 జారీ అయింది. నాటి సీఎం చంద్రబాబు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఈ వ్యవహారాన్ని గుట్టుగా నడిపారు. అందుకు సంబంధించిన నోట్ ఫైళ్లపై ఎక్సైజ్ శాఖ మంత్రి హోదాలో కొల్లు రవీంద్ర 2015 డిసెంబర్ 3న సంతకం చేయగా ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు 2015 డిసెంబర్ 4న డిజిటల్ సంతకాలు చేయడం గమనార్హం. ఇన్నాళ్లూ అసలు ప్రివిలేజ్ ఫీజు రద్దు విషయం చంద్రబాబుకు కనీసం తెలియదని టీడీపీ న్యాయవాదులు, ఈనాడు రామోజీరావు బుకాయించారు.

తీవ్రంగా తప్పుబట్టిన ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్

టీడీపీ సర్కారు నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణాలు, బార్లపై ప్రివిలేజ్ ఫీజును రద్దు చేయడాన్ని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ తీవ్రంగా తప్పుబట్టారు. రాజ్యాంగబద్ధ సంస్థ 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్'(కాగ్) ఆధ్వర్యంలో స్వతంత్రంగా విధులు నిర్వర్తించే ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఈమేరకు తన అభ్యంతరాలను స్పష్టంగా నివేదించారు. చంద్రబాబు సర్కారు నిర్వాకంతో రాష్ట్ర ఖజానాకు రూ.1,299.64 కోట్లు నష్టం వాటిల్లిందని స్పష్టం చేశారు.

26, 27న తిరుపతిలో ప్రధాని మోదీ పర్యటన

ఏర్పాట్లపై సీఎస్ జవహర్‌రెడ్డి సమీక్ష



సాక్షి, అమరావతి: ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 26, 27 తేదీల్లో తిరుపతిలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డా.కేఎస్.జవహర్‌రెడ్డి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ఈనెల 26వ తేదీ సాయంత్రం తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారని తెలిపారు. అక్కడి నుంచి తిరుమల వెళ్లి.. రాత్రి బస చేస్తారని చెప్పారు. 27వ తేదీ ఉదయం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారని పేర్కొన్నారు. అనంతరం తిరుపతికి చేరుకొని.. అక్కడి నుంచి హైదరాబాద్‌కు బయలుదేరి వెళతారని వెల్లడించారు. ప్రధాని మోదీ తిరుపతి విమానాశ్రయం నుంచి తిరుమల కొండపైకి చేరుకునే రోడ్డు మార్గం వెంబడి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖ అధికారులను సీఎస్ ఆదేశించారు. 27వ తేదీ ఉదయం తిరుమలలో స్వామి వారిని దర్శించుకునే సమయంలో.. వీవీఐపీ పర్యటన నిబంధనల ప్రకారం అవసరమైన ఏర్పాట్లు చేయాలని టీటీడీ ఈవో ధర్మారెడ్డికి సీఎస్ సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని.. ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్, రాష్ట్ర ప్రొటోకాల్ విభాగం డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, డీఎంఈ డా.నర్సింహం, ఐ అండ్ పీఆర్ అదనపు సంచాలకులు ఎల్.స్వర్ణలత, తిరుపతి కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, టీటీడీ ఈవో ధర్మారెడ్డి, తిరుపతి ఎస్పీ పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పోలీసులపై 'సంగం' దౌర్జన్యం

- డెయిరీ లోపలికి రాకుండా అడ్డుకున్న టీడీపీ, సిబ్బంది

చేబ్రోలు: తమకు బకాయి ఉన్న బోనస్ డబ్బులను చెల్లించాలని కోరిన ఏలూరు జిల్లా పాడి రైతులపై దాడి చేసిన కేసులో నిందితులను అరెస్టు చేసేందుకు వెళ్లిన పోలీసులపై సంగం డెయిరీ సిబ్బంది, టీడీపీ శ్రేణులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే.. పాలు పోసిన రైతులకు ఒప్పందం ప్రకారం చెల్లించాల్సిన సుమారు రూ.50లక్షల బోనస్ డబ్బులు చెల్లించకుండా జాప్యం చేస్తున్నారంటూ సంగం డెయిరీ సిబ్బందిని నిలదీసిన ఏలూరు జిల్లా లింగపాలెం మండలం రంగాపురం, వేములపల్లి గ్రామాలకు చెందిన పాడి రైతులపై చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అనుచరులు దాడి చేసిన విషయం విదితమే. డెయిరీ సిబ్బంది, ధూళిపాళ్ల అనుచరులు సుమారు వందమంది విచక్షణారహితంగా కర్రలు, రాడ్లు, రాళ్లతో దాడి చేయడంతో 15మంది రైతులకు కాళ్లు, చేతులు విరగడంతోపాటు తీవ్ర గాయాలయ్యాయి. మూడు కార్లు ధ్వంసం కావడంతో రూ.ఐదు లక్షల మేర నష్టం జరిగింది. అప్పట్లో బాధిత రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రతోపాటు 15 మందిపై కేసు నమోదు చేశారు. ఇప్పటికే కేసులోని కొంతమందిని అరెస్ట్ చేశారు. మరికొందరు నిందితులు గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని సంగం డెయిరీలో తలదాచుకున్నారన్న సమాచారం అందుకున్న పొన్నూరు రూరల్ సీఐ ఎం.రాంబాబు, చేబ్రోలు ఎస్ఐ కె.ఆనంద్, పొన్నూరు ఎస్ఐ భార్గవ్, పోలీసు సిబ్బంది శుక్రవారం డెయిరీ ప్రధాన ద్వారం వద్దకు చేరుకున్నారు. వీరి రాకను ముందే పసిగట్టిన డెయిరీ సిబ్బంది, టీడీపీ శ్రేణులు పోలీసులను అడ్డుకున్నారు. మార్కెటింగ్ మేనేజర్ శ్రీధర్, డీఈ వెంకటేశ్వరరావు తదితరులు పోలీసులు అనుమతి లేకుండా సంగం డెయిరీలోకి ప్రవేశించడానికి వీలులేదని తెలిపారు. ఏలూరు రైతులపై దాడి కేసులో నిందితులు డెయిరీలో ఉన్నారని.. వారి కోసం వచ్చినట్లు సీఐ, ఎస్ఐలు చెప్పినప్పటికీ వారు పట్టించుకోలేదు. సెర్చ్ వారెంట్, రెవెన్యూ అనుమతి కావాలని చెప్పడంతో ఇరువురు వీఆర్వోలు ఉన్నారని చూపినప్పటికీ లోపలికి రావడానికి వీల్లేదని పట్టుబట్టారు. సంగం డెయిరీ సిబ్బందితోపాటు, నియోజకవర్గ పరిధిలోని చేబ్రోలు, పొన్నూరు, పెదకాకాని మండలాలకు చెందిన టీడీపీ శ్రేణులు అక్కడకు చేరుకుని పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. కొద్దిసేపటి తర్వాత పోలీసులు అక్కడ నుంచి వెళ్లిపోయారు.


పోలీసులు లోపలికి రాకుండా గేట్ వద్ద అడ్డుకుంటున్న సంగం డెయిరీ సిబ్బంది, టీడీపీ శ్రేణులు

9 నుంచి కులగణన

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు వెల్లడి

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా చరిత్రాత్మకమైన కులగణన ప్రక్రియను డిసెంబర్ 9వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తెలిపారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద శుక్రవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రి వేణు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జనగణన తప్ప కులగణన జరగలేదని చెప్పారు. సామాజిక సాధికారితకు చిరునామాగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప సంకల్పంతో కులగణన చేపట్టాలని నిర్ణయించారని తెలిపారు. అట్టడుగు కులాలతోపాటు అన్ని వర్గాల పేదల తలరాతలు మార్చడానికే సమగ్ర కులగణనను తమ ప్రభుత్వం చేపట్టిందని పునరుద్ఘాటించారు. ప్రజల జీవన స్థితిగతులను మార్చేందుకు కులగణన చాలా అవసరమని చెప్పారు. సమగ్ర కులగణనతో రాష్ట్రంలో పేదవాడి జీవితానికి భద్రత లభిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో నిర్వహించనున్న కులగణన దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని మంత్రి ధీమా వ్యక్తంచేశారు.

బీసీలను అణగదొక్కిన చంద్రబాబు

రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపడుతున్నట్లు ప్రకటించడంతో చంద్రబాబు సహా ప్రతిపక్షనేతలకు వెన్నులో వణుకుపుడుతోందని మంత్రి వేణు అన్నారు. చంద్రబాబు హయాంలో బీసీలను కేవలం ఓట్లు వేసేందుకు పనికివచ్చే యంత్రాలుగా చూశారని మండిపడ్డారు. విద్య అవకాశాలను అందుకోలేని, ఆర్థికంగా బలహీనంగా ఉన్న బీసీలతోపాటు అనేక వర్గాలను చంద్రబాబు ముఖ్యమంత్రి స్థానంలో ఉండి అణగదొక్కారని ఆగ్రహం వ్యక్తంచేశారు. చంద్రబాబు అధికారంలో ఉన్నాననే అహంకారంతో 'మత్స్యకారులను తోలుతీస్తా. నాయీబ్రాహ్మణుల తోకలు కత్తిరిస్తా...' అని అన్న మాటలు తనను ఎంతో బాధించాయని మంత్రి వేణు చెప్పారు. చంద్రబాబు వివక్షతో చూసిన కులాలను సీఎం వైఎస్ జగన్ అక్కున చేర్చుకున్నారని తెలిపారు. అట్టడుగు వర్గాల్లో ఆత్మన్యూనతాభావాన్ని తొలగించి వారు సగర్వంగా తలెత్తుకుని జీవించేలా సీఎం జగన్ అండగా నిలిచారని ప్రశంసించారు. కులగణనలో ఎవరి సూచనలు, సలహాలు తీసుకోలేదని టీడీపీ చేస్తున్న విమర్శల్లో నిజం లేదని మంత్రి కొట్టిపారేశారు. కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లా, ప్రాంతీయ స్థాయిల్లో సమావేశాలు నిర్వహించి అన్ని కులాల నాయకుల అభిప్రాయాలు సేకరిస్తున్నామని, వాటిని క్రోడీకరించి కులగణను సమర్థవంతంగా నిర్వహిస్తామని వివరించారు. అవసరమైతే మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని ఆలోచన చేస్తున్నామని చెప్పారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేశ్, అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మంచి నిర్ణయాలు తీసుకుంటే స్వాగతించాల్సిందిపోయి విమర్శించడం సరికాదని ఆయన హితవుపలికారు.

వారికి సాధారణ పోలీసు విధులు అప్పగించం

- కేసుల దర్యాప్తులో మహిళా పోలీసులు భాగం కారు
- హైకోర్టుకు మరోసారి నివేదించిన ఏజీ.. తీర్పు వాయిదా

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే మహిళా పోలీసులకు పోలీసు శాఖలో సాధారణ విధులైన బందోబస్తు, శాంతిభద్రతల పరిరక్షణ తదితర విధులను అప్పగించబోమని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్(ఏజీ) ఎస్.శ్రీరామ్ హైకోర్టుకు నివేదించారు. దీనిపై ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలు, డీఐజీలు, పోలీసు కమిషనర్లకు డీజీపీ ఆదేశాలిచ్చారని, ఆ మేరకు మెమో కూడా జారీ చేశారని ఆయన వివరించారు. చిన్నారులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారంకోసం ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవడమే మహిళా పోలీసుల ప్రధాన బాధ్యతని స్పష్టం చేశారు. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు యలమంజుల బాలాజీ, నర్రా శ్రీనివాసరావు వాదనలు వినిపిస్తూ మహిళా పోలీసుల నియామకం చట్టవిరుద్ధమన్నారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గా ప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయి ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మహిళా సంరక్షణ కార్యదర్శులను మహిళా పోలీసులుగా పరిగణించడాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలవడం విదితమే. వీటిపై ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది.

క్లుప్తంగా...

టీబీ నియంత్రణలో భాగస్వాములు కావాలి

- వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు పిలుపు

సాక్షి, అమరావతి: క్షయ(టీబీ) నియంత్రణలో అందరూ భాగస్వాములు కావాలని వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణ బాబు పిలుపునిచ్చారు. కేంద్రం అమలు చేస్తున్న 'పీఎం టీబీ ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమం ద్వారా క్షయ రోగులకు అదనపు పౌష్టికాహారాన్ని అందించేందుకు ముందుకు రావాలని కోరారు. క్షయ రోగులకు బలవర్ధక ఆహారాన్ని అందజేసేందుకు కొహన్స్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) ఎం.ఎస్.ఎన్ రెడ్డి.. కనెక్ట్ టు ఆంధ్రా సంస్థ ద్వారా శుక్రవారం మంగళగిరిలోని వైద్య శాఖ కార్యాలయంలో కృష్ణ బాబుకు రూ.40 లక్షల చెక్ అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యసేవ లందించేందుకు సీఎం జగన్ ప్రాధాన్యత ఇస్తున్నారని, ఏపీని టీబీరహిత రాష్ట్రంగా చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ నివాస్ మాట్లాడుతూ 33,745 మంది టీబీ రోగులకు అదనపు పోషకాహారం నిమిత్తం ఫుడ్ బాస్కెట్లు అందజేశామని, ఎన్టీఆర్, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వచ్చే ఆరు నెలల్లో మరో 2,417 మంది రోగులకు రూ.78 లక్షల విలువైన ఫుడ్ బాస్కెట్లను అందజేయనున్నామని తెలిపారు.

ఏపీలో ఉద్యోగులు తెలంగాణ ఓటరైతే పోలింగ్ రోజు సెలవు

- 30న వేతనంతో కూడిన సెలవుగా ప్రకటించిన సీఈవో



సాక్షి, అమరావతి: తెలంగాణలో ఓటర్లుగా ఉండి.. ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ సరిహద్దు జిల్లాల్లోని వ్యాపార, వాణిజ్య సంస్థలు, పరిశ్రమలు, ఏరకమైన ఎస్టాబ్లిష్‌మెంట్‌లోనైనా పనిచేస్తున్న ఉద్యోగులు ఈనెల 30వ తేదీన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు వేతనంతో కూడిన సెలవును రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా శుక్రవారం ప్రకటించారు. కూలీలకు, రోజువారీ వేతనాలు పొందే వారికి కూడా ఈ సెలవు వర్తిస్తుందని ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణకు సరిహద్దు జిల్లాలైన ఏపీలోని ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, కర్నూలు, నంద్యాల, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఆయా పొరుగు జిల్లాల పరిధిలోని మున్సిపల్ కార్పొరేషన్లు, ఇతర స్థానిక సంస్థలు, యూనివర్సిటీల్లో పనిచేస్తున్న వారు ఎవ్వరైనా తెలంగాణ ఓటర్లుగా ఉంటే వారికి కూడా 30వ తేదీన వేతనంతో కూడిన సెలవుగా ప్రకటించాలని ఆదేశించారు.

ముద్దపు ప్రసాదరావుకు 'జాతీయ గోపాల్ రత్న'

- రేపు జాతీయ పాల దినోత్సవం సందర్భంగా అవార్డు ప్రదానం

సాక్షి, న్యూఢిల్లీ: శ్రీకాకుళానికి చెందిన ముద్దపు ప్రసాద్‌రావు 'జాతీయ గోపాల్ రత్న' అవార్డుకు ఎంపికయ్యారు. జాతీయ పాల దినోత్సవం సందర్భంగా కేంద్ర పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ 'జాతీయ గోపాల్ రత్న' అవార్డులను శుక్రవారం ప్రకటించింది. ఉత్తమ కృత్రిమ గర్భధారణ సాంకేతిక నిపుణుడు కేటగిరీలో ప్రసాద్‌రావుకు మూడో ర్యాంకు వచ్చింది. దేశవ్యాప్తంగా మొత్తం 1,770 దరఖాస్తులు రాగా, మూడు కేటగిరీల్లో కలిపి పదిమందిని జాతీయ అవార్డులకు ఎంపిక చేశారు. జాతీయ పాల దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న అసోం రాజధాని గువహటిలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో అవార్డులు ప్రదానం చేయనున్నారు. కాగా, దేశవాళీ పశువుల పెంపకంలో ఉత్తమ పాడిరైతు కేటగిరీలో హరియాణలోని కర్నాల్‌కు చెందిన శ్రీరామ్‌సింగ్ మొదటి ర్యాంకు సాధించారు. బెస్ట్ డైరీ కో-ఆపరేటివ్ సొసైటీ కేటగిరీలో కేరళలోని వాయనాడ్‌కు చెందిన పూల్‌పల్లి క్షీరోల్ పథక సహకార సంఘం మొదటి ర్యాంకు పొందింది. ఉత్తమ కృత్రిమ గర్భధారణ సాంకేతిక నిపుణుడు కేటగిరీలో బిహార్‌లోని అరారియాకు చెందిన సుమన్ కుమార్ షాకు మొదటి ర్యాంకు లభించింది.

తెలంగాణ

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ అభివృద్ధి

- కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్/ బండ్లగూడ, అంబర్‌పేట (హైదరాబాద్): తెలంగాణ అభివృద్ధికి డబుల్ ఇంజన్ సర్కార్ అవసరమని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే కోట్లాది రూపాయలు తెచ్చి తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చుతామని చెప్పారు. సంక్షేమం అంటే ఏమిటో చేసి చూపిస్తామని, బీసీని సీఎం చేసి తీరుతామని అన్నారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నిర్వహించిన సకల జనుల సంకల్ప సభలో, హైదరాబాద్‌లో నిర్వహించిన రోడ్‌షోల్లో ఆయన ప్రసంగించారు. తన కుమారుడు కేటీఆర్ కోసమే కేసీఆర్ రాష్ట్రంలో అవినీతి పాలన సాగించారని ఆరోపించారు. డబ్బులు ఎక్కువ ఇచ్చిన వాళ్లకే కేసీఆర్ మంత్రివర్గంలో అవకాశం దక్కుతుందని, ఇక కాంగ్రెస్‌లో రాష్ట్ర మంత్రి పదవి కావాలంటే ఢిల్లీలో చర్చ జరగాలని అన్నారు. ఇలాంటి పార్టీలు మనకు అవసరం లేదని చెప్పారు.

'స్మార్ట్' మీటర్లకు సై

రాష్ట్రవ్యాప్తంగా రైతుల సంపూర్ణ మద్దతు

- అన్నదాతలపై పైసా భారం వేయకుండా మీటర్ల ఏర్పాటు
- రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సర్వీసులకు మొదలైన బిగింపు ప్రక్రియ
- తద్వారా వ్యవసాయ బోర్లకు నాణ్యమైన విద్యుత్
- విద్యుత్ పంపిణీ సంస్థల్లో పెరగనున్న జవాబుదారీతనం
- బిల్లు డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ
- అక్కడి నుంచి విద్యుత్ పంపిణీ సంస్థలకు చెల్లింపు
- విద్యుత్ లెక్క.. మోటారు పనితీరు తెలుసుకునే అవకాశం
- రైతుకు భద్రత, సరఫరాలో పెరగనున్న నాణ్యత
- ఇంత మేలు జరుగుతుంటే ఎలా కాదంటామంటున్న రైతులు



వీరంపాలెం గ్రామం నుంచి సాక్షి ప్రతినిధి బోణం గణేష్:

అర్ధరాత్రి చేనుకు నీరు పెట్టేందుకు వెళ్లి మోటార్ స్విచ్ ఆన్ చేయగానే విద్యుత్ షాక్ తగిలి అన్నదాత ప్రాణాలు వదిలేస్తే ఆ కుటుంబం పడే వేదన వర్ణనాతీతం. రైతులకు ఇచ్చే కరెంటులో నాణ్యత లేకపోతే పంట మనుగడ కష్టం. ఎన్ని సర్వీసులకు ఎంత విద్యుత్ ఇవ్వాలో తెలియక సాంకేతిక సమస్యలతో సబ్ స్టేషన్లపై లోడ్ ఎక్కువై ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే విద్యుత్ పంపిణీ సంస్థలకు నష్టం. ఈ సమస్యలను అధిగమించి, పగటి పూట తొమ్మిది గంటల పాటు ఉచితంగా సరఫరా చేస్తున్న విద్యుత్‌ను ఇకపై రైతులకు హక్కుగా మార్చాలని భావించిన రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తోంది. ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగిస్తూ, మరింత నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామంటుంటే ఎందుకు కాదంటామని రైతులు ఎదురు ప్రశ్నిస్తున్నారు. పొలాల్లో ప్రాణాలు వదిలే పరిస్థితిగానీ, నీళ్లు లేక పంటలు ఎండిపోయే దుస్థితిగానీ రాకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి రైతులు మద్దతు పలుకుతున్నారు.

పైలట్ ప్రాజెక్టులో 33% విద్యుత్ ఆదా

రివాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ స్కీమ్ (ఆర్డీఎస్ఎస్)లో భాగంగా 2025 మార్చి నాటికి దేశం అంతటా అన్ని రాష్ట్రాలూ స్మార్ట్ విద్యుత్ మీటర్లు పెట్టాలని కేంద్రం ఇచ్చిన ఆదేశాల మేరకు 2019లోనే సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ఒక రెగ్యులేషన్ ఇచ్చింది. దాని ప్రకారం రాష్ట్రంలో 18.56 లక్షల వ్యవసాయ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు అమర్చాలని 2020లో విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం విద్యుత్ వినియోగంలో 18 శాతం నుంచి 20 శాతం వరకు వ్యవసాయ రంగం వాటా ఉంది. దీనిని మరింత కచ్చితంగా లెక్కించడం కష్టమవుతోంది. ఇది తెలియాలంటే మీటర్లు అమర్చి, విద్యుత్ వినియోగాన్ని లెక్కించాలి. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ముందు శ్రీకాకుళం జిల్లాలో ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) పైలట్ ప్రాజెక్ట్ చేపట్టింది. ఫలితంగా 33 శాతం విద్యుత్ ఆదా కనిపించింది. దీంతో రాష్ట్రం అంతటా స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు డిస్కంలు సన్నద్ధమయ్యాయి. తొలి విడతగా ఏపీఈపీడీసీఎల్‌లో 32,500, ఏపీసీపీడీసీఎల్‌లో 35,000, ఏపీఎస్పీడీసీఎల్‌లో 70,200 చొప్పున స్మార్ట్ మీటర్లను అమర్చే ప్రక్రియను మొదలుపెట్టాయి.

నమ్మకంతోనే రైతుల మద్దతు

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడానికి అయ్యే ఖర్చును పూర్తిగా ప్రభుత్వమే భరిస్తోంది. ప్రస్తుతం రైతుల పేరిట ఉన్న బ్యాంక్ ఖాతాలతో సంబంధం లేకుండా ప్రభుత్వమే కొత్త ఖాతాలు తెరిపిస్తోంది. వినియోగం ఆధారంగా బిల్లు మొత్తం నగదు బదిలీ ద్వారా జమ చేస్తుంది. అది డిస్కంలకు బదిలీ అవుతుంది. దీనివల్ల నాణ్యమైన విద్యుత్‌ను పొందే హక్కు రైతులకు లభిస్తుంది. మీటర్ రీడింగ్ కోసం మోటారు దగ్గరకు లైన్‌మెన్లు రావడం వల్ల విద్యుత్ సమస్య ఏదైనా ఉంటే వారి దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే పరిష్కరించుకోవచ్చు. రీడింగ్‌ను బట్టి పంపు, మోటారు పనిచేసే విధానాన్ని తెలుసుకుని లోటుపాట్లు ఉంటే సరిచేసుకోవచ్చు. ఎంత లోడు వాడుతున్నారో కచ్చితంగా తెలియడం వల్ల ఆ మేరకు విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు పటిష్టం చేసుకోవచ్చు. అనధికార కనెక్షన్లు ఉండవు. ఇలాంటి ఏర్పాటుపై నమ్మకం కుదరడంతో స్మార్ట్ మీటర్లు పెట్టడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని రైతులు అంగీకార పత్రాలను డిస్కంలకు అందించారు.

పనితనానికి, ప్రాణానికి భరోసా

మీటర్‌తో పాటు ఏర్పాటు చేస్తున్న రక్షణ పరికరాలతో అనేక ప్రయోజనాలున్నాయి. ఇందులో ఉండే కెపాసిటర్, వోల్టేజి హెచ్చు తగ్గులను నివారించి వ్యవసాయ విద్యుత్ మోటారు జీవిత కాలాన్ని పెంచడానికి దోహదపడుతుంది. మోటారు పనితనం వృద్ధి చెందుతుంది. మోటారు స్టార్టర్, వైండింగ్, అనుసంధానించిన వైర్లలో వచ్చిన లోపాలతో మోటారు కాలిపోవడం గాని, షార్ట్ సర్క్యూట్‌తో ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్ అవ్వడం గాని జరగకుండా కాన్ఫిగరేషన్ కంట్రోల్ బోర్డ్ (సీసీబీ) కాపాడుతుంది. వర్షాలకు తడిచినప్పుడు ఇనుప బాక్స్‌ల ద్వారా కలిగే విద్యుత్ ప్రమాదాలను షీట్ మౌల్డింగ్ కాంపౌండ్ (ఎస్ఎంసీ) బాక్స్ నివారిస్తుంది. ఎర్త్ వైరు, పైపులను ప్రమాణాలకు అనుగుణంగా ఏర్పాటు చేయడం, సరైన పద్ధతిలో అనుసంధానించడం వల్ల రైతులకు మోటారు స్టార్టర్, మీటరు బాక్సు తదితర ఉపకరణాల ద్వారా షాక్ తగలదు. వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లదు.

రైతుపై పైసా భారం పడదు



స్మార్ట్ మీటర్ల కోసం రైతులు తమ జేబు నుంచి ఒక్క పైసా చెల్లించనవసరం లేదు. ప్రస్తుతం ఉన్న ఏ ఒక్క విద్యుత్ సర్వీసునూ స్మార్ట్ మీటర్లు పెట్టిన తర్వాత తొలగించరు. ఒక వినియోగదారుని పేరిట కొన్ని కనెక్షన్లే ఉండాలనే నిబంధన ఏదీ లేదు. ఎక్కువ కనెక్షన్లు ఉంటే ఎటువంటి ఇబ్బంది ఉండదు. ప్రస్తుత యజమాని పేరిట సర్వీసు కనెక్షన్ పేరు మార్చుకోవాలన్నా చేసుకోవచ్చు. అనధికార, అదనపు లోడు కనెక్షన్లన్నీ క్రమబద్ధీకరిస్తారు. పేర్ల మార్పు ప్రక్రియ కోసం, బ్యాంకు ఖాతాలు తెరవడానికి, రైతు ఎవరి దగ్గరకూ వెళ్లనవసరం లేదు. డిస్కంలు, గ్రామ సచివాలయ సిబ్బందే రైతు వద్దకు వచ్చి అవసరమైన మార్పులు చేర్పులు చేస్తున్నారు.

– కె.విజయానంద్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఇంధన శాఖ

అనుమానాలేం లేవు



స్మార్ట్ మీటర్ పెడతామన్నప్పుడు మా ఎలక్ట్రికల్ ఇంజనీర్ రామకృష్ణని, లైన్‌మెన్‌ని దాని గురించి అడిగాను. బిల్లు వేస్తారని అందరూ అంటున్నారనే సందేహాన్ని వారి వద్ద వ్యక్తం చేశాను. అలాంటిదేమీ లేదని, ఉచిత విద్యుత్ ఎన్ని యూనిట్లు వాడుతున్నామనేది తెలుసుకోవడం కోసమే మీటర్లు అని చెప్పడంతో నా అనుమానాలన్నీ తీరిపోయాయి. వెంటనే మీటర్ అమర్చడానికి అంగీకరించాను.

– అఖిల్ రెడ్డి, రైతు, వీరంపాలెం

మాకే మంచిది



స్మార్ట్ మీటర్లు కాలిపోయినా, పనిచేయకపోయినా, దొంగతనానికి, మరమ్మతులకు గురైనా ఆ ఖర్చులు మొత్తం విద్యుత్ కంపెనీలే భరిస్తాయని హామీ ఇచ్చారు. మేం పైసా కట్టకుండా మీటర్ పెడతామన్నారు. అంతకంటే ఏం కావాలి? ఇప్పటికే మాకు తొమ్మిది గంటలు పగలు కరెంటు ఇస్తున్నారు. దానివల్ల పంటలు బాగా పండుతున్నాయి. మీటర్లు పెట్టాక ఇంకా మేలు జరుగుతుందంటే మాకే మంచిది కదా!

– మాకిరెడ్డి కృష్ణారెడ్డి, రైతు, వీరంపాలెం

రైతులకు మెరుగైన విద్యుత్



రైతులకు నాణ్యమైన కరెంటు ఇవ్వడంలో ఎక్కడా రాజీ పడకూడదని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకోసం ఏలూరు ఆపరేషన్ సర్కిల్, సీలాద్రిపురం సెక్షన్‌లోని వీరంపాలెంలో ముందుగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నాం. రైతులకు మీటర్లపై అవగాహన కల్పించడంతో వారంతా సంపూర్ణ మద్దతునిస్తున్నారు. ఎక్కడా ఎలాంటి వ్యతిరేకత రావడం లేదు.

– పి.సాల్మన్‌రాజు, ఎస్ఈ, ఏలూరు ఆపరేషన్ సర్కిల్, ఏపీఈపీడీసీఎల్

రామోజీ మార్కు స్మార్ట్ బ్లండర్!

- ధర తగ్గినా తట్టుకోలేరా?
- కడప జిల్లా వాసులైతే వ్యాపారాలు చేయొద్దా?
- పూర్తి పారదర్శకంగా ఉచిత విద్యుత్తు స్మార్ట్ మీటర్ల టెండర్లు
- రీ టెండరింగ్ వల్ల 15.75 శాతం తగ్గిన ధరలు
- పదేళ్లకు పెరిగిన మీటర్ గ్యారంటీ సమయం.. ఇతర రాష్ట్రాలతో 'ఈనాడు' పొంతన లేని పోలికలు

సాక్షి, అమరావతి: వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు స్మార్ట్ మీటర్ల టెండర్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టి రివర్స్ టెండర్లు కూడా నిర్వహించాకే ఖరారు చేస్తే అదేదో ఘోరమైనట్లుగా ఈనాడు రామోజీ చిత్రీకరిస్తున్నారు. కడప జిల్లా వాసులు అసలు వ్యాపారాలే చేయకూడదన్నట్లుగా స్మార్ట్ మీటర్ల టెండర్ దక్కించుకున్న సంస్థపై ఈనాడు పదేపదే విషం గక్కుతోంది. ఈనాడు కథనాల్లో ఏమాత్రం వాస్తవం లేదని ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల సీఎండీలు ఐ.పృథ్వీ తేజ్, జె.పద్మాజనార్ధనరెడ్డి, కె.సంతోషరావు స్పష్టం చేశారు.

జగన్ మార్కు స్మార్ట్ టెండర్!



కోవిడ్‌లో అధిక ధర.. అందుకే రద్దు

వ్యవసాయానికి పగటిపూటే 9 గంటలు ఉచిత విద్యుత్ అందించడం, ప్రమాదాలకు తావు లేకుండా, మీటర్లు కాలిపోకుండా, ట్రాన్స్‌ఫార్మర్ల భద్రతని దృష్టిలో పెట్టుకుని స్మార్ట్ లేదా ఐఆర్‌డీఏ మీటర్లను రక్షణ పరికరాలతో అమర్చాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈమేరకు టెండర్ రూపొందించిన డిస్కమ్‌లు న్యాయ సమీక్షకు పంపించాయి. 15 రోజుల సలహాలు, అభ్యంతరాలను సేకరించిన అనంతరం ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా డిస్కమ్‌లు టెండర్లను పిలిచాయి. ఎల్1 గా నిలిచిన బిడ్డర్‌కు టెండర్ అప్పగించాయి. అయితే ఈ ప్రక్రియ కోవిడ్ సమయంలో జరిగినందువల్ల సంస్థలు, ఫ్యాక్టరీలు మూతపడి ఉండడం, టెండర్ విలువ అధికంగా ఉండటాన్ని గుర్తించిన ప్రభుత్వం ఆ ప్రక్రియను రద్దు చేసింది.

మళ్లీ పిలవడంతో ఆదా..

ధరలు తగ్గించేలా చర్యలు తీసుకున్నామని ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నది అక్షర సత్యమే. రీ టెండరింగ్ ద్వారా ధర మొదటిసారి కంటే 15.75% తగ్గింది. ఏర్పాటుకు 27 నెలలు, నిర్వహణకు 93 నెలలుగా కేంద్ర ప్రభుత్వం వ్యవధి పెంచింది. దీనివల్ల మీటర్ గ్యారంటీ పీరియడ్ 10 ఏళ్లకు పెరిగింది. నిర్వహణ సమయం పెరగడం డిస్కమ్‌లకు వ్యయంలో 2 శాతం ఆదా అవుతుంది. షిరిడీ సాయి, అదాని లాంటి పెద్ద సంస్థలు పోటీ పడటం వల్ల ఈ ప్రాజెక్టుకు సరైన ధర వచ్చింది.

ఇతర రాష్ట్రాలతో పోలికలా?.. హవ్వ!

స్మార్ట్ మీటర్ల విధానాన్ని దేశంలో మొదటిగా మన రాష్ట్రంలోనే అమలు చేస్తున్నారు. ఇంతవరకు ఎక్కడా వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు పెట్టలేదు. వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లను పట్టణ ప్రాంతాల్లోని స్మార్ట్ మీటర్ విధానంతో పోల్చడం, ధరలు ఎక్కువగా ఉన్నాయని ఆరోపణలు చేయడం 'ఈనాడు' ద్వంద్వ నీతికి నిదర్శనం. ఏదైనా ఓ వ్యవస్థను మరో సమానమైన దానితో పోల్చడానికి అవి రెండూ ఒకే వ్యవస్థలు అయి ఉండాలి కదా? ఆ మాత్రం కనీస పరిజ్ఞానం ఉండాల్సిన అవసరం లేదా? ఇక రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లకు సంబంధించి రైతులపై బిల్లులు, ట్రూఅప్ లాంటి భారమేదీ మోపట్లేదు. రక్షణ పరికరాలతో సహా మొత్తం ఉచితంగానే ప్రభుత్వం అందచేస్తోంది.

నమ్మండి.. మంచి చేస్తా

- ఆంధ్రాకు వస్తుంటే అడ్డంకులు సృష్టిస్తున్నారు
- మత్స్యకారుల భవిష్యత్తుకు మాది హామీ
- ఆదుకున్నాననే తృప్తి ఉంది
- రాత్రి 7 గంటల తర్వాత హార్బర్‌లోకి వెళ్లాలంటే భయం
- పాలన కోసం ప్యాలెస్‌లు, బంగ్లాలు అవసరం లేదు
- జనసేన అధినేత పవన్ కళ్యాణ్

మహారాణిపేట (విశాఖపట్నం): ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా ఉండేందుకే టీడీపీతో పొత్తు పెట్టుకుంటున్నట్లు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చెప్పారు. గత ఎన్నికల్లో తక్కువ ఓట్లతో ఓడిపోయామని, ఈసారి ఓట్లు చీలకుండా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. రానున్నది టీడీపీ – జనసేన సంకీర్ణ ప్రభుత్వమన్నారు. తనను నమ్మాలని, మంచి చేస్తానని, మత్స్యకారులకు మంచి భవిష్యత్తు చూపిస్తామని హామీ ఇచ్చారు. విశాఖ ఫిషింగ్ హార్బర్ అగ్ని ప్రమాద బాధిత బోట్ల యజమానులకు శుక్రవారం ఆయన నష్ట పరిహారం అందజేశారు. సుమారు 49 మంది మత్స్యకారులకు పరిహారం ప్రభుత్వ లెక్కల ప్రకారం కాకుండా నష్టపోయిన వారిని ఆదుకోవాలని నిర్ణయించినట్లు చెప్పారు. తాను ఇచ్చిన డబ్బులు చాలకున్నా ఆదుకున్నాననే తృప్తి ఉందన్నారు.



నన్ను అడ్డుకునే యత్నాలు..

విశాఖ వస్తున్న తనను అడ్డుకోవడానికి చాలా శక్తులు పని చేశాయని, ఎప్పుడు ఆంధ్రాకు వద్దామన్నా అడ్డంకులు సృష్టిస్తున్నారని పవన్ ఆరోపించారు. ప్రభుత్వం తనను చూసి భయపడుతోందన్నారు. హార్బర్ ఏ పరిస్థితిలో ఉందో రాష్ట్రం కూడా అలాగే ఉందని వ్యాఖ్యానించారు. సీఎం జేబులోంచి ఏమీ పరిహారం ఇవ్వడం లేదని, ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన డబ్బులనే మత్స్యకారులకు ఇచ్చారన్నారు. హార్బర్‌లో రాత్రి 7 గంటల తర్వాత వెళ్లాలంటే భయం వేస్తోందని, మత్స్యకారుల కోసం కేంద్రం ఇచ్చిన నిధులను ఏం చేశారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఒక్క జెట్టీ కూడా సరిగా లేదన్నారు. గుజరాత్, కేరళలో ప్రతి పది కిలో మీటర్లుకు జెట్టీ ఉందన్నారు. విలాసాల కోసం రుషికొండలో రూ.450 కోట్లు పెట్టి సీఎం జగన్ ఇల్లు కట్టుకుంటున్నారని, పాలన చేయాలంటే ప్యాలస్, బంగ్లాలు అవసరం లేదన్నారు. గాంధీ మాదిరిగా ఆశ్రమం నుంచి కూడా పాలన చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో చారిత్రక కళావేదిక పునఃప్రారంభం

- సంతోషం వ్యక్తం చేసిన సినీ నటుడు అక్కినేని నాగార్జున
- ఎందరో కళాకారులకు ప్రాణం పోసిన వేదిక మళ్లీ అందుబాటులోకి తేవడంపై హర్షం
- ఏయూలో తన సినిమా చిత్రీకరిస్తానని వెల్లడి



రంగస్థల వేదిక ప్రారంభోత్సవంలో విద్యార్థులు

ఏయూ క్యాంపస్ (విశాఖ తూర్పు): ఆంధ్ర యూనివర్సిటీలో అభివృద్ధి చేసిన చారిత్రక ఆరుబయలు రంగస్థల వేదిక-ఎస్కిన్ స్క్వేర్‌ను ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున చేతుల మీదుగా శుక్రవారం పునఃప్రారంభించారు. దాదాపు రూ.కోటి వ్యయంతో నాడు-నేడు పథకం స్ఫూర్తితో ఆధునీకరించిన యాంఫీ థియేటర్‌ను నాగార్జున ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ.. ఏయూ ప్రాంగణంలో తన తండ్రి అక్కినేని నాగేశ్వరరావు నటించిన కులగోత్రాలు చిత్రం షూటింగ్ జరిగిందన్నారు. త్వరలో తన సినిమా షూటింగ్‌ను కూడా ఇదే ప్రాంగణంలో చేస్తానని చెప్పారు. ఎందరో కళాకారులకు ప్రాణం పోసిన ఏయూ రంగస్థల వేదికను మళ్లీ తన చేతుల మీదుగా పునఃప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కళావేదిక చరిత్ర వింటుంటే అల్లూరి సీతారామరాజు గుర్తుకు వచ్చారన్నారు. తనపై ఎనలేని ప్రేమాభిమానాలు చూపించిన ఏయూ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ఏయూ హిందీ విభాగం గౌరవ ఆచార్యులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ.. అక్కినేని నాగేశ్వరరావు సంస్కారం కలిగిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆ రోజుల్లో సొంత ఇంటిని కొనుక్కోకుండా తన సంపాదనలో లక్ష రూపాయలు గుడివాడ కాలేజీకి, రూ.25 వేలు ఏయూకు విరాళంగా అందించారని గుర్తు చేశారు. ఈరోజు ఆయన వారసులు ఏయూ రంగస్థల వేదికను పునఃప్రారంభించడం సంతోషించదగ్గ విషయమన్నారు.

ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ సూచించిన విధంగా ఆర్ట్స్ కోర్సులకు పూర్వవైభవం తీసుకువస్తున్నామన్నారు. సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, నటన తదితరాలను విద్యార్థులకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన నాడు-నేడు పథకం నిధులతో విశ్వవిద్యాలయంలో చేసిన అభివృద్ధిని వివరించారు. రెండున్నర దశాబ్దాలుగా నిరుపయోగంగా మారిన ఈ ప్రాంగణాన్ని సీఎం జగన్ సహకారంతో సుందరంగా తీర్చిదిద్దామన్నారు. దీనిని నామమాత్రపు అద్దెతో కళాకారులకు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నటుడు అక్కినేని అఖిల్, నాగార్జున సోదరి సుశీల, ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాల్స్, డీన్‌లు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినీ నేపథ్య గాయకుడు ధనుంజయ్ ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి.

ఏపీలో అడ్రస్‌లేని బ్యాచ్ విషం కక్కుతోంది

- ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందితే మీకెందుకంత కడుపుమంట?
- మంత్రి సీదిరి అప్పలరాజు ఫైర్

సాక్షి ప్రతినిధి, విజయనగరం: చంద్రబాబు, లోకేశ్, రామోజీ, రాధాకృష్ణ, దత్తపుత్రుడు పవన్‌లకు అస్సలు ఆంధ్రలో అడ్రస్సేలేదని.. కానీ, వీళ్లంతా హైదరాబాద్‌లో ఉంటూ ఏపీ గురించి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మంత్రి సీదిరి అప్పలరాజు మండిపడ్డారు. ఏపీలో ఆధార్ కార్డు కూడా లేనివాళ్లే ప్రభుత్వంపై నిత్యం విషం కక్కుతున్నారని విమర్శించారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో శుక్రవారం జరిగిన సామాజిక సాధికార యాత్రకు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. ఉత్తరాంధ్రలో ఉన్న టీడీపీ నేతలకు ఇంత బానిస బతుకు అవసరమా? అని ప్రశ్నించారు. అమరావతిలోనే ప్రభుత్వ కార్యాలయాలు ఉండాలని, పరిపాలనా రాజధానిగా విశాఖ పనిచేయదని వీరు చెబుతుంటే అచ్చెన్నాయుడు వంటి టీడీపీ నేతలు వీరికి బాకాలు ఊదుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందంటే వారికెందుకంత కడుపుమంటో అర్థంకావట్లేదన్నారు.



నిజంగా చంద్రబాబు విజనరీ అయితే విశాఖ ఇప్పటికే ఐటీ క్యాపిటల్ కావాల్సిందన్నారు. రాష్ట్రంలో పెద్దఎత్తున పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయన్నారు. అలాగే, ఇన్ఫోసిస్ వచ్చిందని, అదానీ క్యాంపస్ వస్తుందని మంత్రి చెప్పారు. చంద్రబాబు మాదిరిగా తప్పుడు ఒప్పందాలు, ఎంఓయూలు చేసుకోలేదని అప్పలరాజు స్పష్టంచేశారు.

ప్యాకేజీ కోసం దిగజారుతున్న పవన్..

పవన్‌కళ్యాణ్ ఏపీ ప్రతిష్టను దిగజార్చేలా మాట్లాడటం శోచనీయమన్నారు. ప్యాకేజీ కోసం అంతలా దిగజారాలా అని ఆయన ప్రశ్నించారు. ఆంధ్రాలో టీడీపీతో, తెలంగాణలో బీజేపీతో ఆయన సంసారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. మిలీనియం టవర్స్ ప్రభుత్వ భవనమని, దాన్ని ప్రభుత్వ అవసరాలకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని వివరించారు. సీఎంఓ అనేది ఫలానా చోట ఉండాలన్న రూల్ లేదని.. సీఎం ఎక్కడుంటే అదే కార్యాలయమని చెప్పారు. డిసెంబరు మొదటివారంలోనే సీఎం జగన్ విశాఖలో ఉండబోతున్నారన్నారు.

టీడీపీ కార్యాలయంలో లైంగిక దాడి నిందితుడు

- గుంటూరులో పోలీసులపై టీడీపీ కార్యకర్తల దౌర్జన్యం

పట్నం బజారు (గుంటూరు), పెదకాకాని: ఓ దళిత యువతిని పెళ్లి పేరుతో మోసగించి లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడిగా ఉన్న టీడీపీ నేత పోలీసుల నుంచి తప్పించుకునేందుకు పార్టీ కార్యాలయంలోకి చొరబడ్డాడు. నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించిన పోలీసులపై శుక్రవారం గుంటూరులో టీడీపీ కార్యకర్తలు దాడికి తెగబడ్డారు. కానిస్టేబుళ్లను నిర్బంధించే యత్నం చేశారు. సీఐ స్థాయి అధికారి వారిస్తున్నా వినకుండా బరి తెగించి దౌర్జన్యానికి పాల్పడ్డారు. గుంటూరు జిల్లా పెదకాకాని సీఐ సురేష్‌బాబు కథనం ప్రకారం గుంటూరు స్వర్ణభారతీనగర్‌లో నివాసం ఉంటున్న టీడీపీ నేత చల్లా లక్ష్మీనారాయణ కృష్ణా జిల్లా పెనమలూరు మండలం యనమలకుదురు గ్రామానికి చెందిన ఓ దళిత యువతిని పెళ్లి పేరుతో వంచించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు నాగార్జున వర్సిటీలో చదివిన సమయంలో అక్కడ కాంట్రాక్టర్‌గా పని చేసిన లక్ష్మీనారాయణ పరిచయం పెంచుకుని శారీరకంగా లొంగదీసుకున్నాడు. అప్పటికే అతడికి వివాహం అయిందని తెలియడంతో నిలదీసిన బాధితురాలిని నగ్న వీడియోలు, ఫోటోలు చూపించి బెదిరించి పలుమార్లు అఘాయిత్యానికి ఒడిగట్టాడు. అనంతరం పెళ్లి చేసుకున్న బాధితురాలి భర్తను కూడా బెదిరించి వారి కాపురాన్ని విచ్ఛిన్నం చేశాడు. తన కుమార్తె జీవితం అన్యాయమైందనే బాధతో బాధితురాలి తండ్రి ఈ ఏడాది ఆగస్టులో గుండెపోటుతో మరణించాడు. దీంతో నిందితుడు లక్ష్మీనారాయణపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.



కానిస్టేబుల్ ఇర్ఫాన్‌పై దాడి చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

టీడీపీ కార్యాలయంలో నక్కిన నిందితుడు: సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితుడి లైవ్ లొకేషన్‌ను గుర్తించిన కానిస్టేబుళ్లు ఇర్ఫాన్, మణిప్రసాద్ అతడి కారును వెంబడిస్తూ గుంటూరు అరండల్‌పేటలోని టీడీపీ జిల్లా కార్యాలయానికి చేరుకున్నారు. పోలీసులను గుర్తించిన టీడీపీ నేతలు, కార్యకర్తలు పార్టీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ సమక్షంలోనే దాడికి యత్నించారు. తాము పోలీసులమని చెబుతున్నా వినకుండా దాడికి పాల్పడ్డారు. అనంతరం సీఐ సురేష్‌బాబు అక్కడకు చేరుకోవడంతో నిందితుడు చల్లా లక్ష్మీనారాయణ ఇక్కడ లేడంటూ బుకాయించారు. అయితే లక్ష్మీనారాయణను టీడీపీ కార్యాలయంలోనే పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో మెల్లగా జారుకున్నారు.



విచ్చలవిడిగా వాడితే విపత్తే
ప్రపంచ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన విజయవాడలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. -10లో▸



సిద్ధార్థలో 'కురుక్షేత్ర'
పీబీ సిద్ధార్థ కళాశాలలో శుక్రవారం కురుక్షేత్ర-2023 పోటీలు జరిగాయి. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. -10లో▸



విద్యార్థుల భారీ ర్యాలీ
మొగల్రాజపురం: విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు మద్దతుగా వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడలో భారీ ర్యాలీ నిర్వహించారు.

న్యూస్‌రీల్

రూరల్ టూరిజం అవార్డులకు దరఖాస్తులు
చిలకలపూడి(మచిలీపట్నం): పర్యాటక మంత్రిత్వశాఖ 2024 సంవత్సరానికి రూరల్ టూరిజానికి సంబంధించిన అవార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక, సాంస్కృతిక శాఖాధికారి ఆర్. అరుణ శుక్రవారం తెలిపారు. వారసత్వ పర్యాటకం, వ్యవసాయ పర్యాటకం, కళాఖండాలు, బాధ్యతాయుత పర్యాటకం, శక్తివంతమైన గ్రామాలు, కమ్యూనిటీ ఆధారితం, వెల్‌నెస్ రంగాలకు సంబంధించిన వారు www.rural.tourism.gov.in వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన బెస్ట్ రూరల్ టూరిజం గ్రామాలకు పురస్కారాలు అందజేస్తారన్నారు. వివరాలకు 6309942029, 8332851831లో సంప్రదించాలన్నారు.

ఉత్సాహంగా టేబుల్ టెన్నిస్ టోర్నీ
మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ మున్సిపల్ స్టేడియం ఆవరణలో 39వ ఆల్ ఇండియా పోస్టల్ టేబుల్ టెన్నిస్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. శుక్రవారం జరిగిన వెటరన్స్ సింగిల్స్‌లో ఫైనల్‌లో తెలంగాణకు చెందిన జి. రమేష్‌కుమార్‌పై హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన అలోష్ సైనీ విజయం సాధించారు. గుజరాత్‌కు చెందిన జేకే పరమార్ మూడో స్థానంలో, తమిళనాడుకు చెందిన ఎస్.స్వామినాథన్ నాలుగో స్థానంలో నిలిచారు. పురుషులు, మహిళల డబుల్స్, మిక్స్‌డ్ విభాగాల్లో శుక్రవారం క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్‌లు జరిగాయి. శనివారం కొన్ని విభాగాల్లో క్వార్టర్ ఫైనల్, మరికొన్ని విభాగాల్లో సెమీ ఫైనల్స్ పోటీలు జరుగుతాయి.

జెడ్పీ విద్యార్థినికి కాంస్య పతకం


నాగాయలంక: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 20 వరకు అన్నమయ్య జిల్లా చిట్వేలు జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో నాగాయలంక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థిని నాయుడు జ్యోతికి కాంస్య పతకం, మెరిట్ సర్టిఫికెట్ లభించింది. రాష్ట్ర స్థాయి కబడ్డీలో కాంస్య పతకం సాధించిన కృష్ణా జిల్లా జట్టుకు జ్యోతి ప్రాతినిధ్యం వహించిందని పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం వనమా రామకృష్ణ శుక్రవారం తెలిపారు. విద్యార్థిని జ్యోతిని, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు గాజుల లక్ష్మీప్రసాద్, కోసూరు పూర్ణచంద్రరావును స్కూల్ స్టాఫ్ అభినందించారు.

వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌గా కేబీఎన్


వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాల వెయిట్ లిఫ్టింగ్‌లో కేబీఎన్ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభను కనబరిచి చాంపియన్‌షిప్‌ను సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు తెలిపారు. పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం అంతర్ కళాశాల వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్ పోటీలు ఇటీవల జాకీర్‌హుసేన్ కళాశాల ఆవరణలో జరిగినట్లు పేర్కొన్నారు. అందులో తమ కళాశాల మహిళా లిఫ్టర్లు వెయిట్ లిఫ్టింగ్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్, పవర్ లిఫ్టింగ్‌లో ద్వితీయ స్థానంతో పాటు పవర్ లిఫ్టింగ్‌లో కృష్ణా వర్సిటీ స్ట్రాంగ్ మెన్ అవార్డును భరత్ కుమార్ సాధించినట్లు తెలిపారు. బెస్ట్ ఫిజిక్ పోటీలలో తమ విద్యార్థులు ఆరు గోల్డ్ మెడల్స్, ఒక సిల్వర్, బ్రాంజ్ ఒకటి సాధించారని పేర్కొన్నారు. అలాగే మహిళా విభాగంలో పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ కలిపి ఆరు గోల్డ్ మెడల్స్, రెండు సిల్వర్ మెడల్స్, నాలుగు బ్రాంజ్ మెడల్స్ సాధించి కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలో తమ కళాశాల సత్తా చాటారని వివరించారు. త్వరలో దక్షిణ, పడమర రాష్ట్రాల అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు తమ కళాశాల నుంచి ఎస్. స్వప్న, వి. రక్షిత, పి. భరత్ కుమార్ ఎంపిక అయ్యారని తెలిపారు. విద్యార్థులతో పాటు పీడీ డి. హేమచంద్రరావును కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు టి. శేషయ్య, టి. శ్రీనివాసులు అభినందించారు.

వధూవరులను ఆశీర్వదించిన కృష్ణా కలెక్టర్
చిలకలపూడి (మచిలీపట్నం): ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక కార్యదర్శి పూనం మాలకొండయ్య, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి మన్నం మాలకొండయ్యల కుమారుడి వివాహ వేడుకల్లో కలెక్టర్ రాజాబాబు పాల్గొన్నారు. పోరంకిలోని మురళీ రిస్టార్ట్స్‌లో శుక్రవారం జరిగిన వివాహ వేడుకల్లో వరుడు శ్రీధర్, వధువు అహల్యలను ఆయన ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

సమ సమాజ నిర్మాణమే లక్ష్యంగా.. ధర్మ సంస్థాపనే ధ్యేయంగా.. ఏళ్లుగా వివక్షకు గురవుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు నేనున్నానంటూ భరోసానిచ్చారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. నాలుగున్నరేళ్ల కాలంలో లెక్కకు మించిన సంక్షేమ పథకాలతో వారి అభివృద్ధికి పాటుపడ్డారు. అన్ని రంగాల్లో ఆయా వర్గాల వారికి సమప్రాధాన్యమిస్తూ సరికొత్త సామాజిక విప్లవాన్ని సృష్టించారు. దీనిని ప్రజలందరికీ మరోసారి వివరించేందుకు శుక్రవారం జగ్గయ్యపేటలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్ర ఉత్సాహంగా సాగింది. పేట ప్రభంజనమై జగనన్నకు జేజేలు పలికింది.



పోటెత్తిన పేట.. జగ్గయ్యపేటలో సామాజిక సాధికారత బస్సు యాత్రకు హాజరైన ప్రజానీకం

స్వాభిమాన సంబరం

పేటలో సామాజిక సాధికార జాతర

- బస్సు యాత్రకు కదిలొచ్చిన జనాభిమానం
- మిన్నంటిన జై జగన్ నినాదం
- ఆకట్టుకున్న ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు

జగ్గయ్యపేట/పెనుగంచిప్రోలు: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలందరి శ్రేయస్సే లక్ష్యంగా రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాధించిన అద్భుత విజయాలను ప్రజలకు వివరించేందుకే చేపట్టిన సామాజిక సాధికార యాత్ర శుక్రవారం జగ్గయ్యపేట పట్టణంలో విజయవంతమైంది. నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలతో పాటు నందిగామ ఏటిపట్టు గ్రామాల నుంచి భారీ ఎత్తున ప్రజలు తరలి రావటంతో జగ్గయ్యపేట పట్టణం జన సంద్రమైంది. యాత్ర రెండు కిలో మీటర్ల మేర జన ప్రవాహంతో ముందుకు సాగి.. సభాస్థలి బలుసుపాడు రోడ్డు వద్దకు చేరుకుంది. సామాజిక సాధికార బస్సు యాత్రలో దారి పొడవునా జై జగన్ నినాదాలు మార్మోగాయి. విజయవాడ-జగ్గయ్యపేట ప్రధాన రహదారి రెండు కిలో మీటర్ల మేర జనంతో నిండిపోయింది. మహిళలు సైతం పెద్ద ఎత్తున బస్సు యాత్ర ముందు నడుస్తూ జగనన్న పాటలకు నృత్యాలు చేశారు. యువత బైక్‌లపై జెండాలతో సందడి చేశారు. యాత్రలో రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంప్‌ల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను, ఎంపీలు నందిగం సురేష్, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, షేక్ రహంతుల్లా, ఎమ్మెల్యేలు మొండితోక జగన్‌మోహన్‌రావు, వసంత కృష్ణప్రసాద్, కొక్కిలిగడ్డ రక్షణనిధి, కొలుసు పార్థసారథి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖాదర్ భాషా, నియోజకవర్గ పరిశీలకులు నూతలపాటి హనుమయ్య, విజయవాడ వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకుల శ్రీనివాసరావు, తోట శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావు, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



సాధికార ప్రసంగం.. మాట్లాడుతున్న మంత్రి ధర్మాన, చిత్రంలో జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యేలు రక్షణనిధి, ఉదయభాను, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఆసిఫ్

హోరెత్తిన సభ..

పట్టణంలోని బలుసుపాడు సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభ నేతల ప్రసంగాలతో దద్దరిల్లింది. సెంటర్లోని మూడు రోడ్లు సైతం జనంతో కిక్కిరిశాయి. మంత్రులు ధర్మాన ప్రసాదరావు, విడదల రజని, ఎంపీ నందిగామ సురేష్ గత ప్రభుత్వ పనితీరు, నేటి జగనన్న ప్రభుత్వ తీరుపై చేసిన ప్రసంగాలు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేయటంతో పాటు ఉత్తేజ పరిచాయి. స్థానిక ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అంబేడ్కర్ ఆశయాలతో పాలన సాగిస్తూ సామాజిక న్యాయం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో సర్పంచ్ నుంచి మంత్రులు, ఎంపీల వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు గతంలో ఎన్నడూ లేనివిధంగా సమన్యాయం పాటిస్తున్నారన్నారు.



ఆద్యంతం.. ఉత్సాహం..
దాదాపు రెండు గంటల పాటు సభలో అతిథులు చేసిన ప్రసంగాలను ప్రజానీకం ఆసక్తిగా విన్నారు. అంతేకాకుండా సభాస్థలి చుట్టూ ఏర్పాటు చేసిన భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌ల వద్ద ప్రజలు ప్రసంగాలను వీక్షించారు. అదేవిధంగా డప్పు విన్యాసాలు, తీన్‌మార్, కేరళ వాయిద్యాలు, వంగపండు ఉష ప్రభుత్వ పనితీరును వివరిస్తూ సాగిన గీతాలు అందరినీ ఉత్సాహ పరిచాయి.



ధూంధాం.. పేట రహదారులపై నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రలో డప్పు కళాకారుల విన్యాసాలు

అన్ని వర్గాలకు సముచిత స్థానం


సామాజిక న్యాయం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైంది. కుబేరులను కింద కూర్చోబెట్టి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను సముచిత స్థానం కల్పిస్తున్నారు. పేదలకు ఒక రకం, ధనికులకు ఒక రకంగా గత ప్రభుత్వాల పాలనలో ఉండేది. నేడు పేదలకు అగ్రతాంబూలం అందిస్తున్నారు.

– కొలుసు పార్థసారథి, పెనమలూరు ఎమ్మెల్యే

మైనార్టీలకు లబ్ధి..


జగనన్న పాలనలో మైనార్టీలకు అన్ని రకాలుగా లబ్ధి చేకూరుతోంది. హజ్ యాత్రకు రూ.15 కోట్లు సాయం అందించిన ముఖ్యమంత్రి జగనన్న. మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్ లాగా భావించి ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నారు. చంద్రబాబు తాను ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారు.

– ఖాదర్ బాషా, వక్ఫ్‌బోర్డు చైర్మన్

సాధికారత జగనన్న వల్లే సాధ్యం


స్వాతంత్య్రం వచ్చాక ఒక పార్టీ ఒక సామాజిక వర్గానికి, ఒక పార్టీ మరొక సామాజిక వర్గానికి చెంది ఉండేదని, జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆ పరిస్థితి లేదు. డబ్బున్న వారికే పరిమితమైన ఉన్నత విద్య, వైద్యం నేడు అందరికీ అందుతోంది. మన ప్రభుత్వంలో 60 శాతం పథకాలు బడుగు, బలహీన వర్గాల వారికే అందుతున్నాయి.

– మొండితోక జగన్‌మోహనరావు, నందిగామ ఎమ్మెల్యే



జై జగనన్నా.. సభా ప్రాంగణంలో మహిళలు, యువతులు కేరింతలు

ప్రణాళిక ప్రకారం పేదరిక నిర్మూలన

అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

ఎదురుమొండి(నాగాయలంక): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న అనేక భూ సమస్యలకు పరిష్కారం చూపించిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని అవనిగడ్డ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండలంలోని ఎదురుమొండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం భూసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా లంక భూములకు సంబంధించిన 539మంది లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు. వీటిలో అసైన్డ్ పట్టాలు 205, లంకభూముల లీజు పట్టాలు 102, ఆర్డినెన్స్9 సంబంధిత పట్టాలు 232 ఉన్నాయి. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ వంటి నిరుపేద వర్గాల జీవన ప్రమాణం పెరుగుదల, ఆర్థిక ప్రగతి మెరుగుదలకై సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నారని చెప్పారు. కేవలం అగ్రవర్ణాల పెత్తందారీతనానికి మేలు చేసే చంద్రబాబు కంటే నిరంతరం నిరుపేదలకు బాసటగా నిలిచే జగనన్నే మరోసారి అధికారంలోకి వస్తే మరింతగా మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ, అభివృద్ధి పనులు అమలు తీరును ఆయన వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, మండల తహసీల్దార్ జె.విమలకుమారి పాల్గొన్నారు.



పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

రమణీయం.. రథోత్సవం



పంచ వాయిద్యాలతో కళాకారుల విన్యాసాలు(ఇన్‌సెట్లో) ఉత్సవమూర్తులు



మేళతాళాల మధ్య ఊరేగిన రుక్మిణీ సమేత పాండురంగ స్వామి

మచిలీపట్నంటౌన్: చిలకలపూడి పాండురంగస్వామి ఉత్సవాల్లో భాగంగా కార్తిక శుద్ధ ఏకాదశి శుక్రవారం స్వామివారి రథోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయంలో ఉన్న రుక్మిణీ సమేత పాండురంగ స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగించారు. ఊరేగింపు ఆలయం నుంచి కలెక్టర్ బంగ్లా, కోనేరుసెంటర్ మీదుగా బస్టాండ్ సెంటర్, జిల్లా కోర్టు సెంటర్, జిల్లా పరిషత్ సెంటర్ల మీదుగా ఆలయానికి తెల్లవారుజామున చేరింది. ఇళ్ల నుంచి బయటకు వచ్చిన భక్తులు స్వామివారికి హారతులు, నైవేద్యం సమర్పించారు. బేతాళ నృత్యాలు, తీన్‌మార్ డప్పులు, డోలు సన్నాయి వాయిద్యాల నడుమ వైభవంగా రథోత్సవం ముందుకు సాగింది. కాంతార వేషధారణతో కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆలయ వంశ పారంపర్య నిర్వాహకుడు టీకి నరసింహం పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రథోత్సవంలో నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా పాల్గొన్నారు.

ఉత్పత్తి ఉరకలెత్తేలా..

విజయవాడలో విస్తరిస్తున్న కాస్టింగ్ పరిశ్రమ

- వన్‌టౌన్, ఆటోనగర్‌లలో మొత్తం 14 పరిశ్రమలు
- సుమారు 300 మందికి పైగా ఉపాధి
- ఇతర ప్రాంతాల నుంచి క్యూ కడుతున్న కొనుగోలుదారులు




విజయవాడలోని ఓ కాస్టింగ్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): చిన్న, మధ్య తరహా పరిశ్రమలు వేగంగా విస్తరిస్తున్నాయి. పరిస్థితులు అనుకూలించడం, ప్రభుత్వం ప్రోత్సాహం తోడవడంతో లాభాల బాటలో పయనిస్తున్నాయి. ఇదే క్రమంలో కరోనా సమయంలో కుదేలైనా ఐరల్ కాస్టింగ్ పరిశ్రమ నెమ్మదిగా పుంజుకుంది. విజయవాడ కేంద్రంగా పనిచేస్తున్న ఈ పరిశ్రమల్లో తయారయ్యే వివిధ యంత్రాల విడి భాగాలకు రెండు తెలుగు రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఏర్పడుతోంది.

పలు రాష్ట్రాల నుంచి..

ఇక్కడ తయారు చేసిన స్పేర్ పార్ట్స్‌ను వివిధ మిషన్‌లకు వాడుతుంటారు. ఇందులో భాగంగా ప్రధానంగా కాంక్రీట్ మిల్లర్స్, వరికోత యంత్రాలు, ఫెర్టిలైజర్ మిషన్‌లు, అల్యూమినియం మిషన్లు, గ్రానైట్, పాలిష్‌మిషన్‌లతో పాటు గేర్ బాక్సుల వంటి వాటికి ఇక్కడ తయారు చేసిన విడి భాగాలు వాడుతుంటారు. వీటి కోసం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కొనుగోలుదారులు వస్తున్నారు. మన రాష్ట్రంలోని రాజమహేంద్రవరం, కాకినాడ, నెల్లూరు, తిరుపతి, ఒంగోలు, మచిలీపట్నం గుంటూరు, సూర్యాపేటల నుంచి అధికంగా వీటి కోసం వస్తుంటారు.



తేమ లేకుండా గ్యాస్‌తో వేడి చేస్తున్న దృశ్యం

కరోనాతో కుదేలై..

ఈ పరిశ్రమ కరోనా మహమ్మారి ప్రభావంతో కుదేలైంది. ముడి సరుకు ధర కూడా పెరగడంతో కోలుకోలేకపోయింది. అయితే ఆ తర్వాత నెమ్మదిగా పుంజుకుంది. ఇప్పుడు ముడి సరుకు రేటు కూడా తగ్గడంతో పరిశ్రమ లాభాల బాటలో పయనిస్తోంది.

ఆశాజనకంగా ఉంది..

కరోనా తర్వాత వ్యాపారం ఆశాజనకంగా ఉంది. తెలంగాణతో పాటు మన రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన వారు ఈ వస్తువులను కొనుగోలు చేస్తుంటారు. కార్మికులకు మంచిగా ఉపాధి దొరుకుతోంది.

– దానియేలు, శాంసన్, కాస్టింగ్ యజమాని

పరిశ్రమ విస్తరిస్తోంది..



కరిగించిన ఇనుమును పోస్తున్న కార్మికులు

విజయవాడలోని కాస్టింగ్ పరిశ్రమలు విస్తరిస్తున్నాయి. ప్రస్తుతం ఇక్కడ మొత్తం 14 పరిశ్రమలు ఉన్నాయి. వన్‌టౌన్, ఆటోనగర్, కొత్త ఆటోనగర్‌లో ఇవి ఉన్నాయి. ఇందులో సుమారు 300 మందికి పైగా కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఇక్కడ పలు యంత్రాల స్పేర్ పార్ట్స్ తయారవుతాయి. గతంలో వీటి ధర తక్కువ ఉన్నప్పటికీ ఇప్పుడు వీటి ధర ఆశాజనకంగా ఉండటం వల్ల కాస్త లాభాలు వస్తున్నట్లు ఈ పరిశ్రమల యజమానులు చెబుతున్నారు. కాస్టింగ్ అవసరమైన ముడిసరుకు (ఐరన్) రేటు నిలకడగా ఉండటం వల్ల వ్యాపారం ఆశాజనకంగా ఉందని చెబుతున్నారు.

రేపు ఇంద్రకీలాద్రిపై కోటి దీపోత్సవం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం కోటి దీపోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఆదివారం సాయంత్రం ఆది దంపతులకు పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలో కోటి దీపోత్సవాన్ని నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఆలయ అధికారులు చేస్తున్నారు. రాజగోపురం ఎదుట లక్ష ఒత్తులతో ఏర్పాటు చేసే దీపాన్ని ఆలయ అధికారులు వెలిగించడం ద్వారా దీపోత్సవాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. కోటి దీపోత్సవం అనంతరం స్వామి వారి ఆలయం వద్ద జ్వాలా తోరణం వెలిగిస్తారు. కోటి దీపోత్సవానికి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో దేవస్థానం మరిన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

27న గిరిప్రదక్షిణ..

దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులతో ప్రతి నెలా పౌర్ణమి రోజున నిర్వహించే గిరిప్రదక్షిణ సోమవారం 27వ తేదీ ఉదయం నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 5.55 గంటలకు ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుంది.

క్లుప్తంగా

నేడు ఎయిర్‌పోర్ట్‌కు ప్రియాంక గాంధీ

గన్నవరం: తెలంగాణ ఎన్నికల ప్రచారం నిమిత్తం కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ శనివారం గన్నవరం విమానాశ్రయానికి విచ్చేయనున్నారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో ముందస్తు భద్రత ఏర్పాట్లను శుక్రవారం అధికారులు పరిశీలించారు. జిల్లా అదనపు పోలీసు అధికారి ఎస్వీడీ. ప్రసాద్, ఐఎస్‌డబ్ల్యూ డీఎస్పీ కె. రాంబాబు, సీఆర్పీఎఫ్ ఏసీ రూపేంద్రసింగ్ భద్రత ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. సీఐఎస్ఎఫ్ డీఎస్పీ కేవీ రత్నం, విమానాశ్రయ డైరెక్టర్ ఎంఎల్‌కె. రెడ్డి, ఎస్పీఎఫ్ ఏసీ ఎంకేవీఎన్. రెడ్డి, తహసీల్దారు నరసింహారావు, సీఐ కనకరావు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల్లో వలంటీర్ పోస్టుల భర్తీకి కలెక్టర్ పి.రాజాబాబు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు వెబ్‌సైట్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని 155 వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. సచివాలయాల పరిధిలో వలంటీర్ ఖాళీలు గతంలో కేటాయించిన రిజర్వేషన్ కేటగిరీ ప్రకారమే ఖాళీలు భర్తీ చేస్తారని పేర్కొన్నారు. ఈ నెల 25 నుంచి డిసెంబరు 1వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపు ఏపీ టీ-20 క్రికెట్ జట్టు ఎంపిక

తెనాలి: ఏపీ టీ20 క్రికెట్ జట్టు ఎంపిక ఈనెల 26న స్థానిక రామలింగేశ్వరపేటలోని యువ క్రికెట్ అకాడమీలో జరగనుంది. ఎంపికైన జట్టు గోవాలో వచ్చే నెల 8–12 తేదీల్లో జరగనున్న టీ20 క్రికెట్ నేషనల్ క్యాష్ ప్రైజ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటుందని ఏపీ యూత్ టీ20 క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.భాస్కర్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు వైట్ అండ్ వైట్ డ్రెస్, షూస్, క్రికెట్ కిట్‌తో సహా ఆరోజు ఉదయం 8 గంటలకు హాజరుకావాలని కోరారు. సెలక్షన్ కమిటీ సభ్యులు ఎన్‌బీ కిశోర్‌చౌదరి, సీహెచ్ శ్రీనివాస రెడ్డి, ఎస్.అచ్యుత కుమార్, ఎ.నరేంద్ర జట్టు ఎంపికను నిర్వహిస్తారు.

జగనన్న ప్రభుత్వంలో సామాజిక న్యాయం

- మేనిఫెస్టోలో హామీలన్నీ అమలు
- జగ్గయ్యపేటలో వైఎస్సార్ సీపీ నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, చిత్రంలో రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: జగనన్న ప్రభుత్వంలోనే సామాజిక న్యాయం జరిగిందని, మేనిఫెస్టోలోని హామీలను వందశాతం అమలుచేశారని వైఎస్సార్ సీపీ నేతలు చెప్పారు. పట్టణంలో శుక్రవారం చేపట్టిన సామాజిక సాధికార యాత్ర సందర్భంగా ఎస్‌జీఎస్ కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. తొలుత రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే ఏం చేయబోతున్నారో జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో తెలిపారన్నారు. దాన్ని నమ్మిన ప్రజలు భారీ మెజార్టీతో అక్కడ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఇక్కడ సామినేని ఉదయభానును గెలిపించారని చెప్పారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్ని రంగాల్లో 70 శాతం ప్రాధాన్యం కల్పించి సామాజికంగా న్యాయం చేశారని తెలిపారు. వారి అభివృద్ధి, సంక్షేమానికి రూ 1.76 లక్షల కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. పేట నియోజవర్గంలో ఎమ్మెల్యే ఉదయభాను ఆధ్వర్యాన రూ. 1000 కోట్లు సంక్షేమానికి ఖర్చు చేసినట్లు తెలిపారు.

ఉన్నతస్థానంలో బడుగు, బలహీన వర్గాలు

ఎమ్మెల్సీ, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమం, అభివృద్ధిని అందించి వారిని ఉన్నత స్థానంలో నిలిపారన్నారు. సామాజిక సాధికారయాత్ర పేదల కోసంగానీ పెత్తందార్లకు కాదని, అన్నివర్గాలకూ సామాజికంగా అందిస్తున్న న్యాయాన్ని వివరించడం కోసమేనన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను నూటికి నూరుపాళ్లు అమలుచేసింది జగనన్నే

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే ఆశయాలను నూటికి నూరు పాళ్లు అమలుచేసి చూపించింది ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు.

ఎన్నికలకు ముందే రాష్ట్రంలో వెనుకబాటుకు గురై వెలుగు చూడని బీసీ కులాలు ఎన్ని ఉన్నాయో గుర్తించి వారి అభ్యున్నతికి 156 కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం చరిత్రాత్మకమని తెలిపారు. అలాగే మైనార్టీల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు ఇవి ప్రజలకు తెలియజేయడమే ఈ యాత్ర ఉద్దేశమని ఆయన తెలిపారు.

యాంటీబయోటిక్స్ విచ్చలవిడిగా వాడితే విపత్తే

- వైద్యుల సూచనపై వాడాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు
- యాంటి మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై అవగాహన



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, డాక్టర్ సుహాసిని, డాక్టర్ వెంకటేష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): అవగాహన లేకుండా విచ్చలవిడిగా యాంటీబయోటిక్స్ వాడితే పెను విపత్తుకు దారితీస్తాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. ప్రపంచ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. పాత ప్రభుత్వాస్పత్రి వద్ద జరిగిన కార్యక్రమాన్ని కలెక్టర్ ఢిల్లీరావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్యాక్టీరియా, వైరస్, శిలీంద్రాల వంటి వ్యాధికారక సూక్ష్మజీవులపై పోరాడే యాంటీబయోటిక్స్ మందుల ఆవిష్కరణ వెనుక శాస్త్రవేత్తల కృషి ఎంతో ఉంటుందన్నారు. ఈ మందుల వినియోగంలో చేసే తప్పులే వాటి సామర్థ్యాన్ని తగ్గించేస్తున్నాయని పేర్కొన్నారు. వేర్వేరు వ్యాధులు, ఇన్‌ఫెక్షన్ల నుంచి మనుషులు, జంతువులు, మొక్కలను కాపాడే మందులను విచక్షణ రహితంగా వాడి దుర్వినియోగం చేయడంతో ఆ మందులకు సూక్ష్మ క్రిములు లొంగకుండా మొండికేసే నిరోధక సామర్థ్యాన్ని పెంచుకుంటాయన్నారు. ఇలాంటి అనర్థాలపై ప్రజలకు అవగాహన కలిగించడానికి ఏటా ప్రపంచ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రిస్కిప్షన్ లేకుండా యాంటిబయోటిక్స్ షాపుల్లో ఇవ్వకూడదన్నారు. ఈ సందర్భంగా నీ భద్రతే నీ జీవితానికి నేస్తం, అది లేకుంటే జీవితం అస్తవ్యస్తం, మితిమీరి మందులు వాడొద్దు, ఆరోగ్యాన్ని నాశనం చేసుకోవద్దు అనే ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్, డీసీహెచ్ఎస్ డాక్టర్ బీసీకే నాయక్, స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ మోహన్‌కృష్ణ, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇందుమతి, డీఐఓ డాక్టర్ అమృత, డాక్టర్ మోతీబాబు తదితరులు పాల్గొన్నారు.

పథకాల లబ్ధితో లక్ష్యాలు నెరవేరుతాయి

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా పర్యవేక్షకులు మోనాలిసా దాష్



మోనాలిసాదాష్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు ప్రతి ఒక్కరికీ అందినప్పుడే వాటి లక్ష్యాలు నెరవేరుతాయని వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా పర్యవేక్షకులు, ఐఏఎస్ అధికారి మోనాలిసా దాష్ అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం సంకల్పయాత్ర సన్నద్ధతపై కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, జెడ్పీ సీఈవో జ్యోతిబసు తదితరులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దాష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన యాత్ర ఈ నెల 26 నుంచి ప్రారంభమవుతుందన్నారు. జిల్లాలో ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ (ఐఈసీ) వాహనాలు మొత్తం కీలకపాత్ర పోషించనున్నట్లు తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్ విధానం భేష్

ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా, దేశంలో ఎక్కడాలేని విధంగా అమలుచేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం గొప్పదని మోనాలిసా దాష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని వివరించాల్సిందిగా కోరగా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు రాష్ట్రంలో విజయవంతంగా అమలవుతున్న ఫ్యామిలీ డాక్టర్ విధానంతో పాటు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు, జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు తదితరాలను ఆమెకు వివరించారు.

ప్రత్యేక కమిటీలు

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడానికి జిల్లాస్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, జేసీ వైస్ చైర్మన్‌గా వివిధ శాఖల అధికారులతో కమిటీని ఏర్పాటుచేసినట్లు కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. గ్రామస్థాయిలో సర్పంచ్ చైర్మన్‌గా 16 మంది సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉత్సవ, స్వాగత, కల్చరల్ కమిటీల ఏర్పాటు జరిగినట్లు తెలిపారు. ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో నోడల్ అధికారులుగా బాధ్యతలు నిర్వర్తిస్తారన్నారు. పర్యవేక్షకులు మోనాలిసా దాష్‌ను కలెక్టర్ ఢిల్లీరావు అధికారులతో కలిసి సత్కరించారు. సమావేశంలో డీపీవో జయచంద్ర గాంధీ, డీఈవో సీవీ రేణుక, డీఏవో ఎస్.నాగమణెమ్మ, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ అధికారి ఎం.రుక్మాంగదయ్య, ఎల్‌డీఎం కె.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు చెప్పారు. బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు కురుక్షేత్ర–2023 పేరుతో పీబీ సిద్ధార్థ కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యాన శుక్రవారం సిద్ధార్థ ఆడిటోరియంలో పోటీలు జరిగాయి. భాస్కరరావు జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. విద్యార్థులు చదువు తర్వాత కంపెనీలు స్థాపించి మరికొంతమందికి ఉపాధి కల్పించవచ్చన్నారు. కళాశాల డీన్ ప్రొఫెసర్ రాజేష్ సీ. జంపాల మాట్లాడుతూ విదేశీయులు సైతం మనదేశానికి వచ్చి సంస్థలు నెలకొల్పుతున్నారని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు కొత్త అంశాలు తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ ఎండీఎస్ రెహమాన్ మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 40 కళాశాలల నుంచి 800 మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు.

ఉత్సాహంగా సాగిన పోటీలు

సభ అనంతరం నిర్వహించిన వివిధ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బిజినెస్ క్విజ్, యంగ్ మేనేజర్, స్టాక్ గేమ్, హెచ్ఆర్ ఈవెంట్, స్టార్టప్ బిజినెస్ ఐడియా, మార్కెట్ మేకర్స్, మిస్టర్ అండ్ మిస్ కురుక్షేత్ర వంటి విభాగాల్లో విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించారు. మిస్టర్ అండ్ మిస్ కార్యక్రమంలో విద్యార్థులు ర్యాంప్ వాక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నర్తనశాల పేరుతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. విజేతలకు బహుమతులను అందజేశారు.

బీసీలను గుండెల్లో పెట్టుకున్న జగన్

ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మారేష్

పటమట(విజయవాడతూర్పు): బీసీలకు వ్యతిరేకమని టీడీపీ మరోమారు నిరూపించుకుందని, కుల గణనను వ్యతిరేకించడం ద్వారా రుజువైందని, బీసీలను జగన్‌మోహన్‌రెడ్డి గుండెల్లో పెట్టుకున్నారని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మారేష్ అన్నారు. విజయవాడ పటమటలోని సంస్థ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ మాజీ మంత్రి కొల్లు రవీంద్ర రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, బీసీల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఆయన్ను విమర్శించే స్థాయి కొల్లు రవీంద్రకు లేదన్నారు. చంద్రబాబునాయుడు డైరెక్షన్లో కృష్ణయ్యను విమర్శించడం అర్థరహితమని తెలిపారు. చంద్రబాబు నాయుడు ముమ్మాటికి బీసీలు వ్యతిరేకమని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీసీల పక్షపాతిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల గణన ప్రక్రియ చేపడితే టీడీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని బీసీలు శాశ్వతంగా దూరమవుతున్నారనే దుగ్ధతతో చౌకబారు విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. టీడీపీలోని బీసీ నాయకులు చంద్రబాబునాయుడుని నిలదీయాలని, బీసీలకు రాజ్యసభ సీట్లు ఎందుకు కేటాయించలేదని నామినేటెడ్ పదవుల్లో 65% ఎందుకు వాటా ఇవ్వలేదని.. కులాలకు సంబంధించిన కార్పొరేషన్లు ఎందుకు ఏర్పాటు చేయలేదని గట్టిగా ప్రశ్నించాలన్నారు.

కర్నాటి రాంబాబుపై కాటి కాపరి దాడి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబుపై వాంబేకాలనీలోని హిందూ శ్మశాన వాటిక కాటికాపరి దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. సింగ్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాంబాబు తండ్రి బాబూరావు ఈ నెల 13న మరణించారు. ఈ నేపథ్యంలో రాంబాబు తన తండ్రికి అంత్యక్రియలు చేసిన వాంబేకాలనీ హిందూ శ్మశాన వాటికకు ప్రతి రోజూ వెళ్తూ దీపం వెలిగించి వస్తున్నారు. శుక్రవారం కూడా దీపం వెలిగిస్తున్న రాంబాబును అక్కడే మద్యం మత్తులో ఉన్న కాటికాపరి గుంజ కృష్ణ తనకు డబ్బులు ఇవ్వాలని లేకపోతే లోపలికి రావొద్దంటూ అడ్డుకున్నాడు. దీపం పెట్టి వచ్చి ఇస్తానంటున్నా వేధింపులకు గురిచేశాడు. రాంబాబు కుటుంబ సభ్యులు కృష్ణకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నప్పటికి వినకుండా దీపం వెలిగిస్తున్న రాంబాబుపై ఆ పక్కనే ఉన్న గాజుసీసాను తీసుకొని దాడికి పాల్పడ్డాడు. గాయమై రక్తమోడుతున్న రాంబాబును కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. కృష్ణకు దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారు. కాటికాపరి కృష్ణ ఆగడాలపై పలుమార్లు కార్పొరేషన్ అధికారులకు ఇలాంటి ఫిర్యాదులొస్తున్నా పట్టించుకోవడం లేదని, తగు చర్యలు తీసుకొని హిందూ శ్మశాన వాటిక రక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిందితుడి అరెస్ట్

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హిందూ శ్మశాన వాటికలో దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబుపై హత్యాయత్నం చేసిన నిందితుడిని అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు అరెస్టు చేసినట్లు నార్త్ జోన్ ఏసీపీ సీహెచ్ రవికాంత్ తెలిపారు. సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

ఇటీవల దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు తండ్రి మృతిచెందటంతో వాంబేకాలనీలోని హిందూ స్మశాన వాటికలో అంతిమ కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం అక్కడకు వచ్చిన రాంబాబుపై డబ్బు విషయమై కాటికాపరి కృష్ణ దాడి చేయగా అతడిని పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. కృష్ణను బంధువులు అడ్డుకునే ప్రయత్నంలో కిందపడి తలకు గాయం అవ్వడంతో పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.

అంతర కళాశాలల మహిళా వాలీబాల్ పోటీలు ప్రారంభం

తెనాలి: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల మహిళా వాలీబాల్ పోటీలు శుక్రవారం స్థానిక జేఎంజే మహిళా కాలేజీలో ఆరంభమయ్యాయి. రెండు రోజులు జరిగే ఈ పోటీల్ని యూనివర్సిటీ ఎడ్యుకేషన్ డీన్ అండ్ డైరెక్టర్ ప్రొఫెసర్ జాన్సన్ ప్రారంభించారు. క్రీడలతో కలిగే ప్రయోజనాల్ని ఆయన వివరించారు. ప్రతిభ చూపినవారికి క్రీడా కోటాలో ఉద్యోగ అవకాశాలు కూడా ఉంటాయని చెప్పారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు. యూనివర్సిటీ పరిశీలకుడు డాక్టర్ ధనుంజయరావు, కాలేజీ కరస్పాండెంట్ థెరెసమ్మ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మేరీ శారద, సిస్టర్ అముల్ మేరి పాల్గొన్నారు. ఈ పోటీల్లో గుంటూరు, ఒంగోలు, చౌడవరం, గోరంట్ల, జేఎంజే మహిళా కాలేజీ, ముప్పాళ్ల, యూనివర్సిటీ కాలేజీల మహిళా జట్లు పాల్గొంటున్నాయని జేఎంజే వ్యాయామ అధ్యాపకురాలు కె.అరుణ సుజాత తెలిపారు. శ్రావ్య, మేఘన స్వాగతం పలికారు.

యువతి ఆత్మహత్య

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): క్షణికావేశంలో యువతి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపేట పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై యువతి తండ్రి ఫిర్యాదుపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. కలరా హాస్పటల్ సమీపంలోని కాశీపతి వారి వీధిలో షేక్ ఖాజామొహిద్దీన్, రహేమున్నీసా కుటుంబం నివసి స్తోంది. వీరికుమార్తె నజియా సుల్తానా(20) ఇంటి వద్దే ఉంటుంది. రహేమున్నీసాకు 16 ఏళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. ఆమెకు కుమార్తె నజియా సుల్తానా సపర్యలు చేస్తుంటుంది. గురువారం ఖాజామొహిద్దీన్ మసీదుకు వెళ్లాడు. పని చూసుకుని రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి తిరిగి వచ్చాడు. అతనికి భార్య మంచం పక్కనే హాల్‌కు కుమార్తె నజియా సుల్తానా చున్నీతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. వెంటనే 108కి సమాచారం అందించారు. ఆ సిబ్బంది నజియాను పరీక్షించి మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఖాజా తన భార్యను ఏం జరిగిందని అడగగా.. నజియా ఉదయం లేచినప్పటి నుంచి ఫోన్ చూస్తూ ఉందని, వంట కూడా చేయకపోవడంతో మందలించానని చెప్పింది. తన కుమార్తె క్షణికావేశంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. వారు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు పరిష్కరిస్తున్నాం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఓటర్ల నుంచి అందిన అభ్యంతరాలు, ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తున్నామని, లోపాల్లేని తుది ఓటర్ల జాబితా రూపొందించడానికి చర్యలు తీసుకుంటున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. సంక్షిప్త ఓటర్ల జాబితాపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్‌మీనా నగరంలోని ఆయన ప్రధాన కార్యాలయం నుంచి శుక్రవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తూ అభ్యంతరాలు, క్లయిమ్స్ పరిష్కరిస్తున్నామన్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా 71,827 దరఖాస్తులు వచ్చాయని వాటిని క్షేత్రస్థాయిలో విచారణ చేసి అంగీకరించిన 27,933 దరఖాస్తులను ఈరోల్ లో అప్‌డేట్ చేశామన్నారు. పెండింగ్‌లో ఉన్న 36,285 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి వివిధ కార్యకలాపాలను పర్యవేక్షించడానికి వీలుగా నోడల్ అధికారుల నియామకం పూర్తి చేశామని కలెక్టర్ వివరించారు. వీసీలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి. సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండర్క్, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, నియోజకవర్గ ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో మూడు సోలార్ విద్యుత్ ప్లాంట్లు

మంగళగిరి: నగరం సోలార్ సొబగులు అద్దుకోనుంది. ఎన్‌రెడ్‌క్యాప్ సహకారంతో మూడు సోలార్ విద్యుత్ ప్లాంట్లును ఏర్పాటు చేసి నగరపాలక సంస్థకు విద్యుత్ చార్జీల భారం తగ్గించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. రూ.110 కోట్లతో 17 మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తి లక్ష్యంగా అధికారులు డీపీఆర్ సిద్ధం చేశారు. సోలార్ ప్లాంట్లు అందుబాటులోకి వస్తే నగరపాలక సంస్థ నెలకు సుమారు రూ.40లక్షల మేర విద్యుత్ ఛార్జీల భారం తగ్గనున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఎన్‌రెడ్‌క్యాప్ పీడీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎంటీఎంసీ పరిధిలో సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు కోసం రూ 110 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేశామని, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సూచనలతో నగరంలోని ఆత్మకూరు, కాజ, స్విమ్మింగ్‌పూల్ ప్రాంతాలను పరిశీలించి సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు.

సమగ్రాభివృద్ధికి కృషి

గుంటూరు రూరల్: దేశ సమగ్రాభివృద్ధికి సమష్టిగా అందరం కృషి చేద్దామని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. రూరల్ మండలం లాలుపురం గ్రామంలోని ఏఎస్ఆర్ కన్వెన్షన్‌లో శుక్రవారం 'వికసిత్ భారత్–సంకల్ప యాత్ర ప్రారంభోత్సవం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. గవర్నర్‌కు జిల్లా అధికారులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పుష్పగుచ్చాలను అందించి సాదర స్వాగతం పలికారు. ముందుగా కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఆయుష్మాన్ భారత్, జలజీవన్ మిషన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల్ కానుక, పోషణ్ అభియాన్, దీన్‌దయాళ్ అంత్యోదయ, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, జన్‌ధన్ యోజన, నానో ఎరువులు, జీవన్‌జ్యోతి బీమా, ఏకలవ్య ఆదర్శ పాఠశాలలు, అటల్ పెన్షన్ తదితర పథకాల స్టాళ్లను గవర్నర్ సందర్శించారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ సందేశంతో పాటు ఏపీ అభివృద్ధిపై ప్రదర్శించిన లఘు చిత్రాన్ని గవర్నర్ ప్రజలు, ప్రజాప్రతినిధులతో కలిసి తిలకించారు. భారత్ వికసిత్ సంకల్ప యాత్ర ప్రతిజ్ఞ చేశారు. మన సంకల్ప్, వికసిత్ భారత్ పుస్తకాలు, క్యాలెండర్లను గవర్నర్ ఆవిష్కరించారు.



సంక్షేమ పథకాల క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, ఎంపీ అయోధ్యరామిరెడ్డి

విశిష్ట వ్యక్తులకు అవార్డులు

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరుగుతున్న ఈ ప్రచార కార్యక్రమంలో అధికారులందరూ భాగస్వాములు కావాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ వివరించాలన్నారు. కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులు తమ మనోగతాన్ని ఆవిష్కరించారు. అనంతరం పలు రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి గవర్నర్ ప్రత్యేక అవార్డులు అందజేశారు.

ప్రతిరోజూ రెండు గ్రామాల్లో యాత్ర

ఏపీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్ మాట్లాడుతూ ప్రతి రోజూ రెండు గ్రామాల్లో ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వాహనాలు యాత్ర సాగిస్తాయని వెల్లడించారు. ప్రతి గ్రామం, మండలం, జిల్లాలో ప్రతి ఒక్కరూ అర్హత ఉంటే పథకం పొందాలన్నారు. స్టేట్ నోడల్ ఆఫీసర్ పీయూష్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడం కార్యక్రమం ముఖ్య లక్ష్యమన్నారు. జనవరి 26వ తేదీ వరకూ ఈ యజ్ఞం సాగుతోందని చెప్పారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌తోపాటు 250 గ్రామాల్లో 60 రోజులపాటు కొనసాగుతోందని వివరించారు.

క్లుప్తంగా

26న సంగీత విద్వాంసుడు దక్షిణామూర్తికి గురు సత్కారం

విజయవాడ కల్చరల్: జేఎమ్ఎస్ నాట్యవేద ఆధ్వర్యంలో 26 వ తేదీ దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో ప్రముఖ వయోలిన్ విద్వాంసుడు పాణ్యం దక్షిణామూర్తికి గురు సత్కార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు జంగం చక్రవర్తి, జంగం విజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాలకు చెందిన గోళ్ళ నారాయణరావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ వెన్నా వల్లభరావు పాల్గొంటారని పేర్కొన్నారు. నాట్య వేద విద్యార్థులచే అన్నమయ్య సంకీర్తనా స్రవంతి కార్యక్రమం జరుగుతుందన్నారు.

మహాధర్నా కరపత్రం ఆవిష్కరణ



కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్రంలోని బీజేపీ మోడీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలకు నిరసనగా ఈ నెల 27, 28 తేదీల్లో జింఖానా గ్రౌండ్‌లో జరిగే కార్మిక రైతు మహాధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ సిటీ అధ్యక్ష కార్యదర్శులు కె.దుర్గారావు, ఎం.వి సుధాకర్ పిలుపునిచ్చారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో మహాధర్నాకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ విధానాల వలన కార్మికులు, ఉద్యోగులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజానీకం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ధర్నాకు నగర ప్రజానీకం మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.సీతారాములు, వై.సుబ్బారావు, ఎం.బాబురావు, టి.తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం అత్యున్నతమైనది



పటమట(విజయవాడతూర్పు): భారత రాజ్యాంగం అత్యుత్తమమైనదని మద్రాస్ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ రిటైర్డ్ విభాగాధిపతి ప్రొఫెసర్ కోటేశ్వరప్రసాద్ అన్నారు. నగరంలోని స్టెల్లా కళాశాల పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ రాజ్యాంగం రూపకల్పన దినోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ యువతకు ప్రజాస్వామ్య వ్యవస్థ, రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండటం చాలా అవసరమని తెలిపారు. రాజ్యాంగం భారత పౌరులకు పాలించే అధికారం కల్పించిందని పేర్కొన్నారు. ప్రతి ఒక్క పౌరునికి భావ ప్రకటన, ఆలోచన, విశ్వాసం, మతం, ఆరాధన, స్వేచ్ఛను రాజ్యాంగం కల్పించిందన్నారు. అనంతరం ఆయన్ను కళాశాల యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రేఖ, కళాశాల సుపీరియర్ సహాయ మేరీ, డిగ్రీ వైస్ ప్రిన్సిపల్ ఉషా కుమారి, ఇంటర్ వైస్ ప్రిన్సిపల్ రామకృష్ణ, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి ప్రసాద రావు, అధ్యాపకులు మృదులశ్రీ, శరత్ చంద్ర, అధ్యాపకులు పాల్గొన్నారు.

కరువు మండలాలను పునఃప్రకటన చేయాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): వాస్తవ కరువు పరిస్థితులను గుర్తించి కరువు మండలాలను పునఃప్రకటన చేయాలని, సహాయక చర్యలు వెంటనే ప్రారంభించాలని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. కరువు పరిస్థితిపై ఆందోళనల్లో భాగంగా డిసెంబర్ 5వ తేదీన మండల కేంద్రాల్లో ధర్నాలు చేయాలని సమావేశం రైతులకు పిలుపునిచ్చింది. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు సంఘాల ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం కరువు సమస్యపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రైతు సంఘం నాయకుడు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడారు. కౌలు రైతు సంఘం నాయకుడు ఎం.హరిబాబు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, వివిధ సంఘాల నాయకులు అజయ్‌కుమార్ నరసింహారావు, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలతో లబ్ధి

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్



15వ డివిజన్‌లో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న అవినాష్

ఆటోనగర్(విజయవాడతూర్పు): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం 15వ డివిజన్ 68వ సచివాలయంల పరిధి, 11వ డివిజన్ 5 వ సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించారు. దేవినేని అవినాష్ ముఖ్య అతిథిగా పాల్గొని సంక్షేమం, అభివృద్ధి డిస్‌ప్లే బోర్డుని ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేశారు. లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి గత ప్రభుత్వ వైఫల్యాలను, నాలుగున్నర సంవత్సరాల్లో జగనన్న ప్రభుత్వం చేకూర్చిన ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో పరిపాలనా సంస్కరణలు, వినూత్న కార్యక్రమాల ద్వారా దేశమంతా ప్రశంసించేలా చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వానికి - వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని చాటి చెప్పేందుకు ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమానికి రూపకల్పన చేశారన్నారు. 2019లో ఇచ్చిన హామీలను 99 శాతం వరకు నెరవేర్చారన్నారు. ఈ విషయాన్ని మేనిఫెస్టో చూపిస్తూ వివరించి, మళ్లీ జగనన్నను సీఎంగా చేసుకోవాలని చెప్పే అద్భుతమైన కార్యక్రమమే వై ఏపీ నీడ్స్ జగన్ అని అవినాష్ పేర్కొన్నారు.

దత్తత తీసుకున్న ఎమ్మెల్యే గద్దె తోకముడిచారు...

గతంలో ఈ 15వ డివిజన్‌ను దత్తత తీసుకున్నా అని ప్రగల్భాలు పలికిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సవతి ప్రేమ చూపించి అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేశారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డివిజన్‌లో 6465 మందికి రూ. 21 కోట్ల మేర సంక్షేమ లబ్ధి అందించడమే కాకుండా రూ.12 కోట్లతో అభివద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు.

1500 మందికి రూ.9 కోట్లు లబ్ధి..

11వ డివిజన్‌లో 1500 మందికి 9 కోట్ల రూపాయల సంక్షేమ లబ్ధి చేకూరిందన్నారు. 14 ఏళ్లు పరిపాలించిన చంద్రబాబు నాడు ఇవ్వలేని భవిష్యత్తు గ్యారెంటీ ఇప్పుడు ఎలా ఇస్తారు అని ప్రశ్నించారు. మాట ఇచ్చి మోసం చేయడమే చంద్రబాబు గ్యారెంటీ అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 11వ డివిజన్ ఇన్‌చార్జ్ పర్వతనేని పవన్ కుమార్, మండల ఇంచార్జ్ రిజ్వాన్, క్లస్టర్ ఇన్‌చార్జ్ గద్దె కళ్యాణ్, సాయి కష్టారెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆది దంపతుల ఆర్జిత సేవలకు డిమాండ్



సహస్ర లింగార్చన అనంతరం విశేష అలంకరణ



ఆది దంపతులకు శాంతి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



చండీ హోమంలో పాల్గొన్న ఉభయదాతలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం, శుక్రవారం నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున ప్రథమంగా జరిగే వస్త్రాలంకరణ సేవ, ఖడ్గమాలార్చనతో పాటు ఉదయం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, చండీ హోమం, శాంతి కల్యాణంలో ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర లింగార్చన, మల్లేశ్వర స్వామి వారికి త్రికాల అర్చనలు, పంచామృత అభిషేకాలు పెద్ద ఎత్తున నిర్వహించగా, భక్తులు తమ నామ గోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. అమ్మవారి పంచహారతుల సేవ , ఆది దంపతుల ఊంజల్ సేవ, దీపారాధన సేవలో భక్తులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన క్యూలైన్లు....

అమ్మవారిని దర్శించుకునేందుకు నవ దంపతులతో పాటు ఉభయదాతలు, భక్తులు ఇంద్రకీలాద్రికి తరలిరావడంతో క్యూలైన్లు కిటకిటలాడాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు భక్తుల తాకిడి కనిపించింది. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు 11-40 గంటల నుంచి 12-15 గంటల వరకు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో కెఎస్.రామారావు క్యూలైన్లను పర్యవేక్షించారు. శుక్రవారం ఉదయం రూ. 500 టికెట్ క్యూలైన్‌లో తనిఖీలు నిర్వహించారు. అమ్మవారి అంతరాలయం దర్శనం చేసుకునే ప్రతి ఒక్కరూ తప్పని సరిగా టికెట్లు కొనుగోలు చేసేలా చూడాలని ఏఈవో చంద్రశేఖర్‌తో పాటు దేవస్థాన ఇన్‌స్పెక్టర్, క్యూలైన్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.



క్యూలైన్లను పర్యవేక్షిస్తున్న ఈవో రామారావు

హెల్మెట్ వినియోగంపై అవగాహన

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడంతోనే ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని, హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం వలన వారి ప్రాణాలకు రక్షణ ఉంటుందని త్రీ టౌన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ డివి రమణ వాహనదారులకు అవగాహన కల్పించారు. శుక్రవారం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో హెల్మెట్ వాడకంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేని పలువురు చోదకులపై కేసులు నమోదు చేసి హెల్మెట్ ఉపయోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ డివి.రమణ మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత, మోటారు వాహనాల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. చిన్నపాటి నిర్లక్ష్యంతో హెల్మెట్ వాడకపోవడంతో అనుకోని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోయి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. అదే విధంగా భగత్‌సింగ్ రోడ్డులో పర్యటించి రోడ్డును ఆక్రమించుకుని తోపుడు బండ్లు, చిరు వ్యాపారుతో మాట్లాడి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా తమ వ్యాపారాలను చేసుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ ఎస్ఐలు నాగ దుర్గా, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ డి.వి రమణ

డయల్ యువర్ పోలీస్ కమిషనర్‌కు 12 ఫిర్యాదులు



సత్యనారాయణ పురం(విజయవాడసెంట్రల్): ప్రజా సమస్యల సత్వర పరిష్కార వేదికగా పోలీస్ కమిషనరేట్‌లో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ పోలీస్ కమిషనర్ కార్యక్రమంలో బాధితులు నేరుగా తమ సమస్యలను సీపీకి తెలియజేశారు. ఇందుకోసం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కేటాయించిన 0866-2490613 నంబర్‌కు 12 మంది బాధితులు ఫోన్ చేసి తమ సమస్యలను తెలిపారు. వీటిలో ట్రాఫిక్ సమస్యలు, అసాంఘిక శక్తులు, కుటుంబ కలహాలు, ఆర్థిక నేరాలు, స్థలం తగాదాల గురించి ఉన్నాయి. సంబంధిత పోలీస్ స్టేషన్ యస్‌హెచ్‌ఓలు, ట్రాఫిక్ అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించే దిశగా సీపీ ఆదేశాలు జారీ చేశారు.

నెట్‌బాల్ పోటీల్లో బాపులపాడు విద్యార్థుల ప్రతిభ

హనుమాన్‌జంక్షన్ రూరల్: రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో బాపులపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభతో రాణించారని హెచ్‌ఎం తోట వెంకట నాగేశ్వరరావు, మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ పామర్తి వెంకటేశ్వరరావు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఇటీవల విజయవాడలో జరిగిన అంతర్‌జిల్లాల నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-19 జిల్లా బాలుర జట్టుకు బాపులపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి షేక్ హనీఫ్ ప్రాతినిధ్యం వహించాడని తెలిపారు. ఈ పోటీల్లో హనీఫ్ అత్యుత్తమ ప్రతిభ చాటడంతో పాటుగా జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిల్చిందన్నారు. అండర్-14 బాలికల విభాగంలో తృతీయ స్థానం సాధించిన కృష్ణా జిల్లా జట్టుకు పాఠశాల విద్యార్థిని నడకుదురు హిమబిందు ప్రాతినిధ్యం వహించినట్లు పేర్కొన్నారు. వీరితో పాటుగా రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, నెట్‌బాల్ క్రీడల్లో పాల్గొన్న పలువురు విద్యార్థులను పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సుంకర సుభాష్‌చంద్రబోస్, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.



నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

డ్రంకెన్ డ్రైవ్‌లో 20 మందికి జరిమానా

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): మద్యం తాగి వాహనాలు నడిపిన 20 మందికి జరిమానా విధిస్తూ ఆరవ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్ట్ న్యాయమూర్తి జి. లెనిన్ బాబు శుక్రవారం తీర్పు వెల్లడించారు. నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు 5వ ట్రాఫిక్ పోలీసులు 20 మందిపై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. వీరిలో ఏడుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు, మిగిలిన 13 మందికి ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారు.

సైబర్ నేరాల నివారణపై అవగాహన

పాయకాపురం(విజయవాడరూరల్): నగర పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న నేరాలపై పోలీసు అధికారులు చేరువ వాహనం ద్వారా ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. నున్న పోలీస్ స్టేషన్ పరిధి వాంబేకాలనీ హెచ్ బ్లాక్ వద్ద కళాశాలల్లో చదివే యువతకు, ప్రజలకు నేరాల గురించి అవగాహన కల్పించారు. చిన్నపిల్లలకు గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్ అంటే ఏమిటి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చిన్న చిన్న వీడియోల రూపంలో ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. నేరాలు జరిగిన తర్వాత దర్యాప్తు చేసేకంటే, అవి జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అడ్డుకట్ట వేయాలనే ప్రధాన ఉద్దేశ్యంతో ఈ ప్రదర్శనలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దిశా పోలీస్‌స్టేషన్ అధికారులు, సిబ్బంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



చేరువ వాహనంపై ప్రదర్శనను తిలకిస్తున్న స్థానికులు

వైభవంగా తులసీ కల్యాణం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో తులసీ కల్యాణం శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పాతబస్తీలోని పురాతన ఆలయమైన వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో క్షీరాబ్ధి ద్వాదశిని పురస్కరించుకొని తులసీ అమ్మవారికి శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి కల్యాణోత్సవం నిర్వహించారు. కార్తికమాసం, శుక్రవారం, క్షీరాబ్ధి ద్వాదశిని పురస్కరించుకొని ఆలయంలో కొలువై ఉన్న పద్మావతి అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేసి విశేష పూజలు నిర్వహించారు. తులసీ కల్యాణాన్ని పురస్కరించుకొని పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకస్వాములు పొన్నంగిపల్లి శ్రీరామచంద్ర మూర్తి అర్చక కార్యక్రమాలు నిర్వహించారు.

కుల గణనతో బీసీ వర్గాలకు న్యాయం

కంకిపాడు: బీసీ కులగణనతో బీసీ వర్గాలకు న్యాయం జరుగుతుందని నగర కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు అన్నారు. కోలవెన్ను పంచాయతీలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 92 ఏళ్ల తరువాత కులగణనకు ప్రభుత్వం ముందుకు రావటం హర్షణీయమన్నారు. గణనతో బీసీ కులాలన్నింటికీ గుర్తింపు వస్తుందన్నారు. బీసీ వర్గాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాయన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, సర్పంచ్ సురేష్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు ఉమాదేవి, మాజీ సర్పంచ్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

వినియోగదారుల శ్రేయస్సే లక్ష్యం

రామవరప్పాడు: వినియోగదారుల శ్రేయస్సే లక్ష్యంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పని చేస్తుందని జోనల్ హెడ్ ఎం.రవీంద్రబాబు అన్నారు. రామవరప్పాడు రింగ్ సమీపంలోని ఓ హోటల్లో శుక్రవారం యూనియన్ బ్యాంక్ 105వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.19.80 లక్షల కోట్లతో గ్లోబల్ బిజినెస్‌తో 5వ అతిపెద్ద పబ్లిక్ సెక్టార్ బ్యాంక్‌గా ఉందన్నారు.

కార్తిక మాసం శాస్త్రీయ అంశాల సమాహారం



కార్తిక విజ్ఞానం అంశంగా మాట్లాడుతున్న డాక్టర్ కప్పగంతు రామకృష్ణ

విజయవాడ కల్చరల్: కార్తిక మాసం శాస్త్రీయమైన అంశాల సమాహారమని తెలుగు సంస్కృత అకాడమీ సభ్యుడు డాక్టర్ కప్పగంతు రామకృష్ణ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యంలో గుణదలలోని రోటరీ కార్యాలయంలో శుక్రవారం కార్తిక విజ్ఞాన అంశంగా ప్రసంగం నిర్వహించారు. డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ భారతీయ ఆధ్యాత్మిక రంగంలో కార్తిక మాసానికి విశిష్టమైన స్థానం ఉందన్నారు. భక్తి భావంతోపాటు శాస్త్రీయత నిండి ఉంటుందని తెలిపారు. ప్రకృతికి అనుగుణంగా మానవుడు తన జీవన విధానాన్ని మార్చుకోవాలని సూచన చేసే వ్యవస్థ మన భారతీయులదన్నారు. అందులో భాగమే చేసేటువంటి స్నానాలుగా అభివర్ణించారు. దీపారాధన, దానాలు ఈకోవకే చెందుతాయన్నారు. నగర రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ సుబ్బారావు రావూరి, కార్యదర్శి ఆర్ఎస్ వీవీ రామారావు, నగర గవర్నర్ డాక్టర్ రవికుమార్ కంచర్ల పాల్గొన్నారు. నిర్వాహకులు డాక్టర్ కప్పగంతు రామకృష్ణను సత్కరించారు.

ఫార్చ్యూన్ మురళీపార్క్‌లో ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభం



ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో ఆంధ్ర వంటకాల వద్ద చెఫ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): నెల్లూరు చేపల పులుసు, రాయలసీమ నాటుకోడి కూర, రాగి సంకటి, రొయ్యలకూర, బొంగు చికెన్, గోంగూర మటన్, పీతల ఇగురు వంటి వంటకాలతో మహాత్మాగాంధీరోడ్డులోని హోటల్ ఫార్చ్యూన్ మురళీపార్క్‌లో ఆంధ్రా ఫుడ్ ఫెస్టివల్ శుక్రవారం ప్రారంభమైంది. డిసెంబరు 3 వరకూ కొనసాగే ఈ ఫుడ్ ఫెస్టివల్ ప్రతిరోజూ బఫెట్ డిన్నర్ , ఆదివారం బఫెట్ లంచ్ అండ్ డిన్నర్ ఉంటుంది. ఒక్కరికి రూ.వెయ్యితో పాటు (జీఎస్టీ అదనం) ఉంటుంది. ఈ ఫెస్టివల్‌లో నోరూరించే కాకినాడ కాజ, సున్ని ఉండలు, అరిసెలు, పూతరేకులు, నేతి బొబ్బట్లు, చక్రపొంగలి వంటి వాటితో పాటు, అనేక రకాల వెజ్ కూరలు శాకాహార ప్రియుల కోసం కొలువు తీరాయి. ఇలా వెజ్ అండ్ నాన్ వెజ్ వంటకాలతో ఫెస్టివల్ ఏర్పాటు చేసినట్లు మేనేజర్ పవన్ తెలిపారు.

29న ఎస్ఆర్ఆర్‌లో అంతర్జాతీయ వెబినార్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ కృష్ణ, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు వెబినార్‌లు దోహదపడతాయని కళాశాల రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ వెబినార్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. డాక్టర్ కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని కళాశాల ప్రిన్సిపాల్ కె భాగ్యలక్ష్మితో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 29న కళాశాలలో ఎక్స్‌ప్లోరింగ్ రీసెర్చ్ ట్రెండ్స్ ఇన్ కెమిస్ట్రీ అండ్ బయో కెమిస్ట్రీ అంశంపై అంతర్జాతీయ వెబినార్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా పోతులూరి జయంతి



బ్రహ్మంగారి జీవిత చరిత్ర చిత్రపటాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కాలజ్ఞానం ద్వారా ప్రజలను చైతన్య పరిచిన మహనీయులు పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి అని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ తెలిపారు. పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 415 జయంతి గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తోలేటి శ్రీకాంత్ హాజరయ్యారు. తొలుత పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ కాలజ్ఞానం ద్వారా ప్రపంచానికి భవిష్యత్తును తెలిపిన మహనీయులని కొనియాడారు. మూఢ నమ్మకాలపై చైతన్య పరిచి కాల జ్ఞాన తత్వాలను ప్రచారం చేసి కుల, మత, వర్గ, వర్ణ, ప్రాంతాల భేదాలు లేకుండా మానవులందరూ సమానమనే సత్యాన్ని చూపించారని పేర్కొన్నారు. అనంతరం బ్రహ్మంగారి జీవిత చరిత్ర చిత్రపటాలను పలువురికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రహ్మణ సేవా సంఘం కార్యదర్శి కె. అచారి, మహిళా సంఘం అధ్యక్షురాలు కల్లూరి శ్రీవాణి, బీసీ నాయకులు ఎస్‌పీ. శేషగిరి, యువజన నాయకులు జవ్వాది సు. ధీర్, మంగరాజు, జేజిబాబు, పెదప్రోలు బ్రహ్మం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ

ఎస్సీ వర్గీకరణపై వెంటనే కమిటీ
ఉన్నతాధికారులకు ప్రధాని ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్లలో ఉప వర్గీకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు వీలైనంత త్వరగా కమిటీ ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులను ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశించారు. శుక్రవారం కేబినెట్ సెక్రటరీ రాజీవ్ గౌబా, ఇతర సీనియర్ అధికారులతో ఈ మేరకు ఆయన కీలక సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించి కీలక సూచనలు చేశారు. ఇటీవల హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వరూప మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మోదీ ఎస్సీ వర్గీకరణకు, మాదిగల సాధికారతకు సాధ్యమైన మార్గాలపై కేంద్రం త్వరలో కమిటీ ఏర్పాటు చేస్తుందని ప్రకటించడం తెలిసిందే.

మెట్రో రైల్లో కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ప్రచారంలో బిజీబిజీగా ఉన్న తెలంగాణ రాష్ట్ర మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం మెట్రో రైల్లో ప్రయాణం చేసి ప్రయాణికులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేశారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో రియల్ ఎస్టేట్ ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న ఆయన.. రాయదుర్గం స్టేషన్ నుంచి బేగంపేట్ వరకు మెట్రోలో ప్రయాణించారు. 20 నిమిషాల పాటు ప్రయాణికులతో కలిసిపోయి సరదాగా ముచ్చటించారు. పలువురు యువతీ యువకులతో మాట్లాడిన కేటీఆర్.. ఈనెల 30న జరుగనున్న ఎన్నికల ప్రక్రియలో తప్పనిసరిగా భాగస్వాములు కావాలని వారిని కోరారు.

రైతుబంధుకు ఈసీ గ్రీన్ సిగ్నల్
పోలింగ్‌కి ముందు బీఆర్ఎస్‌కు ఊరట

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసన సభ సాధారణ ఎన్నికల పోలింగ్‌కు ముందు బీఆర్ఎస్ పార్టీకి భారీ ఊరట లభించింది. యాసంగి పంటల సాగు కోసం రైతుబంధు పథకం కింద రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం అనుమతిచ్చింది. దీంతో వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లోకి డబ్బులను జమ చేసే ప్రక్రియను ప్రారంభించింది. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో రైతుబంధు, రూ.లక్ష రుణ మాఫీ పథకాల అమలుతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం(డీఏ) అమలుకు అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరింది. దీంతో రైతుబంధు పథకం అమలుకు ఎన్నికల సంఘం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

కారు ఇంజన్‌లో కరెన్సీ కట్టలు

ఖిలా వరంగల్: ఎన్నికల అధికారుల కళ్లు గప్పి కారు ఇంజన్ భాగంలో నోట్ల కట్టలు భద్రపర్చి తరలిస్తుండగా ఇంజన్ వేడికి నోట్లకు మంటలు అంటుకున్నాయి. దీంతో వెనకాల వస్తున్న మరో కారులోకి క్షణాల్లో డబ్బులను మార్చేసి మంటలంటుకున్న కారును అక్కడే వదిలేసి డ్రైవర్‌తో పాటు అందరూ పరారయ్యారు. ఈ ఘటన శుక్రవారం మధ్యాహ్నం వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లాకు చెందిన కొందరు బానోతు వినోద్ పేరుతో ఉన్న (టీఎస్ 09 ఈఎల్ 6645) కారు ఇంజన్ భాగంలో కరెన్సీ నోట్ల సంచులను భద్రపర్చి వరంగల్ నుంచి వర్ధన్నపేట వైపు బయల్దేరారు. ఖమ్మం జాతీయ రహదారి బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోకి రాగానే ఇంజన్ నుంచి ఒక్కసారిగా దట్టమైన పొగతో మంటలు చెలరేగాయి. మంటలు అంటుకున్న డబ్బులను కారు వెనకభాగంలో పైలెట్‌గా వస్తున్న మరో కారులోకి డబ్బుల సంచులను మార్చేసి క్షణాల్లో పారిపోయారు.

ఇందిరమ్మ రాజ్యమంటే ఎమర్జెన్సీలు.. ఎన్‌కౌంటర్లు
ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్

సాక్షి ప్రతినిధి, వరంగల్/ సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/ సాక్షి ప్రతినిధి, కరీంనగర్: 'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇందిరమ్మ రాజ్యమట.. ఆ రాజ్యంలో ఏం జరిగిందో మనకు తెల్వదా?, అంత తొందరగా మరచిపోతమా?. ఇందిరమ్మ రాజ్యమంటే ఎన్‌కౌంటర్లు, ఎమర్జెన్సీలు.. జైలు పాలు చేసే బానిస బతుకులే కదా. తెలంగాణ ప్రజలు అరిగోస పడ్డది ఆ పాలనలోనే కదా. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో సంపదను పెంచుకుంటూ అభివృద్ధి పథంలో సాగే పాలన కావాలా? రైతుబంధు, ఉచిత విద్యుత్, ధరణిలపై అక్కసు వెళ్లగక్కుతూ దళారీల పాలన తెస్తామంటున్న ఇందిరమ్మ రాజ్యం కావాలా? మీరంతా ఆలోచించాలి' అని రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు, భూపాలపల్లి, మంచిర్యాల జిల్లా నస్పూర్, పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో ఆయన మాట్లాడారు.

తెలంగాణలో కాంగ్రెస్ గాలి
ప్రచారంలో ప్రియాంకా గాంధీ

సాక్షి, మహబూబాబాద్/సాక్షి, సిద్దిపేట/హుస్నాబాద్‌రూరల్: 'మందుల షాపులో ప్రతీ మందుపై ఎక్స్‌పైరీ తేదీ ఉన్నట్లే.. బీఆర్ఎస్‌కూ కాలం చెల్లింది. ఓటమికి దగ్గరగా ఉన్న ఆ పార్టీ అంతిమ గడియలు లెక్కపెట్టుకుంటోంది' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ అన్నారు. త్యాగాలతో తెచ్చుకున్న తెలంగాణను కేసీఆర్ ఆగం చేశారన్నారు. 'మా నాయనమ్మ ఇందిరాగాంధీ ఎప్పుడూ చెబుతూ ఉండేది. ప్రజాస్వామ్యంలో ఓటే కీలకం. ప్రజలు చైతన్య వంతులు' అని గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు ప్రజల్లో చైతన్యం వచ్చిందని, రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తోందని చెప్పారు. ఎన్నికలు కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య జరుగుతున్నాయని చెప్పారు.

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. వివరించే కార్యక్రమంలో భాగంగా..


విజయవాడలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా


గుంటూరు నగరం కొరిటెపాడులో బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గిరిధర్‌రావు, కార్పొరేటర్ మారుతి కోటిలింగారెడ్డి


విశాఖ జిల్లా ఆనందపురంలో మా నమ్మకం నువ్వే జగన్ బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


చిత్తూరు జిల్లా బోడబండ్ల గ్రామంలో బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, పార్టీ నాయకులు


శ్రీకాకుళం జిల్లా చెన్నాపురంలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న పార్టీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ


శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బైరవరంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న గ్రామస్తులు


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నాగుల్లంకలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

బోసి నవ్వులకు భరోసా

శిశు మరణాల నియంత్రణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు

అత్యాధునిక వైద్య పరికరాలను సమకూర్చిన సర్కార్

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో శిశు మరణాల నివారణే లక్ష్యంగా సీఎం జగన్ ప్రభుత్వం గడిచిన నాలుగున్నరేళ్లలో తీసుకున్న చర్యలు ఫలించాయి. మహిళ గర్భం దాల్చిన నాటి నుంచి పండంటి బిడ్డకు జన్మనిచ్చి, ఆ బిడ్డ పూర్తి ఆరోగ్యంగా ఇంటికి చేరుకునే వరకూ అడుగడుగునా ప్రభుత్వం చేయిపట్టి నడిపిస్తోంది. ఇందుకోసం ప్రభుత్వాస్పత్రుల్లోని పీడియాట్రిక్ (చిన్న పిల్లల) వైద్య విభాగాలను బలోపేతం చేస్తోంది. వార్డుల్లో ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చడంతో పాటు, పూర్తిస్థాయిలో వైద్యులను, సిబ్బందిని నియమించింది. దీంతో.. టీడీపీ ప్రభుత్వ హయాంతో పోలిస్తే స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్స్ (ఎస్ఎన్‌సీయూ)లో శిశు మరణాల రేటు ఇప్పుడు గణనీయంగా తగ్గింది. 2018–19లో ఎస్ఎన్‌సీయూల్లో ప్రతి వెయ్యి జననాలకు శిశు మరణాల రేటు 12.3గా ఉండేది.

కేంద్రం అభినందనలు..

ఇక 2019 నుంచి సీఎం జగన్ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఈ మరణాల రేటు క్రమంగా తగ్గుతూ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య 6.6కు తగ్గింది. పూర్తిస్థాయిలో ఈ మరణాలను నియంత్రించడానికి వైద్యశాఖ చర్యలు చేపడుతోంది. దేశంలో ఏ రాష్ట్రంలో లేనట్లుగా అనతికాలంలో ఎస్ఎన్‌సీయూల్లో శిశు మరణాలను గణనీయంగా నియంత్రించిన రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇటీవల కేంద్రం సైతం అభినందించింది.

380 పడకలు పెంపు..

నవజాత శిశు మరణాల నియంత్రణా చర్యల్లో భాగంగా ప్రభుత్వాస్పత్రుల్లో ఎస్ఎన్‌సీయూ, నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఐసీయూ)లలో పడకలను వైద్యశాఖ పెంపొందిస్తూ వస్తోంది. 2019కు ముందు.. రాష్ట్రంలో 62 ఎస్ఎన్‌సీయూల్లో 585 పడకలు అందుబాటులో ఉండేవి. వీటికి అదనంగా వార్డులను ఏర్పాటుచేస్తూ 755కు ప్రభుత్వం పడకలకు పెంపొందించింది. మరోవైపు.. 2023–24 ఆర్థిక సంవత్సరంలో శిశు సంరక్షణ కేంద్రాల బలోపేతం చేపట్టింది. ఇందులో భాగంగా 11 ప్రభుత్వాస్పత్రుల్లో 20 పడకల చొప్పున, మరో 8 ఆస్పత్రుల్లో 10 పడకల చొప్పున ఎస్ఎన్‌సీయూ, నాలుగు ఆస్పత్రుల్లో 20 పడకల చొప్పున ఎన్ఐసీయూ ఏర్పాటుచేసింది. వీటిల్లో వైద్యసేవలు అందించడానికి 250 మంది వరకూ వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఇతర సహాయ సిబ్బంది పోస్టుల భర్తీ చేపట్టారు. సీప్యాప్, ఫొటోథెరపీ యూనిట్, రేడియంట్ వార్మర్, ఇతర అత్యాధునిక పరికరాలను సమకూర్చారు. ఈ యూనిట్స్‌లో త్వరలో వైద్యసేవలు ప్రారంభించనున్నారు.


విజయవాడ జీజీహెచ్‌లోని నవజాత శిశు సంరక్షణ కేంద్రం

గడచిన ఐదేళ్లల్లో రాష్ట్రంలోని ఎస్ఎన్‌సీయూల్లో తగ్గుతూ వస్తున్న మరణాల రేటు..	సంవత్సరం	పడకలు	అడ్మిషన్లు	మరణాల రేటు
	2018–19	585	47,399	12.3
	2019–20	585	52,851	10.1
	2020–21	595	43,731	11.4
	2021–22	605	53,242	9.94
	2022–23	715	61,806	8.1
	2023 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్	755	36,166	6.6



సేవలు వినియోగించుకోవాలి

సరైన వైద్యం అందక ఏ ఒక్క చిన్నారి ప్రాణం పోకూడదనేది సీఎం జగన్ సిద్ధాంతం. ఈ క్రమంలో మాతా, శిశు మరణాల నివారణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. నవజాత శిశు మరణాల నియంత్రణే లక్ష్యంగా సంరక్షణ కేంద్రాలన్నింటిలో సదుపాయాలు బలోపేతం చేపట్టాం. 380 ఎస్ఎన్‌సీయూ, 80 ఎన్ఐసీయూ పడకలను పెంచాం. ఈ యూనిట్స్ అన్ని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ప్రైవేట్‌లో ఎంతో ఖరీదైన వైద్యసేవలు సైతం ప్రభుత్వాస్పత్రుల్లో లభిస్తున్నాయి. ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలి.

– జె. నివాస్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్

క్వాడ్రాంగ్యులర్ క్రికెట్‌లో భారత్ బీ విజయం

- మరో మ్యాచ్‌లో ఇంగ్లాండ్ జట్టు గెలుపు
- భారత్ బీ లో 199 రన్స్ చేసిన అన్ష్ గోసాయి


తలపడుతున్న భారత్ ఏ, భారత్ బీ జట్లు

ఇబ్రహీంపట్నం: క్వాండ్రాంగ్యులర్ అండర్–19 అంతర్జాతీయ క్రికెట్ సీరీస్ పోటీలు ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు టిన్స్ క్రికెట్ స్టేడియాల్లో జరుగుతున్నాయి. సీపీ గ్రౌండ్‌లో శుక్రవారం భారత్ ఏ, భారత్ బీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో పరుగుల వరద పారింది. తొలత బ్యాటింగ్ చేసిన ఇండియా బీ 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 314 పరుగులు చేసింది. అన్ష్ గోసాయి 165 బంతుల్లో 199 పరుగులు చేశాడు. భారత్ ఏ బౌలర్ ఆరాధ్య శుక్లా, సామికుమార్ పాండే చెరో 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఏ జట్టు 37.3 ఓవర్లలో 244 పరుగులకు ఆలౌట్ అయ్యింది. భారత్ బీ బౌలర్ జయంత్ గోయత్ 3 వికెట్లు పడగొట్టాడు. అన్స్ గోసాయి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. డీవీఆర్ గ్రౌండ్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో ఇంగ్లాడ్ 49.3 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌట్ అయ్యింది. లూక్ బెన్‌కిస్టెన్ 79 పరుగులు చేశాడు. బంగ్లా బౌలర్ ఎండీ రఫీ 3 వికెట్లు తీశాడు. బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 43.1 ఓవర్లలో 197 పరుగులకు ఆలౌట్ అయ్యింది. 68 పరుగుల తేడాతో ఇంగ్లాండ్ విజయం సాధించింది.

మిలీనియం టవర్స్‌పై రామోజీ విలనీయం!

▶ మొదటి పేజీ తరువాయి

మరీ ఇంతలా దిగజారిపోవాలా?

రాష్ట్రంలో ఎన్నికల సమయం దగ్గరపడుతున్నకొద్దీ 'ఈనాడు' సహా ఎల్లో మీడియా ఆక్రోశానికి హద్దుల్లేకుండా పోతోంది. చంద్రబాబు పాలనతో పోలిస్తే విశాఖపట్నంలో గడిచిన నాలుగున్నరేళ్లుగా ఐటీ రంగం వేగంగా విస్తరించినా... దాన్ని మరుగునపరుస్తూ, యువతలో విషబీజాలు నాటడమే లక్ష్యంగా 'ఈనాడు' శుక్రవారం విషం కక్కింది. మిలినియం టవర్స్‌లో ఉన్న ఐటీ కంపెనీ 'కాండ్యుయెంట్' అక్కడే కొనసాగుతుండగా.. ఖాళీగా ఉన్న ప్రాంతాన్ని ప్రభుత్వం తన కార్యాలయాల కోసం వాడుకోవాలని సంకల్పించింది. కానీ కాండ్యుయెంట్‌ను ఖాళీ చేయమని నోటీసులిచ్చారని, అది హైదరాబాద్‌కు వెళ్లిపోతోందని ఎల్లో బ్యాచ్ ఫేక్ ప్రచారానికి దిగింది. దీంతో పాటు హెచ్ఎస్‌బీసీ వంటి కంపెనీలూ విశాఖ నుంచి వెళ్లిపోయాయని, కొత్తవి ఇంకెక్కడ వస్తాయని ప్రశ్నిస్తూ కథనాన్ని వార్చేసింది. నిజానికి కాండ్యుయెంట్ అక్కడే ఉంది. దానికి నోటీసులివ్వటమనేది పచ్చి అబద్ధం. కేవలం ఎల్లో మీడియా సాగించిన ఫేక్ ప్రచారం. పైపెచ్చు హెచ్ఎస్‌బీసీ ఇండియాలో తన కార్యకలాపాలకు స్వస్తిచెప్పి 2016లోనే వెళ్లిపోయింది. కాకపోతే వీటన్నిటినీ వైఎస్ జగన్ ప్రభుత్వానికి అంటగడుతూ ఎల్లో మీడియా సాగిస్తున్న విషప్రచారమే... యువతకు అత్యంత ప్రమాదకరం.

ప్రభుత్వ అవసరాలకు కేటాయిస్తే తప్పా?

ఐటీ సంస్థల కోసం చంద్రబాబు నాయుడు మిలీనియం టవర్స్ నిర్మిస్తే దాన్ని వేరే అవసరాలకు ముఖ్యమంత్రి జగన్ వాడుకుంటున్నారని.. ఇది ఐటీ అభివృద్ధికి అడ్డంకి అని 'ఈనాడు' వాపోయింది. నిజానికి టవర్–ఎ, టవర్–బి పేరిట ఉన్న రెండింటినీ మిలీనియం టవర్స్ పేరుతో పిలుస్తున్నారు. దీన్లో ఒక్కదాన్ని కూడా చంద్రబాబు పూర్తి చేయలేకపోయారు. వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.60 కోట్లకుపైగా నిధులు వెచ్చించి అసంపూర్తిగా ఉన్న టవర్–ఎను పూర్తి చేయటమే కాక, కొత్తగా టవర్–బిని నిర్మించింది. టవర్–బి ఈ ఏడాదే పూర్తయింది. ప్రస్తుతం ఖాళీగా ఉంది. మరి దాన్ని ప్రభుత్వం తాత్కాలికంగా తన అవసరాల కోసం వాడుకుంటే తప్పా? ఇదెక్కడి వాదన? ప్రభుత్వ విభాగానికైనా, ప్రభుత్వ విద్యా సంస్థలకైనా ప్రత్యేక భవనాలు నిర్మించే పరిస్థితి లేకుంటే తాత్కాలికంగా అందుబాటులో ఉన్న భవనాలు కేటాయించడం తప్పెలా అవుతుంది? చంద్రబాబు మాదిరి ప్రభుత్వ విభాగాలను సైతం ఫైవ్‌స్టార్ హోటళ్లలో పెట్టి భారీ అద్దెలు చెల్లించాలనా రామోజీ ఉద్దేశం?

క్యాండ్యుయెంట్‌కు నోటీసులంటూ పచ్చి అబద్ధాలు..

'టవర్–ఏ'లో ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించిన ఐటీ సంస్థ కాండ్యుయెంట్‌కు విస్తరణ కోసం అదనపు స్థలం అడిగినా ఇవ్వలేదని, పైపెచ్చు ఖాళీ చేయమంటూ నోటీసులు జారీ చేశారని ఈనాడుతో పాటు సోషల్ మీడియా వేదికగా ఎల్లో బ్యాచ్ విపరీతమైన దుష్ప్రచారం చేస్తోంది. నిజానికి ప్రభుత్వం తమకెలాంటి నోటీసులూ ఇవ్వలేదని, హైదరాబాద్‌కు షిఫ్ట్ అయ్యే ఆలోచన తమకు లేనే లేదని కాండ్యుయెంట్ ఇప్పటికే పలుమార్లు స్పష్టంచేసినా... ఈ విషప్రచారానికి మాత్రం తెరపడటం లేదు. నిజానికి ఈ టవర్‌లో కాండ్యుయెంట్ తప్ప వేరే కంపెనీలేవీ కార్యకలాపాలు కొనసాగించడం లేదు. ఐటీ కంపెనీలను ఆకర్షించడం కోసం ప్రభుత్వం ఐటీ ఇన్‌ఫ్రాను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. అదానీ గ్రూప్ డేటా సెంటర్‌తో పాటు భారీ ఐటీ టవర్‌ను నిర్మిస్తోంది. రహేజా గ్రూపు ఇనార్బిట్ మాల్ నిర్మాణంతో పాటు ఐటీ టవర్‌ను కడుతోంది. ఏపీఐఐసీ రూ.2,300 కోట్ల వ్యయంతో మధురవాడలో 19 ఎకరాల విస్తీర్ణంలో 'ఐ స్పేస్' పేరిట ఐటీ టవర్‌ను నిర్మిస్తోంది. కానీ రామోజీ ఈ నిజాలన్నిటికీ ముసుగేసి అబద్ధాలే ఆలంబనగా చెలరేగిపోయారు.

హెచ్ఎస్‌బీసీ వెళ్లిపోయిందెప్పుడో తెలియదా?

'ఈనాడు' ఎంతలా దిగజారిపోయిందో తెలియటానికి ఈ అంశం ఒక్కటీ చాలు. చైనాకు చెందిన హెచ్ఎస్‌బీసీ తన విధానపరమైన నిర్ణయంలో భాగంగా భారతదేశ కార్యకలాపాల నుంచి వైదొలుగుతున్నట్లు 2016లో ప్రకటించింది. అందులో భాగంగా విశాఖ, హైదరాబాద్, ఢిల్లీల్లోని తన కార్యకలాపాలను ఉపసంహరించుకుంది. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్నది చంద్రబాబు నాయుడే. దీన్ని కూడా వైఎస్ జగన్ ప్రభుత్వానికి అంటగట్టి దుష్ప్రచారం చేస్తున్నారంటే వీళ్లనేమనుకోవాలి?

కొత్త కంపెనీలు కనిపించటం లేదా?

కంపెనీలు వెళ్లిపోవటమే గానీ కొత్తవి రావటం లేదంటూ ఆక్రోశించారు రామోజీ. నిజానికి ఐటీకి ఆద్యుడినంటూ డబ్బాకొట్టుకొనే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లలో విశాఖకు చెప్పుకోదగ్గ పేరున్న ఒక్క కంపెనీ కూడా రాలేదు. కానీ ఈ ప్రభుత్వం బీచ్ డెస్టినీ పేరిట ఐటీ కంపెనీలను విశాఖకు రప్పించే ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా ఇన్ఫోసిస్ ఇప్పటికే డేటా సెంటర్‌ను ప్రారంభించగా, విప్రో డేటాసెంటర్‌ను ప్రారంభించడానికి వీలుగా విశాఖలో పనిచేయడానికి ఆసక్తి ఉన్న ఉద్యోగుల సమాచారాన్ని సేకరిస్తోంది. ఇక అమెజాన్, బీఈఎల్ , రాండ్‌స్టాడ్ వంటి సంస్థలు ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించాయి. మరికొన్ని సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నాయి. చంద్రబాబు హయాంలో రాష్ట్రంలో 24,,350 మంది ఐటీ ఉద్యోగులుండగా ఇపుడా సంఖ్య 53,850 దాటింది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ఉన్నంతకాలం రామోజీకి ఈ వాస్తవాలు కనిపించనే కనిపించవు.

ఉత్తరాంధ్రపై ఎందుకంత అక్కసు?

- సీఎం ఎక్కడి నుంచైనా పాలించవచ్చు
- విశాఖకు కార్యాలయాలు తరలింపుపై విషం కక్కుతున్నారు
- ఈ ప్రాంతం ఏపీలో లేదా?
- విశాఖలో ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌ను ప్రజలు హర్షిస్తున్నారు
- చంద్రబాబు, పవన్‌లు పొలిటికల్ టూరిస్టులు
- మీడియాతో మంత్రి గుడివాడ అమర్‌నాథ్

దొండపర్తి (విశాఖ దక్షిణ) : ఎక్కడి నుంచైనా పరిపాలన చేసే అధికారం ముఖ్యమంత్రికి ఉందని.. దాన్ని అడ్డుకునే హక్కు, ఆపే శక్తి ఏ వ్యక్తికీ.. వ్యవస్థకు లేదని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తేల్చిచెప్పారు. వికేంద్రీకరణలో భాగంగా విశాఖకు ప్రభుత్వ కార్యాలయాల తరలింపుపై జీఓ జారీచేయడంపట్ల ఆయన హర్షం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయంపట్ల ఉత్తరాంధ్ర బిడ్డగా, ఈ ప్రాంత ప్రజలందరి తరఫున సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. దీనిపై ఎల్లో మీడియా మాత్రం విషం కక్కుతోందని, ఉత్తరాంధ్ర అసలు ఈ రాష్ట్రంలో లేనట్లు ఈ ప్రాంతంపై అక్కసు వెళ్లగక్కుతోందని మండిపడ్డారు. ఇక్కడి



ప్రభుత్వ అతిథి గృహంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

చంద్రబాబు, పవన్‌లు పొలిటికల్ టూరిస్టులు..

చంద్రబాబు, అతని తనయుడు లోకేశ్, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్‌లు రాష్ట్ర పొలిటికల్ టూరిస్టులు. ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు విశాఖలో స్థలాలు గుర్తిస్తే ఈ ముఠాతో పాటు పచ్చమీడియా ఈ ప్రాంతంపై విషం కక్కుతున్నాయి. చంద్రబాబు రాజమండ్రి జైలులో ఉన్నప్పుడు తప్ప ఈ నాలుగున్నరేళ్లలో ఎప్పుడైనా 50 రోజులు వీరు రాష్ట్రంలో ఉన్నారా? గత ఎన్నికల్లో ఓడిపోయిన తరువాత చంద్రబాబు అక్కడే ఉంటున్నారు. ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ విశాఖకు తరలిస్తే, అమరావతిలో తమ భూములకు విలువ పడిపోతుందన్న భయం, ఆందోళన ఆయనలో కనిపిస్తోంది. ప్రభుత్వ నిర్ణయం కారణంగా ఉత్తరాంధ్ర అభివృద్ధితోపాటు విశాఖ శక్తివంతమైన నగరంగా అభివృద్ధి చెందుతున్న ఆలోచన లేకుండా టీడీపీ నేతలు ఈ ప్రాంతంపై విషం కక్కుతున్నారు. చివరకు ఇదే ప్రాంతానికి చెందిన అచ్చెన్నాయుడు కూడా తప్పుపడుతున్నారు.. దీన్ని ఇక్కడి ప్రజలు క్షమించరు. వాస్తవానికి ప్రభుత్వ నిర్ణయాన్ని ఇక్కడి ప్రజలంతా ఆమోదిస్తున్నారు.

అవి ప్రభుత్వ భవనాలే.. తప్పేంటి?

నగరంలోని ప్రభుత్వానికి చెందిన 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన మిలేనియం టవర్స్‌ను ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయిస్తే తప్పేమిటి? దీని కారణంగా ఐటీ పరిశ్రమలు రావని అవాస్తవాలు ప్రచారం చేయడం, రాయడం దారుణం. చంద్రబాబు, పచ్చమీడియా అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మరు. ఇక గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగన్ సుసాధ్యం చేసి ప్రజలకు మరింత చేరువలో సేవలందించేందుకు గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటుచేశారు. దీనిని తప్పుబడుతున్న చంద్రబాబు బ్యాచ్.. వాటిని తొలగిస్తామని, మళ్లీ పాత 13 జిల్లాలు చేస్తామని ఎన్నికలకు వెళ్లాలి.

72 గంటల్లోనే ఆదుకున్నాం

ఇక ఫిషింగ్ హార్బర్‌లో బోట్లు తగలబడితే.. మూడ్రోజుల్లోనే చొరవ చూపి దాదాపు రూ.7.5 కోట్లు పరిహారం ఇచ్చి 49 మంది పడవల యజమానులు, వాటిపై ఆధారపడిన మరో 450 మందిని ఆదుకున్నాం. ఇందుకు సీఎం జగన్‌కు ధన్యవాదాలు. గతంలో చంద్రబాబు హుద్‌హుద్, తిత్లీ తుపాను సమయాల్లో బాధితులను ఆదుకోలేదు. దత్తపుత్రుడు రూ.50 వేలు, టీడీపీ లక్ష ఇస్తామని రాజకీయాలు చేయడానికి వస్తున్నారు.

హైకోర్టు ఆవరణలో మళ్లీ ఎత్తు పరీక్ష

తదుపరి విచారణ 29కి వాయిదా

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఎస్సై పోస్టుల నియామక ప్రక్రియ వ్యవహారం కీలక మలుపు తిరిగింది. గత నోటిఫికేషన్‌లో 'ఎత్తు' విషయంలో అర్హత సాధించిన అభ్యర్థులను తాజా నోటిఫికేషన్ కింద అనర్హులుగా ప్రకటించడంపై పిటిషన్ దాఖలు చేసిన అభ్యర్థులకు తమ పర్యవేక్షణలోనే 'ఎత్తు' పరీక్ష నిర్వహిస్తామని హైకోర్టు స్పష్టంచేసింది. హైకోర్టు ప్రాంగణంలోనే దీనికి సంబంధించిన కొలతలు తీసుకుంటామని తేల్చిచెప్పింది. ఎత్తు విషయంలో అధికారులపై పిటిషనర్లు చేసిన ఆరోపణలు అవాస్తవమని తేలితే, ఒక్కో పిటిషనర్‌కు రూ.లక్ష జరిమానా విధిస్తామని స్పష్టంచేసింది. తాము ప్రతిపాదించిన విధంగా ఎత్తు కొలిచే పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల వివరాలను తమ ముందుంచాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదిని ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ గుహనాథన్ నరేంద్ర, జస్టిస్ న్యాపతి విజయ్ ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది.

సింగిల్ జడ్జి పరిగణనలోకి తీసుకోలేదు..

ఎస్సై నియామక ప్రక్రియలో భాగమైన దేహదారుఢ్య పరీక్షలకు సంబంధించి ఎత్తు, ఛాతి చుట్టుకొలతను హైకోర్టు ఆదేశాల మేరకు మాన్యువల్‌గా కొలిచిన అధికారులు అందులో తమను అనర్హులుగా ప్రకటించారని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలంటూ ఆరుగొళ్ల దుర్గాప్రసాద్, మరో 23 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2018 నోటిఫికేషన్‌లో అర్హులుగా ప్రకటించిన తమను ఎత్తు విషయంలో తాజా నోటిఫికేషన్‌లో అనర్హులుగా ప్రకటించారన్నారు. వాదనలు విన్న సింగిల్ జడ్జి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఎస్సై నియామకాల కోసం గత నెలలో నిర్వహించిన రాత పరీక్షకు సంబంధించిన ఫలితాలను తదుపరి ఉత్తర్వులు జారీచేసేంత వరకు వెల్లడించవద్దంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. దీనిని సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు నియామక బోర్డు ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశాయి. ఈ అప్పీల్‌పై శుక్రవారం జస్టిస్ నరేంద్ర నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. హైకోర్టు ఆదేశాల మేరకు మాన్యువల్‌గా ఎత్తు కొలిచామని ప్రభుత్వ న్యాయవాది జీవీఎస్ కిషోర్‌కుమార్ ధర్మాసనానికి నివేదించారు. ఈ పరీక్షలో పిటిషనర్లు అర్హత సాధించలేదన్నారు. అయితే, ఈ విషయాన్ని సింగిల్ జడ్జి సరైన కోణంలో పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది జడా శ్రవణ్‌కుమార్ స్పందిస్తూ.. 2018లో ఎత్తు విషయంలో అర్హత సాధించిన అభ్యర్థులు, తాజా నోటిఫికేషన్‌లో ఎలా అనర్హులవుతారని ప్రశ్నించారు. వాదనలు విన్న ధర్మాసనం, తమ పర్యవేక్షణలో హైకోర్టు ప్రాంగణంలోనే మరోసారి ఎత్తు పరీక్ష నిర్వహిస్తామని తెలిపింది.

ఉరుకుల పరుగుల జీవితంలో మన ప్రయాసలే కనిపిస్తాయి. ఒకసారి ఆగి చుట్టూ చూస్తే.. ఇన్నాళ్లూ మనం మన కోసమే తప్ప చుట్టూ ఉన్న వారి సమస్యలను ఏ మాత్రం పట్టించుకోవడంలేదనే స్పృహ కలుగుతుంది. కొందరు మనకెందుకులే అని మళ్లీ తమ పనుల్లో మునిగిపోతారు. డాక్టర్ నీలిమా ఆర్య లాంటివాళ్లు మాత్రం సున్నితమైన సమస్యలపై దృష్టి పెట్టి వాటికి సరైన పరిష్కారాలు వెదుకుతారు. హైదరాబాద్ వాసి నీలిమా ఆర్య నిరుపేద అమ్మాయిలకు లో దుస్తులను అందిస్తూ, శుభ్రతపైన అవగాహన కల్గిస్తూ వారి భవిష్యత్తు ఆరోగ్యంగా ఉండేందుకు కృషి చేస్తున్నారు. ఏడాదిలో రెండు లక్షల మంది అమ్మాయిలకు లో దుస్తులను పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న నీలిమా ఆర్యను కలిసినప్పుడు ఆమెకు వచ్చిన ఈ ఆలోచన గురించి ఇలా పంచుకున్నారు.

‘షి నీడ్స్’ నీలిమ!

* సేవా మార్గం


'మిషన్ భద్రత'లో భాగంగా...

''మా సొంతూరు బాపట్ల. అమ్మానాన్నలకు పెద్ద కూతురిని. ఇంగ్లీష్ లిటరేచర్‌లో మాస్టర్స్ చేశాను. మా నాన్నగారు ఆర్మీ ఉద్యోగి కావడంతో నా చదువు అంతా ఉత్తర భారతదేశంలో ముఖ్యంగా భోపాల్‌లో జరిగింది. చదువు పూర్తయ్యాక హైదరాబాద్ వచ్చాం. ఇక్కడ పదేళ్లపాటు ఇంగ్లిష్ లెక్చరర్‌గా వర్క్ చేశాను. ఆ తర్వాత తిరిగి భోపాల్‌కి వెళ్లాను. అక్కడ నుంచి సౌదీ గవర్నమెంట్‌కు ఆంగ్ల ప్రొఫెసర్‌గా వర్క్ చేశాను. ఆరేళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి, మీడియా రంగంలో ఉండటంతో చాలా సామాజిక సమస్యలు నా దృష్టికి వచ్చాయి. సమాజానికి నా వంతుగా ఏదైనా చేయాలనే తపన అప్పుడే మొదలైంది. అమ్మానాన్నల దేశ సేవ స్ఫూర్తి కూడా నాలో ఉండటం అందుకు కారణమై ఉంటుంది.

ఐదు ప్రాజెక్ట్స్‌తో సేవా రంగం


నీలిమా ఆర్య

ఐదేళ్ల క్రితం ఐదు ప్రాజెక్ట్స్‌తో 'యాపిల్ హోమ్ రియల్ నీడ్ ఇండియా' ఫౌండేషన్‌ను ప్రారంభించాను. దీంట్లో భాగంగా ఎవరూ ఆకలితో పడుకోకూడదు అనే ఆలోచనతో మొదటిది ఫీడ్ ద నీడ్ ప్రాజెక్ట్ చేశాను. రోడ్‌సైడ్ ఫ్రిడ్జ్‌లను ఏర్పాటు చేసి, నిరుపేదలకు ఆహారం అందేలా ఏర్పాటు చేశాం. ఆ తర్వాత 'షీ నీడ్' ద్వారా ముఖ్యంగా గ్రామీణ అమ్మాయిలకు, మహిళలకు శానిటరీ ప్యాడ్స్ ఉచితంగా అందజేశాం. 'మిషన్ భద్రత' పేరుతో ఒక్కో సెట్‌లో ఆరు నాణ్యమైన ఫ్యాబ్రిక్‌తో తయారుచేసిన లో దుస్తులను ఉంచి, ఏడాది నుంచి నిరుపేద అమ్మాయిలకు అందజేస్తున్నాం. వచ్చే ఏడాది వరకు రెండు లక్షల మంది అమ్మాయిలకు లో దుస్తులను అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రముఖ డిజైనర్ రవిత మేయర్ ఈ లో దుస్తులను డిజైన్ చేస్తున్నారు. కొన్ని సేవాసంస్థల సహకారంతో ఇండియా మొత్తంలో ఎవరికి అవసరం ఉందో గుర్తించి, వారికి లో దుస్తులను అందజేస్తాం. వీటితర్వాత రైతులు, నిరుద్యోగులు, వయసుపైబడినవారి కోసం సాయం అందించాలనేది మా ఉద్దేశ్యం.

లో దుస్తుల ప్రాముఖ్యత..

నిరుపేదలను దృష్టిలో పెట్టుకొని, వారికి అత్యవసరంగా కావాల్సినవి ఏమిటి అనే ఆలోచనలు ఎప్పుడూ చేస్తుంటాం. షీ నీడ్ ప్రాజెక్ట్ లో భాగంగా భవన నిర్మాణాలు జరిగే చోట, స్లమ్స్‌లలో, కూలీల పిల్లలను చూసినప్పుడు వారికి లో దుస్తుల సమస్య ఉన్నట్టు గుర్తించాం. 3 నుంచి 13 ఏళ్ల అమ్మాయిల వరకు లో దుస్తుల గురించి సరైన అవగాహన చేయగలిగితే వారిలో పునరుత్పత్తి వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. దీనిద్వారా భవిష్యత్తు తరాలకు మెరుగైన ఆరోగ్యాన్ని అందించగలం. అలాగే, శానిటరీ ప్యాడ్స్ వాడాలన్నా సరైన లో దుస్తులు ఉండాలి. నిజానికి గ్రామీణ అమ్మాయిలు, మహిళలకు సురక్షితమైన శానిటరీ ప్యాడ్స్, లో దుస్తులు అందుబాటులో ఉండవు. ఇంట్లో మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ ఇల్లు క్షేమంగా ఉంటుందనే విషయాన్ని మనం విస్మరించకూడదు. ఈ విషయాన్ని పదే పదే ఆ కుటుంబాలకు తెలియజేయడానికి కూడా ఈ మార్గాన్ని ఎంచుకున్నాం.

సాధికారతలో భాగంగా..

ఆర్య రసోయి–క్లౌడ్ కిచెన్ ద్వారా శాకాహార, మాంసాహార వంటకాలను అందిస్తున్నాను. ఎడ్యుకేటర్‌గా, అడ్మినిస్ట్రేటర్‌గా, ఆంట్రప్రెన్యూర్‌గా, ఇద్దరు పిల్లల తల్లిగా నా బాధ్యతలు కొనసాగిస్తూనే సమాజానికి నా వంతు సహకారాన్ని అందించాలనే లక్ష్యంతో కొనసాగుతున్నాను. ధనం కన్నా ముందు జీవితాన్ని క్రమశిక్షణాయుతంగా మలుచుకోవడంలోనే విజయం దాగుంది అని నమ్ముతాను. ఆ క్రమశిక్షణే నన్ను నడిపిస్తుందని నమ్ముతాను' అని వివరించారు నీలిమా ఆర్య.

– నిర్మలారెడ్డి

వేస్ట్ టు ప్లేట్


దవీందర్ కుమార్

వంట అందరూ చేస్తారు కానీ, ఎక్కువమంది తినేట్టు, నచ్చేటట్లు చేసిన వారు మాత్రమే చెఫ్‌గా మారతారు. మరింత రుచికరంగా... ఘుమఘుమలాడేలా వినూత్నంగా ఆహారాన్ని తయారు చేసిన వారు పాపులర్ చెఫ్‌గా పేరు తెచ్చుకుంటారు. ఇలా పాపులర్ అయిన అతికొద్దిమంది చెఫ్‌లలో ఒకరే దవీందర్ కుమార్. ప్రొఫెషనల్ చెఫ్‌గా యాభై ఏళ్లు పూర్తి చేసుకుని వేస్ట్ టు ప్లేట్' ఐడియాతో ఇండియాలోనే గాక ప్రపంచంలోని చెఫ్‌లు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

చెఫ్ డీకేగా పేరొందిన దవీందర్ కుమార్ ఢిల్లీ యూనివర్శిటీలో కామర్స్ డిగ్రీ పూర్తయ్యాక ప్రొఫెషనల్ డిగ్రీ చేయాలనుకున్నారు. అప్పట్లో పెద్దగా ప్రొఫెషనల్ కోర్సులు అందుబాటులో లేవు. తన స్నేహితుడు ఒబెరాయ్ హోటల్‌లో పనిచేస్తుండడంతో తను కూడా హోటల్‌లో చేరాలనుకున్నాడు. ఇంట్లో ఎవరికీ ఇష్టంలేకపోయినప్పటికీ 'ఒబెరాయ్ సెంటర్ ఆఫ్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్'లో చేరాడు. మూడేళ్ల కిచెన్ మేనేజ్‌మెంట్ డిప్లొమా ప్రోగ్రామ్ పూర్తి చేసిన తరువాత.. ఒబెరాయ్ హోటల్‌లో పర్మనెంట్ ఉద్యోగి అయ్యాడు. దీంతో దవీందర్ చెఫ్ ప్రయాణం మొదలైంది. ఫ్రెంచ్ భాషపై ఉన్న ఆసక్తితో ఫ్రెంచ్ వంటకాలను సైతం నేర్చుకునేవాడు. ఆసక్తి మరింత ఎక్కువ కావడంతో పారిస్‌లోని టెక్నిక్ డీ హోటలియర్‌లో రెండేళ్లపాటు శిక్షణ తీసుకున్నాడు. తనకిష్టమైన వంటలన్నీ నేర్చుకుంటూ, మరోపక్క చెఫ్‌గా రాణిస్తూ ఒబెరాయ్ గ్రూప్‌లో 12 ఏళ్లపాటు పనిచేశాడు. ఆ తరువాత 1985లో 'లీ మెరిడియన్'లో టీమ్ సభ్యుడిగా చేరాడు. అంచెలంచెలుగా ఎదుగుతూ నేడు మెరిడియన్ హోటల్స్ వైస్ ప్రెసిడెంట్‌గానేగాక, ఎగ్జిక్యూటివ్ చెఫ్‌గా పనిచేస్తున్నారు. ఇండియన్ కలినరీ ఫోరమ్‌కు (ఐసీఎఫ్)కు ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



తొక్కలతో...

చెఫ్‌గా ఎంతో అనుభవం ఉన్న దవీందర్ కుమార్ ఒక రోజు టీవీలో వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ చూస్తున్నారు. ''ప్రపంచంలో ఉత్పత్తి అవుతోన్న ఆహారంలో మూడు వంతులు తినకముందే వ్యర్థంగా పోతుంది. ఒక్కో హోటల్లో పండ్లు, కూరగాయల నుంచి తయారు చేసే వంటకాల్లో కనీసం ఐదు నుంచి పది శాతం వ్యర్థంగా పోతుంది'' అని చెప్పారు. ఇది చూసిన దవీందర్‌కు వ్యర్థాల నుంచి కూడా ఆహారం తయారు చేయవచ్చన్న ఆలోచన వచ్చింది. అదే వేస్ట్ టు ప్లేట్.

అనుకున్న వెంటనే పన్నెండు రెస్టారెంట్లు, ఐదు ఫైవ్ స్టార్ హోటళ్ల నుంచి పండ్లు, కూరగాయ వ్యర్థాలను సేకరించడం మొదలు పెట్టారు. అలా సేకరించిన వాటిని శుభ్రం చేసి రంగు, రుచికి తగ్గట్టుగా వేరు చేసి, పోషకాలతో కూడిన డిష్‌లను తయారు చేసి కస్టమర్లకు వేడి వేడిగా వడ్డించారు వీటిని తిన్న వారు ఇష్టపడడంతో వేస్ట్ టు ప్లేట్‌ను కొనసాగిస్తున్నారు. ఈ ఫుడ్ వ్యర్థాల్లో కూరగాయ, పండ్లతొక్కలు, కొమ్మలు, కాడలు, విత్తనాలు కూడా ఉన్నాయి.

స్పెషల్ మెనూ..

వ్యర్థాల నుంచి తయారు చేసే రుచికరమైన వంటలతో ఏకంగా స్పెషల్ మెనూని అందిస్తున్నాడు చెఫ్ డీకే. ఈ మెనూలో పనసపండు విత్తనాలు, బాదం హల్వా, సెలెరీ, పాలకూర సలాడ్, యాపిల్ పల్ప్ పై, బ్రొకలీ, పుదీనా కాడల ముక్కల చట్నీ, జ్యూస్ తీయగా మిగిలిపోయిన బీట్‌రూట్‌తో రసం, క్యారట్ తొక్కల సలాడ్‌వంటివి ఉన్నాయి. ఈ డిష్‌లు రుచిగా, శుచిగానేగాక పుష్కలంగా పోషకాలు ఉండేలా వడ్డించడం విశేషం.

కుక్ బుక్స్..

కొత్త వంటలని కనిపెట్టడమేగాక తను చేసే వంటలతో చాలా కుక్‌బుక్స్‌ను రాశాడు చెఫ్ డీకే. ఈ బుక్స్‌లో 'కబాబ్ చట్నీ అండ్ బ్రెడ్', జస్ట్ కబాబ్: ఫర్ 365 కబాబ్స్ అండ్ లీప్ ఇయర్', సూప్స్, ఫోర్ సీజన్స్, సీజనల్ సలాడ్, సెకండ్ మీల్స్ వంటివి ఉన్నాయి. పుస్తకాల్లో కొన్నింటికి గౌరవ సత్కారాలు కూడా అందుకున్నారు. లీ మెరిడియన్ పదో వార్షికోత్సవం సందర్భంగా 7500 కేజీల కేక్‌ను తయారు చేసి లిమ్కాబుక్ రికార్డుల్లో నిలిచారు. అంతర్జాతీయ మెడల్స్‌తోపాటు, గోల్డెన్ హ్యాట్ చెఫ్ అవార్డు, భారత పర్యాటక మంత్రిత్వ శాఖతో బెస్ట్ చెఫ్ ఆఫ్ ఇండియా అవార్డు, జాతీయ టూరిజం అవార్డులను అందుకున్నారు.

బ్యూటిప్స్



సమస్యలు తగ్గించే ఆమ్లా ఆయిల్

మూడు టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనెను వేడిచేయాలి. నూనె చక్కగా వేడెక్కిన తరువాత రెండు టేబుల్ స్పూన్ల ఉసిరిపొడి వేసి కలపాలి. సన్నని మంటమీద మరో ఐదు నిమిషాలు మరగనిచ్చి దించేయాలి. నూనె చల్లారాక గాజుసీసాలో వేసి నిల్వచేసుకోవాలి. రాత్రి పడుకునేముందు ఈ నూనెను జుట్టు కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించి మర్దన చేసుకోవాలి. వారంలో కనీసం నాలుగుసార్లు ఈ నూనెతో మర్దన చేయడం వల్ల జుట్టు సమస్యలు తగ్గుముఖం పట్టి ఒత్తుగా పెరుగుతుంది.



మృదువుగా మార్చే క్రీమ్

టేబుల్ స్పూను పెట్రోలియం జెల్లీలో టేబుల్ స్పూను కొబ్బరి నూనె వేసి, టేబుల్ స్పూను గ్లిజరిన్, ఐదారు చుక్కల నిమ్మరసం వేసి క్రీమ్‌లా మారేంతవరకు బాగా కలపాలి. తరువాత ఈ క్రీమ్‌ను పగిలిన పాదాలకు రాసి మర్దన చేయాలి. రోజుకు రెండుసార్లు ఈ క్రీమ్‌ను అరికాళ్లకు రాస్తే పగుళ్లు తగ్గి పాదాలు కోమలంగా, మృదువుగా మారతాయి.

మెహందీలో ఇవి కలిపితే...



- జుట్టుకు మెహందీ పెట్టుకునేటప్పుడు అరటిపండుని కలిపితే కురులకు మరిన్ని పోషకాలు అందుతాయి. అరటి పండులోని యాంటీ ఆక్సిడెంట్స్ మాడు దురదను తగ్గిస్తాయి. అరటిపండుని మెత్తగా చిదుముకుని మెహందీలో వేసి కలపాలి. ఈ మెహందీని జుట్టుకి పట్టించి గంట తరువాత కడిగేయాలి.



- కొబ్బరిపాలను కొద్దిగా వేడి చేసి కొన్ని చుక్కలు ఆలివ్ ఆయిల్‌ను వేసి కలపాలి. ఈ పాలను మెహందీలో వేసి బాగా కలిపి జుట్టుకు పట్టించాలి. గంట తరువాత షాంపుతో తలస్నానం చేయాలి. వారానికి రెండుసార్లు ఈ విధంగా చేస్తే... కొబ్బరి పాలలోని లారిక్ ఆమ్లం మంచి యాంటీబయోటిక్‌గా పనిచేసి, మాడు సంబంధ సమస్యలను తగ్గిస్తుంది. కండీషనర్స్, షాంపులలో కొబ్బరిపాలను వాడతారు. ఇలా మెహందీలో కొబ్బరిపాలు కలపడం వల్ల మెహందీ మంచి కండీషనర్‌గా పనిచేస్తుంది.



- టేబుల్ స్పూను హెన్నా, టేబుల్ స్పూను ముల్తానీ మట్టిని తీసుకుని నీటిలో నానబెట్టి పేస్టులా చేయాలి. ఈ పేస్టుని తలలో బాగా దురదపెడుతోన్న భాగంలో రాసి, అరగంట తరువాత కడిగేయాలి. ఇలా చేయడం వల్ల చుండ్రు సమస్య తగ్గుముఖం పడుతుంది.

జుట్టుకు కలిముద్ర..



జుట్టు రాలిపోతుందని చాలా మంది బాధపడుతుంటారు. ఒత్తుగా జుట్టు పెరిగేందుకు చేయని ప్రయత్నమంటూ ఉండదు. అయితే జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు తింటూ కలిముద్ర వేస్తే చక్కటి జుట్టు వస్తుందని నిపుణులు చెబుతున్నారు. కలిముద్ర జుట్టు సమస్యలను తొలగించి ఒత్తుగా పెరిగేలా చేస్తుంది.

ఇలా వేయాలి..

– రెండు అరిచేతులను ఎదురుగా తీసుకురావాలి. ముందుగా చూపుడు వేళ్లను ఒకదానికి ఒకటి ఎదురుగా తీసుకువచ్చి కలిపి ఉంచాలి. బొటన వేళ్లు, మిగతా వేళ్లను వ్యతిరేక దిశలో పెనవేసుకున్నట్టుగా పెట్టాలి (ఫోటోలో చూపిన విధంగా). ఇలా పెట్టిన చేతులను ఐదు నుంచి పదినిమిషాల వరకు ఉంచాలి. రోజుకొకసారి ఈ ముద్ర వేస్తే ఫలితం త్వరగా కనిపిస్తుంది.



ఫస్ట్ టైమ్

ప్రపంచం మెచ్చిన సైంటిస్ట్

'క్వాంటమ్' అనే మాటకు ప్రతిధ్వనిగా 'అంతులేని వేగం' 'అపారమైన శక్తి' అనే శబ్దాలు వినిపిస్తాయి. దేశ పురోగతిని మార్చే శక్తి క్వాంటమ్ సాంకేతికతకు ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని మన దేశంతో సహా ప్రపంచంలోని ఎన్నో దేశాలు క్వాంటమ్ సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాయి. శాస్త్రవేత్తల విషయానికి వస్తే... ప్రొఫెసర్ ఊర్వశీ సిన్హా క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్, క్వాంటమ్ ఫండమెంటల్స్ అండ్ ఇన్‌ఫర్‌మేషన్ ప్రాసెసింగ్‌లాంటి కట్టింగ్–ఎడ్జ్ టెక్నాలజీలో అందె వేసిన చేయిగా పేరు తెచ్చుకుంది. బెంగళూరులోని రామన్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఆర్‌ఆర్‌ఐ)లోని క్వాంటమ్ ఇన్‌ఫర్‌మేషన్ అండ్ కంప్యూటింగ్ ల్యాబ్‌లో పని చేస్తున్న ప్రొఫెసర్ ఊర్వశీ సిన్హా తాజాగా పరిశోధకులను ప్రోత్సహించడానికి ఏర్పాటైన కెనడా ఎక్స్‌లెన్స్ రిసెర్చ్ చైర్ (సీఈఆర్‌సీ) ప్రోగ్రామ్‌కి ఎంపికైంది. సీఈఆర్‌సీకి ఎంపికైన తొలి ఇండియన్‌గా తన ప్రత్యేకత చాటుకుంది. ఈ ప్రోగ్రామ్ ద్వారా 8 సంవత్సరాలకు గాను 8 మిలియన్ డాలర్లు అంటే సుమారుగా 66 కోట్ల 69 లక్షల రూపాయలను గెలుచుకుంది.

సంప్రదాయ కంప్యూటర్ సంవత్సరాల్లో చేసే పనిని క్వాంటమ్ కంప్యూటర్ నిమిషాల వ్యవధిలో పూర్తి చేస్తుంది. సూపర్ కంప్యూటర్ కంటే క్వాంటమ్ కంప్యూటర్ ఎన్నోరెట్లు వేగంగా పనిచేస్తుంది. గూగుల్, ఐబీఎం... మొదలైన సాంకేతిక దిగ్గజాలు ప్రత్యేకంగా క్వాంటమ్ కంప్యూటింగ్ సిస్టమ్‌లను ఏర్పాటు చేసుకున్నాయి. 'క్వాంటమ్ టెక్నాలజీ' అనేది ఇప్పుడు హాట్ టాపిక్.

మన దేశం విషయానికి వస్తే క్వాంటమ్ టెక్నాలజీ అనగానే గుర్తు వచ్చే పేరు ఊర్వశీ సిన్హా.

లండన్‌లో పుట్టి పెరిగింది సిన్హా. యూనివర్శిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్‌లో చదువుకుంది. సూపర్‌కండక్టింగ్ డివైజ్‌లపై పరిశోధనలు చేసింది. పోస్ట్ డాక్టోరల్ రిసెర్చ్ కోసం కెనడాలోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ క్వాంటమ్ కంప్యూటింగ్(ఐక్యూసీ)కు వెళ్లింది. క్వాంటమ్ ఆప్టిక్స్‌లో పరిశోధనలకు ఇంటర్నేషనల్ కమీషన్ ఫర్ ఆప్టిక్స్(ఐసీవో) నుంచి అవార్డ్ అందుకుంది.


ప్రొఫెసర్ ఊర్వశీ సిన్హా



చిన్నప్పుడు కాల్పనిక కథల కంటే శాస్త్రీయ విషయాలు, గణితంపై ఎక్కువగా ఆసక్తి ప్రదర్శించేది. ఒకవిధంగా చెప్పాలంటే సైంటిస్ట్ కావాలని చిన్నప్పుడే డిసైడై పోయింది. తల్లిదండ్రులు బాగా ప్రోత్సహించేవారు. క్వాంటమ్ ఫిజిక్స్‌పై సిన్హాకు ప్రత్యేక ఆసక్తి. బ్యాచులర్స్, మాస్టర్స్ డిగ్రీ చేస్తున్నప్పుడు ఫండమెంటల్ సబ్జెక్ట్‌గా క్వాంటమ్ ఫిజిక్స్‌ను బోధించేవారు. అలా మొదలైన ఆసక్తి అంతకంతకూ పెరుగుతూ పోయింది. 'నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది' అనుకునేది సిన్హా.

'క్వాంటమ్ ఫిజిక్స్‌పై ఆసక్తి అధికమవుతున్న కాలంలో బంగారంలాంటి అవకాశం వచ్చింది. పోస్ట్ డాక్టోరల్ రిసెర్చ్‌లో భాగంగా క్వాంటమ్ ఆప్టిక్స్‌కు చేరువ కావడం నా కెరీర్‌కు ఎంతో మేలు చేసింది. నేను ఎన్నో కొత్త విషయాలు నేర్చుకోవడానికి అవకాశం ఇచ్చింది. ఆసక్తిని, ఉత్సాహాన్ని పెంచింది. ఇక అప్పటి నుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు' అంటుంది సిన్హా..

గొప్ప అవకాశం

సైన్స్ అనే దానికి సరిహద్దులు లేవు. అది ప్రపంచ భాష. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఒకరికొకరు సహకరించుకుంటూ వెళ్లడం ద్వారానే సైన్స్‌ను ముందుకు తీసుకువెళ్లగలం. సైన్స్ పురోగతికి నా వంతు కృషి చేస్తాను... అనే మాటలను సీఈఆర్‌సీ ఇచ్చిన అవకాశం ద్వారా ఆచరణరూపం కల్పించే అవకాశం దొరికింది. ఇండియా, కెనడాలలో సమాంతరంగా క్వాంటమ్ ఎకో సిస్టమ్ అభివృద్ధిపై కృషి చేయడానికి ఇదొక గొప్ప అవకాశం.

– ఊర్వశీ సిన్హా, సైంటిస్ట్

బెంగళూరులోని రామన్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లోని 'క్వాంటమ్ ఇన్‌ఫర్‌మేషన్ అండ్ కంప్యూటింగ్ ల్యాబ్' క్వాంటమ్ ఇన్‌ఫర్‌మేషన్ ప్రాసెసింగ్ కోసం మన దేశంలో ఏర్పాటు చేసిన తొలి ల్యాబ్. ఈ ల్యాబ్‌లో క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్‌కు సంబంధించి ఎన్నో పరిశోధనలు చేసింది సిన్హా.

'మన దేశంలో శాస్త్రీయరంగం పురోగతిని నా కాలేజీ రోజుల నుంచి చూస్తున్నాను. ఉన్నత స్థాయి పరిశోధనలకు ఇప్పుడు తగినన్ని నిధులు అందుబాటులో ఉన్నాయి. విదేశీ కంపెనీల నుంచి రకరకాల పరికరాలు ఆలస్యంగా అందుతున్నాయనే ఫిర్యాదు ఇప్పుడు వినిపించడం లేదు. స్థూలంగా చెప్పాలంటే శాస్త్రీయ పరిశోధనకు ఇప్పుడు నిధులు అనేవి ప్రధాన సమస్య కాదు. మన సమాజం శాస్త్రీయ సమాజంగా ఎదగాలంటే సాంకేతిక పరిజ్ఞానంలో పురోగతి కనిపించాలి. అందుకు మౌలిక సూత్రాలపై అవగాహన పెంచుకోవాలి' అంటుంది సిన్హా.

బాల్యం నుంచి శాస్త్రీయపథంలో పయనిస్తున్న ఊర్వశీ సిన్హా 34 మంది ప్రముఖ గ్లోబల్ సైంటిస్ట్‌లలో ఒకరిగా నిలిచింది.

హెల్త్ టిప్స్



కొంతమందికి నిద్రలేవడంతోనే విపరీతంగా తుమ్ములు వస్తుంటాయి. అలాంటి వారు తులసి, పుదీనా, రెండు మిరియపు గింజలు నిమ్మరసం కలిపి కషాయం లాగా చేసుకొని రోజూ ఒక కప్పు కషాయం తీసుకుంటుంటే నెలరోజుల్లో సమస్య తీరిపోతుంది. ఇవి అందుబాటులో లేనపుడు తుమ్ములు వస్తుంటే కొత్తిమీర వాసన చూస్తూ ఉండండి . తుమ్ములు ఆగుతాయి. ఇది తాత్కాలికంగా పనిచేస్తుంది. పైన చెప్పిన కషాయం పూర్తి ఉపశమనం ఇస్తుంది.



వామును దోరగా వేయించి మెత్తని పొడిగా నూరి ఉదయ, సాయంకాలాలు భోజనానికి అర చెంచాడు పుచ్చుకోవాలి.



ఇంగువను దోరగా వేయించి, పొడి చేసుకొని పావుచెంచాడు మోతాదుగా వేడి అన్నంతో, మొదటి ముద్దతో కలిపి తీసుకుంటే పొట్ట ఉబ్బరింపు బాధించదు.





ఎక్కిళ్ళు ఎక్కువగా వచ్చే వాళ్ళు పావు చెంచా శొంఠిపొడి, పావు చెంచా కరక్కాయ పొడి రెండింటిని ఒక కప్పు వేడినీటిలో కలిపి రెండుపూటలా సేవిస్తూ ఉంటే దగ్గు, దమ్ము, ఎక్కిళ్ళు తగ్గిపోతాయి.





ఆరోగ్యానికి చప్పట్లు

ఎవరైనా ఏదైనా మంచి పని చేసినప్పుడు, వారు చేసిన పని హర్షణీయంగా... ప్రశంసార్హంగా అనిపించినప్పుడు వారిని మెచ్చుకుంటూ చప్పట్లు కొడతాం.. అయితే అలా చప్పట్లు కొట్టడం వెనుక ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. వాటికే 'క్లాపింగ్ థెరపీ' అని పేరు. చప్పట్లు కొట్టడం వల్ల ఎన్ని ప్రయోజనాలున్నాయో చూద్దాం...

సాధారణంగా ఎవరినైనా అభినందిస్తున్నప్పుడు చప్పట్లు కొడతాం. అది ప్రశంసలో ఒక భాగం. కానీ చప్పట్లు కొట్టడం వెనుక చాలామందికి తెలియని ఆరోగ్య ప్రయోజనాలెన్నో ఉన్నాయి. 'లాఫింగ్ థెరపీ' మాదిరిగానే 'క్లాపింగ్ థెరపీ' కూడా ఇప్పుడు ఫేమస్ అయ్యింది. క్లాపింగ్ థెరపీ వల్ల ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయంటే..

* * *

మనిషి శరీరంలో ప్రతి అవయవం ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటుంది. అరచేతులు రక్తనాళాలు, నరాల చివరలకు కేంద్రం. మీరు వాటిని ఉత్తేజపరిస్తే మీ ఆరోగ్య సమస్యలు నయం అవుతాయి. ఆశ్చర్యం అనిపించినా ఇది నిజం. అయితే చప్పట్లు కొట్టడం వల్లే ఆరోగ్యం విషయంలో అనేక ప్రయోజనాలు ఉన్నాయి.

* * *

చప్పట్లు కొట్టడం ఆందోళనను నియంత్రించడానికి సులభమైన మార్గం. చప్పట్లు కొట్టడం ప్రారంభించగానే మెదడుకి సానుకూల సంకేతాలు వెళ్తాయి. ఇది నిరాశను పోగొడుతుంది. సంతోషకరమైన హార్మోన్లను పెంచడానికి రోజువారి వ్యాయామంలో చప్పట్లు కొట్టడాన్ని కూడా భాగంగా చేసుకోవాలి.

* * *

కరతాళ ధ్వనులు చేయడం వల్ల రక్తపోటు స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. తద్వారా గుండె ఆరోగ్యం బాగుంటుంది. చప్పట్లు కొట్టినపుడు శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ఇది అనేక గుండె సమస్యలను తగ్గిస్తుంది. అంతే కాదు, చప్పట్లు కొట్టడంతో శ్వాస సమస్యలు కూడా తగ్గుతాయని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి.

* * *

చప్పట్లు కొట్టడం వల్ల తెల్ల కణాల ఉత్పత్తి పెరిగి రోగ నిరోధక శక్తి పెరుగుతుందని రుజువైంది. ఫలితంగా కాలానుగుణంగా వచ్చే అనేక వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. పిల్లలు క్రమం తప్పకుండా చప్పట్లు కొట్టడం వల్ల వారిలో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత మెరుగవడంతో పాటు వారి చేతి రాతలో తప్పులు దొర్లకుండా ఉంటాయి.

* * *

చప్పట్లు కొట్టడం వల్ల జుట్టు రాలే సమస్య అదుపులోకి వస్తుంది. అయితే కొన్ని ప్రత్యేకమైన ఫలితాలను ఆశిస్తూ చప్పట్లు కొట్టే ముందు అరచేతులకు కొద్దిగా ఆవ నూనె లేదా కొబ్బరి నూనె రాసుకోవడం మెరుగైన ఫలితాన్ని ఇస్తుంది. అరచేతుల్ని నిటారుగా ఉంచి.. చేతివేళ్లు ఒకదానికొకటి తాకేలా ఉంచి చప్పట్లు కొట్టాలి. మంచి ఫలితాల కోసం ఉదయం పూట కొట్టడం మంచిదట. లేదంటే ఎవరి వీలును బట్టి వారు ఈ క్లాపింగ్ థెరపీని అనుసరించవచ్చు.



కురులకు మామిడి ఆకులు

నోరూరించే మామిడి పళ్లు తినాలంటే వేసవి వచ్చేవరకు ఎదురు చూడక తప్పదు. అయితే మామిడి ఆకులు కోసుకోవడానికి ఎప్పుడూ ఇబ్బంది ఉండదు. అందుకే వివాహాది శుభకార్యాలు, పండుగలు, పర్వదినాలలో గుమ్మాలకు మామిడాకు తోరణాలు కట్టుకుంటూనే ఉన్నాం. ఇంతేనా? జుట్టు ఒత్తుగా, పొడవుగా పెరగడానికి, ఆరోగ్య సంరక్షణకు కూడా మామిడి ఆకులు ఉపయోగపడతాయని పరిశోధకులు చెబుతున్నారు. మామిడి ఆకులలో జుట్టు కుదుళ్ల బలంగా ఉండటానికి అవసరం అయ్యే కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచే ఎ, ఇ, సి విటమిన్లు ఉండటం వల్ల ఇది సాధ్యం అవుతుందని పరిశోధనలు రుజువు చేస్తున్నాయి.

మామిడాకులలో పైన చెప్పుకున్న విటమిన్లతోపాటు యాంటీఆక్సిడెంట్లు కూడా సమృద్ధిగా ఉండటం వల్ల వీటిని ఉపయోగించిన వారికి జుట్టు బాగా పెరుగుతుంది. అంతే కాదు... తలపై మామిడి ఆకులను ఉంచి, వాటిని కప్పుతూ ఏదైనా పలుచని క్లాత్‌ను కట్టుకోవడం ద్వారా తలనొప్పి తగ్గుతుంది. తలలో రక్తనాళాలు దెబ్బతినకుండా ఉంటాయి. రక్త ప్రసరణ పెరుగుతుంది. ● మామిడి ఆకుల్లో ఉండే సహజ తైలాలు జుట్టు సంరక్షణకు ఉపకరిస్తాయి. మామిడి ఆకుల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు జుట్టు నెరవకుండా, బలహీనంగా మారకుండా ఉంచుతాయి.

● మామిడి ఆకులను ఉపయోగించడం వల్ల ఎటువంటి దుష్ఫలితాలూ లేకుండా జుట్టు నల్లగా, ఒత్తుగా తయారవుతుంది. మామిడి ఆకులలో ఉండే ఫ్లేవనాయిడ్లు జుట్టును సహజంగా నల్లగా మార్చడంలో , నిగారింపు వచ్చేలా చేయడంలో సహాయపడతాయి.

ఎలా ఉపయోగించాలి?

తాజా మామిడి ఆకులు కొన్ని తీసుకుని కాసిని నీళ్ల చేర్చి మిక్సీలో వేసుకుని లేదా రుబ్బుకుని పేస్ట్‌లా చేసుకోవాలి. దానికి పెరుగు లేదా ఆలివ్ నూనెను చేర్చాలి. ఈ పేస్ట్‌ను చివళ్ల నుంచి కుదుళ్ల వరకు పట్టించాలి. ఆరేదాకా ఉంచి, ఆ తరవాత మైల్డ్ షాంపూతో స్నానం చేయాలి.

● మామిడి ఆకులను ఎండలో ఎండబెట్టి మెత్తగా పౌడర్ లా చేసుకోవాలి. తరువాత పేస్ట్ లా చేసుకుని బ్లాక్ టీని కలిపి మిశ్రమంలా తయారు చేసుకోవాలి. ఇలా తయారైన మిశ్రమాన్ని జుట్టు కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించాలి. ఇలా చేస్తే జుట్టుకు మంచి పోషణ అందటంతోపాటు నల్లగా మారుతుంది.

● మధుమేహంతో బాధపడేవారు కొన్ని మామిడి ఆకులను శుభ్రంగా కడిగి నీళ్లలో ఉడకబెట్టి కషాయంలా కాచుకోవాలి. గోరువెచ్చగా అయ్యాక వడపోసి తాగాలి. ఇలా క్రమం తప్పకుండా కొన్ని రోజులపాటు చేయడం వల్ల మధుమేహం అదుపులోకి వస్తుంది.

చలితో చెలిమి...

ప్రస్తుతం వాతావరణంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయి. దీని ప్రభావం మన చర్మంపై కూడా కనిపిస్తోంది. మార్పు, వాతావరణం కారణంగా, చర్మం పగుళ్లు మొదలవుతుంది. సకాలంలో జాగ్రత్త తీసుకోకపోతే కొన్ని రోజుల తర్వాత అది మరింత తీవ్రమవుతుంది. ఈ సమస్యను నివారించడానికి మన పెద్దలు కొన్ని గృహ చిట్కాలను పాటించేవారు. అవేమిటో తెలుసుకుందాం.



పూర్వం చలికాలం రాగానే పెద్దవాళ్లు వంటికి వెన్నపూస లేదా నువ్వులనూనెను రాసుకుని ఎండలో కాసేపు నిలబడేవారు. దాంతో చర్మానికి తగిన పోషకాలు అంది తేమను కోల్పోకుండా మృదువుగా ఉండేది. ఇప్పుడు కూడా మనం అలా చేయవచ్చు. వాటితో పాటు మరికొన్ని చిట్కాలు చూద్దాం.



చర్మానికి కలబంద: అలోవెరా జెల్ అంటే కలబంద గుజ్జు చర్మానికి చేసే మేలు అంతా ఇంతా కాదు. ఇది ఎల్లప్పుడూ చర్మానికి మంచి నేస్తం వంటిది. అలోవెరాలో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు ఉండటం వల్ల ఇది చర్మాన్ని మృదువుగా ఉంచడంలోనూ, గాయాలను నయం చేయడానికీ సహాయపడుతుంది. దీనికోసం చేయవలసిందల్లా రాత్రి పూట కాసింత కలబంద గుజ్జు... అదేనండీ... అలోవెరా జెల్‌తో ముఖానికి, శరీరానికి సున్నితంగా మసాజ్ చేస్తే సరి. తప్పకుండా మంచి ఫలితం ఉంటుంది.

కొబ్బరినూనె: తలకే కాదు. ఒంటికి కూడా... కొబ్బరినూనెను కేవలం తలకు మాత్రమే రాసుకునే తైలంగా చూస్తారు చాలామంది. అయితే కొబ్బరి నూనె చర్మానికి కూడా చాలా ప్రయోజనకరమైనది. స్వచ్ఛమైన కొబ్బరినూనెను తీసుకుని ఒంటికి, ముఖానికి సున్నితంగా మసాజ్ చేయాలి. పడుకునే ముందు లేదా స్నానానికి అరగంట ముందు ఇలా చేస్తే చికాకు, అసౌకర్యం లేకుండా ఉంటుంది.





అదేవిధంగా రోజూ పడుకునే ముందు స్వచ్ఛమైన నేతిని చర్మానికి రాసుకుంటూ ఉంటే కొద్దిరోజుల్లోనే చర్మం కోమలంగా... మృదువుగా నిగారింపును సంతరించుకుంటుంది. .

ఆవనూనె: పొడి బారిన చర్మాన్ని తిరిగి కాంతిమంతంగా మార్చుకోవడానికి ఆవనూనెను చర్మంపై అప్లై చేయడం సర్వసాధారణం. దీనివల్ల చర్మం ఆరోగ్యంగా ఉండడంతోపాటు చర్మ సమస్యలు ఏవీ రావు.

పిల్లలకు రోజూ బేబీ ఆయిల్ లేదా వెన్న, నెయ్యి లేదా నువ్వులనూనెను ఒంటికి రాసి ఎండలో ఆరిన తర్వాత స్నానం చేయిస్తే చర్మం మృదువుగా ఉండడంతోపాటు ఎముకలు దృఢత్వాన్ని సంతరించుకుంటాయి. చలికాలంలో ఇలా చేయడం మంచిది.

సినిమా రీల్స్

హాయ్ నాన్నతో ప్రేమలో పడతారు - నాని



● చెరుకూరి మోహన్, నాని, శౌర్యువ్, విజయేందర్ రెడ్డి

''సినిమా అనేది నాకు ఆక్సిజన్‌తో సమానం. సినిమా అనేది నిజంగా నా ఊపిరి. ఆ ఊపిరి మీద ఒట్టేసి చెబుతున్నా... డిసెంబర్ 7న మీరంతా(అభిమానులు) ప్రేమలో పడిపోయే 'హాయ్ నాన్న' వస్తోంది.. ఆ బాధ్యత నాది, మా టీమ్‌ది. బాక్సాఫీసు వద్ద హిట్ చేసే బాధ్యత మీది '' అని హీరో నాని అన్నారు.

శౌర్యువ్ దర్శకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'హాయ్ నాన్న'. నాని, మృణాల్ ఠాకూర్ జంటగా బేబీ కియారా ఖన్నా కీలక పాత్రలో నటించారు. వైర ఎంటర్‌టైన్‌మెంట్‌పై మోహన్ చెరుకూరి (సీవీఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో డిసెంబర్ 7న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ విడుదల వేడుకలో నాని మాట్లాడుతూ–''ఇప్పటివరకూ నేను చేసిన సినిమాల్లో నన్ను నేను తెరపై చూసుకున్నప్పుడు 'వీడెవడో బావున్నాడు' అనిపించింది 'హాయ్ నాన్న' సినిమాకే(నవ్వుతూ). శౌర్యువ్ సినిమా బాగా తీశాడు. టీజర్, ట్రైలర్‌లో చూడనిది, ఊహించనిది సినిమాలో బోలెడంత ఉంది'' అన్నారు. ఈ వేడుకలో శౌర్యువ్, మోహన్ చెరుకూరి, విజయేందర్ రెడ్డి, రచయిత కాశి తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సానుజాన్ వర్గీస్, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సతీష్ ఈవీవీ.

డబుల్ ఇస్మార్ట్‌కు మణిశర్మ స్వరాలు



● చార్మీ, మణిశర్మ, రామ్, పూరి జగన్నాథ్

హీరో రామ్, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'ఇస్మార్ట్ శంకర్' (2019) సూపర్‌హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం రామ్, పూరి కాంబినేషన్‌లో 'ఇస్మార్ట్ శంకర్' కి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో సంజయ్ దత్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ముంబైలో జరుగుతోంది. కాగా 'డబుల్ ఇస్మార్ట్' చిత్రానికి మణిశర్మ సంగీతం సమకూర్చనున్నట్లు చిత్రయూనిట్ శనివారం వెల్లడించింది. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'పోకిరి, చిరుత, ఇస్మార్ట్ శంకర్' వంటి హిట్ సినిమాలకు మణిశర్మ సంగీతం అందించిన సంగతి గుర్తుండే ఉంటుంది. పూరి జగన్నాథ్, చార్మీ కౌర్ నిర్మిస్తున్న 'డబుల్ ఇస్మార్ట్' వచ్చే ఏడాది మార్చి 8న విడుదల కానుంది.

వెబ్ ఎంట్రీ



● కీర్తి సురేశ్

కీర్తి సురేశ్, రాధికా ఆప్టే ప్రధాన తారాగణంగా పీరియాడికల్ రివేంజ్ థ్రిల్లర్‌గా 'అక్క' వెబ్‌సిరీస్ రూపొందుతోంది. ధర్మరాజ్ శెట్టిని దర్శకుడిగా పరిచయం చేస్తూ, ఆదిత్యా చోప్రా ఈ వెబ్‌సిరీస్‌ను నిర్మిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ మొదలైనట్లు బాలీవుడ్ సమాచారం. ''ఇందులో కీర్తిసురేష్, రాధికా ఆప్టే పాత్రలు పోటాపోటీగా ఉంటాయి. వీక్షకులను ఆకట్టుకునేలా ఈ సిరీస్ సాగుతుంది'' అనియూనిట్ పేర్కొంది. కాగా కీర్తి సురేష్‌కు తొలి ఓటీటీ ప్రాజెక్ట్ 'అక్క'. వరుణ్‌ధావన్ హీరోగా నటిస్తున్న ఓ బాలీవుడ్ సినిమాలో కీర్తి ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారన్న వార్తలు వస్తున్నాయి.


త్రిషకు మన్సూర్ అలీఖాన్ క్షమాపణ



● మన్సూర్ అలీఖాన్

హీరోయిన్ త్రిషకు ఎట్టకేలకు క్షమాపణ చెప్పారు నటుడు మన్సూర్ అలీఖాన్. ''లియో' సినిమాలో త్రిషతో బెడ్‌రూమ్ సన్నివేశం ఉంటుందనుకున్నాను. అయితే దర్శకుడు అలాంటి సన్నివేశం పెట్టకపోవడం బాధగా అనిపించింది'' అంటూ మన్సూర్ అలీఖాన్ ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఆయన మాటలపై దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేగడంతో చివరికి దిగొచ్చారు మన్సూర్. ''త్రిషపై నాకు ఎలాంటి దురు ద్దేశాలు లేవు. నా వ్యాఖ్యలు త్రిష మనసుకు బాధ కలిగించినందుకు క్షమాపణ చెబుతున్నా. ఆమె పెళ్లికి నేనే స్వయంగా వెళ్లి మంగళసూత్రం ఇచ్చి ఆశీర్వదిస్తాను'' అంటూ పోస్టు పెట్టారు మన్సూర్ అలీఖాన్. దీనికి త్రిష పరోక్షంగా స్పందిస్తూ 'తప్పులు చేయడం మానవ సహజం. క్షమించడం అనేది దైవత్వం వంటిది, అత్యుత్తమమైనది' అంటూ ట్వీట్ చేశారు.

యాక్షన్.. ఎమోషన్



● సోనాక్షి, రాజేశ్వరి ఇంద్రజ, భానుశ్రీ

భానుశ్రీ, సోనాక్షీ వర్మ, అనురాగ్, రోషిణి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కలశ'. కొండ రాంబాబు దర్శకత్వంలో చంద్రజ ఆర్ట్ క్రియేషన్స్‌పై రాజేశ్వరి చంద్రజ వాడవల్లి నిర్మించిన ఈ చిత్రం రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ సినిమా టీజర్‌ని దర్శకుడు సాగర్ చంద్ర రిలీజ్ చేసి, ''టీజర్ బాగుంది. సినిమాలో మంచి యాక్షన్, ఎమోషన్ ఉన్నాయి'' అన్నారు. బ్యానర్‌లోగోను దర్శకుడు వీఎస్ ఆదిత్య, టైటిల్ లోగోను యాట సత్యనారాయణ, మోషన్ పోస్టర్‌ను దర్శకుడు వీరశంకర్ విడుదల చేశారు. అలాగే ఈ సినిమాలోని ఓ పాటను వీఎస్ ఆదిత్య, వీరశంకర్, సాగర్ చంద్ర, యాట సత్యనారాయణ సంయుక్తంగా రిలీజ్ చేశారు. ''బ్రెయిన్‌కి, హార్ట్‌కి లింక్ చేస్తూ రాసుకున్న సినిమా ఇది'' అన్నారు కొండా రాంబాబు. ''ఎలాంటి కట్స్ లేకుండా సెన్సార్ వారు మా సినిమాకు సర్టిఫికెట్ ఇవ్వడం మా తొలి విజయంగా భావిస్తున్నాం'' అన్నారు రాజేశ్వరి చంద్రజ.

విశాఖ ఉక్కు నేపథ్యంలో...

పి.సత్యారెడ్డి లీడ్ రోల్‌లో నటించి, జనం ఎంటర్‌టైన్మెంట్స్‌పై స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఉక్కు సత్యాగ్రహం'. శుక్రవారం సత్యారెడ్డి పుట్టినరోజుని పురస్కరించుకుని ఈ సినిమా ట్రైలర్, పాటల విడుదల వేడుక హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ వేడుకలో పాల్గొన్న చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ–''విశాఖపట్నం ఉక్కు నేపథ్యంలో సత్యారెడ్డి 'ఉక్కు సత్యాగ్రహం' సినిమా తీసుకురావడం చాలా మంచి విషయం'' అన్నారు. దర్శకుడు త్రినాథరావు నక్కిన మాట్లాడుతూ– ''నేనొక కమర్షియల్ డైరెక్టర్ అయినా నాకు ఉద్యమంతో కూడిన, ప్రజా సమస్యలతో కూడిన ఉద్యమాలు చేసే సినిమాలంటే చాలా ఇష్టం. ఈ చిత్రం మంచి విజయం సాధించాలి'' అన్నారు. ''విశాఖ ఉక్కు ఉద్యమానికి సంబంధించిన సమస్యలతో ఈ సినిమా తీశాం'' అన్నారు పి.సత్యారెడ్డి. నిర్మాత దాసరి కిరణ్, దివంగత గాయకులు గద్దర్ కుమార్తె వెన్నెల, నటి ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



● సత్యారెడ్డి, ఝాన్సీ

ఉషా పరిణయం ఆరంభం



● తాన్వీ, శ్రీకమల్

'నువ్వేకావాలి, మన్మథుడు, మల్లీశ్వరి' చిత్రాల ఫేమ్ కె.విజయ్‌భాస్కర్ దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'ఉషా పరిణయం'. 'లవ్ ఈజ్ బ్యూటిఫుల్' అనేది ఉపశీర్షిక. క్రాఫ్ట్ ప్రొడక్షన్స్‌పై కె.విజయ్‌భాస్కర్ స్వీయ దర్శకత్వంలో ఈ మూవీ రూపొందుతోంది. ఈ సినిమా ద్వారా విజయ్ భాస్కర్ తనయుడు శ్రీకమల్ హీరోగా, తెలుగమ్మాయి తాన్వీ ఆకాంక్ష హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. పూజా కార్యక్రమాల అనంతరం హీరో, హీరోయిన్లపై తీసిన సన్నివేశాలతో ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ మొదలుపెట్టారు విజయ్‌భాస్కర్. కుటుంబ సమేతంగా చూడదగ్గ సరికొత్త ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'ఉషా పరిణయం' రూపొందుతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. 'వెన్నెల'కిషోర్, శివాజీ రాజా, ఆమని, సుధ, రజిత ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి సంగీతం: ఆర్‌ఆర్ ధ్రువన్, కెమెరా: సతీష్ ముత్యాల.

సెట్స్‌లో సూర్యకు గాయాలు



● సూర్య

హీరో సూర్య గాయపడ్డారు. ఆయన హీరోగా శివ దర్శకత్వంలో కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్న చిత్రం 'కంగువా'. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో ఓ రోప్ కెమెరా అదుపుతప్పి సూర్య భుజంపై పడడంతో ఆయన గాయపడ్డారని కోలీవుడ్ సమాచారం. దీంతో 'కంగువా' సినిమా చిత్రీకరణను తాత్కాలికంగా నిలిపివేశారు. ''నేను త్వరగా కోలుకోవాలని మీరు (అభిమానులు, ప్రేక్షకులు)పంపుతున్న సందేశాలు నాకు ఉపశమనాన్ని కలిగిస్తున్నాయి.. ఇందుకు ధన్యవాదాలు'' అంటూ ట్వీట్ చేసి, తన గాయాన్ని పరోక్షంగా స్పష్టం చేశారు సూర్య. ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది.

గౌరవంగా భావిస్తున్నా - ఖతిజా



ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్ కుమార్తె ఖతిజా రెహమాన్ 'లయనెస్' అనే అంతర్జాతీయ సినిమాకు సంగీతం అందించనున్నారు. కజ్రీ బబ్బర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో పైగే సంధు, అదితీరావ్ హైదరీ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. భారత్‌కు చెందిన నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ది బ్రిటిష్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ నిర్మిస్తున్నాయి. 'లయనెస్' కు సంగీత దర్శకురాలిగా ఖతిజా రెహమాన్‌ను తీసుకున్నారు మేకర్స్. ఖతిజాకు తొలి అంతర్జాతీయ చిత్రం ఇదే కావడం విశేషం. 'లయనెస్' లో భాగమవడం థ్రిల్లింగ్‌గా ఉంది. గౌరవంగా కూడా భావిస్తున్నాను'' అన్నారు ఖతిజా రెహమాన్.


విక్రమ్ రాథోడ్ వస్తున్నాడు



● విజయ్ ఆంటోనీ

విజయ్ ఆంటోనీ హీరోగా బాబు యోగేశ్వరన్ దర్శకత్వంలో తెరకెక్కిన ద్విభాషా(తెలుగు, తమిళం) చిత్రం 'విక్రమ్ రాథోడ్'. అపోలో ప్రొడక్షన్స్, ఎస్ఎన్ఎస్ మూవీస్ సమర్పణలో రావూరి వెంకటస్వామి, ఎస్.కౌశల్యా రాణి నిర్మించిన ఈ చిత్రాన్ని డిసెంబరు 1న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమాను తెలుగులో ఒ.బాబూరావు, జీపీఎస్ రెడ్డి విడుదల చేస్తున్నారు. సురేష్ గోపి, రమ్య నంబీశన్, సోనూసూద్, సంగీత ముఖ్యపాత్రలు పోషించిన ఈ సినిమాకు సంగీతం: ఇళయారాజా.

అన్నదమ్ముల భావోద్వేగం



● శంకర్, రాజీవ్ కనకాల

రాజీవ్ కనకాల, 'షకలక'శంకర్, శ్రీతేజ్, ఆక్సాఖాన్, రూపిక ప్రధాన తారాగణంగా కాచిడి గోపాల్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'దళారి'. ఎడవల్లి వెంకట్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రంలోని 'అన్నదమ్ములను..' అంటూ సాగే పాటని నటులు సునీల్, 'సత్యం' రాజేష్, రచయిత కోన వెంకట్ విడుదల చేశారు. ''ఈ సినిమాలో అన్నదమ్ముల మధ్య వచ్చే భావోద్వేగ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అని యూనిట్ పేర్కొంది.

సాక్షి బిజినెస్
శనివారం
25-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▽	48	65,970
నిఫ్టీ ▽	8	19,794

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి 11.30 గంటలకు)

సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	14,242	▽ 24
డోజోన్స్	35,348	△ 75
ఎఫ్‌టీఎస్ఈ 100	7,488	△ 5
డాక్స్	16,029	△ 35
కాంఫై	3,041	▽ 21
నికాయ్	33,626	△ 174

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

	ధర	మార్పు
బంగారం (24 క్యారట్)	60,620	▽ 222
బంగారం (22 క్యారట్)	57,773	▽ 221
వెండి (కిలో)	79,200	▽ 400

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.59	84.26
£	బ్రిటన్ పౌండ్	102.86	106.22
€	యూరో	89.39	95.46
¥	జపాన్ ఎన్ (100)	53.58	54.87
AU$	ఆస్ట్రేలియా డాలర్	53.52	55.90
S$	సింగపూర్ డాలర్	54.31	56.78
SAR	సౌదీ రియాల్	21.28	22.90
UAE D	యూఏఈ దిర్హామ్	21.80	23.59
¥	చైనా యువాన్	10.53	12.61

ఎస్‌ఎంసీకి మారుతీ షేర్ల జారీ

- మారుతీలో సుజుకీ మోటార్ వాటా అప్
- సుజుకీ గుజరాత్ ప్లాంట్ మారుతీ చేతికి



న్యూఢిల్లీ: మాతృ సంస్థ సుజుకీ మోటార్ కార్పొరేషన్(ఎస్‌ఎంసీ)కి ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన ఆటో రంగ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా 1.23 కోట్ల షేర్లను జారీ చేయనుంది. ఇందుకు తాజాగా కంపెనీ బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు మారుతీ వెల్లడించింది. దీంతో సుజుకీ మోటార్ గుజరాత్(ఎస్‌ఎంజీ)లో 100 శాతం వాటాను మారుతీ సొంతం చేసుకోనుంది. ఎస్‌ఎంజీలో ఎస్‌ఎంసీకిగల వాటాను సొంతం చేసుకునే బాటలో మారుతీ.. ప్రిఫరెన్షియల్ షేర్ల కేటాయింపునకు తెరతీసిన సంగతి తెలిసిందే. ఇందుకు గత వారం వాటాదారులు సైతం ఆమోదముద్ర వేశారు. వెరసి రూ. 5 ముఖ విలువగల ఒక్కో షేరునీ దాదాపు రూ. 10,421 ధరలో ఎస్‌ఎంసీకి మారుతీ జారీ చేయనుంది. ఆర్‌ఎస్‌బీపీ వేల్యుయేషన్స్ అడ్వయిజర్స్ నివేదిక ప్రకారం ఇది రూ. 12,841 కోట్ల విలువకు సమానంకాగా.. షేర్ల కేటాయింపు తదుపరి మారుతీలో ఎస్‌ఎంసీ వాటా ప్రస్తుత 56.48 శాతం నుంచి 58.19 శాతానికి బలపడనుంది. మరోపక్క 100 శాతం వాటాను పొందనుండటంతో మారుతీకి ఎస్‌ఎంజీ పూర్తి అనుబంధ సంస్థగా ఆవిర్భవించనుంది. 2014లో ఎస్‌ఎంసీ రూ. 18,000 కోట్ల పెట్టుబడులతో అనుబంధ సంస్థగా ఎస్‌ఎంజీని ఏర్పాటు చేసింది. వార్షికంగా 7.5 లక్షల యూనిట్ల తయారీ సామర్థ్యం ఎస్‌ఎంజీ సొంతం.

ఈ వార్తల నేపథ్యంలో మారుతీ షేరు బీఎస్‌ఈలో స్వల్పంగా 0.25 శాతం బలపడి రూ. 10,518 వద్ద ముగిసింది.

పతంజలి యోగపీఠ్, భారత ఆర్మీ ఎంవోయూ



న్యూఢిల్లీ: పతంజలి ఇన్‌స్టిట్యూషన్స్, భారత ఆర్మీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా ఔషధ మొక్కలపై పరిశోధన నిర్వహించనున్నారు. అలాగే, భారత ఆర్మీలో విభిన్నమైన ఐటీ అప్లికేషన్లు, ఆటోమేషన్‌పై పని చేయడం కూడా ఈ ఒప్పందంలో భాగంగా ఉంది. సైనికుల ఆరోగ్యం కోసం యోగ, ఆయుర్వేద ఔషధాలపై పతంజలి పరిశోధన నిర్వహించనుంది. మరోవైపు, విశ్రాంత సైనిక ఉద్యోగులను నియమించుకునేందుకు పతంజలి, దాని అనుబంధ సంస్థలు ప్రాధాన్యం ఇవ్వనున్నాయి.

పబ్లిక్ ఆఫర్.. బంపర్ హిట్!

టాటా టెక్ @ 69 రెట్లు



న్యూఢిల్లీ: ఇంజనీరింగ్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ డిజిటల్ సర్వీసుల కంపెనీ టాటా టెక్నాలజీస్ పబ్లిక్ ఇష్యూకి భారీ స్పందన లభించింది. ఇన్వెస్టర్లు క్యూ కట్టడంతో చివరి రోజు శుక్రవారానికల్లా 69 రెట్లు పైగా అధిక సబ్‌స్క్రిప్షన్ లభించింది. కంపెనీ 4.5 కోట్లకుపైగా షేర్లను ఆఫర్ చేయగా.. 312 కోట్లకు పైగా షేర్ల కోసం దరఖాస్తులు వచ్చాయి. అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) విభాగంలో 203 రెట్లు బిడ్స్ దాఖలుకాగా.. సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 62 రెట్లు, రిటైలర్ల నుంచి 17 రెట్లు చొప్పున దరఖాస్తులు లభించాయి. టీసీఎస్ (2004) తదుపరి రెండు దశాబ్దాలకు టాటా గ్రూప్ నుంచి వస్తున్న ఐపీవోకాగా.. షేరుకి రూ. 475–500 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూ ద్వారా రూ. 3,043 కోట్లు అందుకుంది.



ఈ నాలుగు ఇష్యూలకూ గురువారాని (30)కల్లా షేర్ల కేటాయింపు జరిగే వీలుంది. రిఫండ్స్ శుక్రవారం, షేర్లు సోమవారం (4న) రావచ్చు. వచ్చే నెల 5న స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టికానున్నట్లు తెలుస్తోంది.

ఫ్లెయిర్ రైటింగ్.. @ 47 రెట్లు



పెన్నులు, స్టేషనరీ ప్రొడక్టుల కంపెనీ ఫ్లెయిర్ రైటింగ్ ఇండస్ట్రీస్ ఐపీవో చివరి రోజు శుక్రవారానికల్లా 47 రెట్లు అధిక సబ్‌స్క్రిప్షన్‌ను సాధించింది. కంపెనీ 1,44,13,188 షేర్లను ఆఫర్ చేయగా.. 67 కోట్లకు పైగా షేర్ల కోసం దరఖాస్తులు లభించాయి. క్విబ్ విభాగంలో 116 రెట్లు అధిక బిడ్స్ నమోదుకాగా, రిటైలర్ల నుంచి 13 రెట్లు బిడ్స్ దాఖలయ్యాయి.

ఫెడ్‌ఫినా @ 22 రెట్లు



ఫెడరల్ బ్యాంక్ అనుబంధ సంస్థ ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (ఫెడ్‌ఫినా) ఐపీవోకు మంచి స్పందన లభించింది. 5.59 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచగా.. 12 కోట్లకుపైగా షేర్లకు (2.2 రెట్లు) బిడ్స్ వచ్చాయి. క్విబ్ విభాగంలో 3.5 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 1.5 రెట్లు, రిటైలర్ల నుంచి 1.8 రెట్లు అధికంగా దరఖాస్తులు లభించాయి.

గాంధార్ ఆయిల్ @ 64 రెట్లు



ప్రైవేట్ రంగ కంపెనీ గాంధార్ ఆయిల్ రిఫైనరీ (ఇండియా) ఐపీవో చివరి రోజు శుక్రవారానికల్లా 64 రెట్లు అధిక సబ్‌స్క్రిప్షన్‌ను సాధించింది. కంపెనీ 2,12,43,940 షేర్లను ఆఫర్ చేయగా.. 136 కోట్లకుపైగా షేర్ల కోసం దరఖాస్తులు లభించాయి. అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల (క్విబ్) విభాగంలో 129 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 62 రెట్లు, రిటైలర్ల నుంచి 29 రెట్లు చొప్పున బిడ్స్ దాఖలయ్యాయి. దీంతో షేరుకి రూ. 160–169 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 501 కోట్ల మేర నిధులను సమీకరించింది. ఇష్యూలో భాగంగా రూ. 302 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి అదనంగా 1.17 కోట్లకుపైగా షేర్లను విక్రయానికి ఉంచింది.

పేటీఎమ్ నుంచి బెర్క్‌షైర్ ఔట్

2.46 శాతం వాటా విక్రయం

న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపుల దిగ్గజం పేటీఎమ్‌లో గల మొత్తం 2.46 శాతం వాటాను ప్రపంచ ప్రసిద్ధ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ కంపెనీ బెర్క్‌షైర్ హాథవే తాజాగా విక్రయించింది. ఓపెన్ మార్కెట్ ద్వారా పేటీఎమ్ మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్‌లో గల 1.56 కోట్లకుపైగా షేర్లను ఆఫ్‌లోడ్ చేసింది. షేరుకి రూ. 877.29 సగటు ధరలో విక్రయించిన వీటి విలువ దాదాపు రూ. 1,371 కోట్లు. అనుబంధ సంస్థ బీహెచ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ ద్వారా మొత్తం వాటాను విక్రయించింది.



కాగా.. దీనిలో 1.19 శాతం వాటాకు సమానమైన 75,75,529 షేర్లను కాప్తాల్ మారిషస్ ఇన్వెస్ట్‌మెంట్ కొనుగోలు చేయగా.. 42.75 లక్షల షేర్ల(0.67 శాతం వాటా)ను ఘిసల్లో మాస్టర్ ఫండ్ ఎల్‌పీ సొంతం చేసుకుంది. ఇందుకు షేరుకి రూ. 877.2 సగటు ధరలో దాదాపు రూ. 1,040 కోట్లు వెచ్చించాయి.

ఈ నేపథ్యంలో పేటీఎమ్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 3 శాతంపైగా క్షీణించి రూ. 895 వద్ద ముగిసింది.

2 బిలియన్లు ఇన్వెస్ట్ చేస్తాం, కానీ..

- దిగుమతి సుంకాలపరంగా మినహాయింపునివ్వాలి
- భారత్‌లో ప్లాంటు ఏర్పాటుకు టెస్లా ప్రతిపాదన
- పరిశీలిస్తున్న కేంద్రం



ముంబై: అమెరికాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం టెస్లా భారత మార్కెట్లో ప్రవేశించడంపై మరింతగా కసరత్తు చేస్తోంది. భారత్‌లో ప్లాంటు ఏర్పాటుపై 2 బిలియన్ డాలర్ల వరకు (సుమారు రూ. 16,600 కోట్లు) ఇన్వెస్ట్ చేయడానికి తాము సుముఖంగానే ఉన్నామని, అయితే ఈ క్రమంలో తమకు రెండేళ్ల పాటు దిగుమతి సుంకాలపరంగా కొంత మినహాయింపునివ్వాలని కేంద్రాన్ని కోరుతోంది. సుంకాల మినహాయింపులకు, పెట్టుబడి పరిమాణానికి లంకె పెడుతూ కేంద్ర ప్రభుత్వానికి టెస్లా ఓ ప్రతిపాదన సమర్పించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీని ప్రకారం దేశీ మార్కెట్లోకి ప్రవేశించాక రెండేళ్ల పాటు తాము దిగుమతి చేసుకునే కార్లపై సుంకాలను 15 శాతానికే పరిమితం చేయాలని కంపెనీ ప్రతిపాదించింది. 12,000 వాహనాలకు తక్కువ టారిఫ్ వర్తింపచేస్తే 500 మిలియన డాలర్ల దాకా ఇన్వెస్ట్ చేస్తామని, అదే 30,000 వాహనాలకు వర్తింపచేస్తే 2 బిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులను పెంచుతామని టెస్లా పేర్కొన్నట్లు సమాచారం.

జనవరి నాటికి నిర్ణయం..

ప్రధాని కార్యాలయం మార్గదర్శకత్వంలో టెస్లా ప్రతిపాదనను పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య విభాగం (డీపీఐఐటీ), భారీ పరిశ్రమల శాఖ, రోడ్డు రవాణా.. జాతీయ రహదారుల శాఖ, ఆర్థిక శాఖ సంయుక్తంగా మదింపు చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీనిపై వచ్చే ఏడాది జనవరి నాటికి నిర్ణయం తీసుకోవచ్చని పేర్కొన్నాయి. టెస్లాకు మరీ ఎక్కువ వెసులుబాటు ఇవ్వకుండా అదే సమయంలో గరిష్ఠంగా 2 బిలియన్ డాలర్ల పెట్టుబడులను దక్కించుకునేలా మధ్యేమార్గంగా పాటించతగిన వ్యూహంపై కసరత్తు జరుగుతోందని వివరించాయి. ఇదే క్రమంలో తక్కువ టారిఫ్‌లతో టెస్లా దిగుమతి చేసుకోవాలనుకుంటున్న వాహనాల సంఖ్యను కుదించడంతో పాటు పలు విధానాలు పరిశీలనలో ఉన్నట్లు పేర్కొన్నాయి. తక్కువ స్థాయి టారిఫ్‌లను, ఈ ఆర్థిక సంవత్సరంలో దేశీయంగా అమ్ముడయ్యే మొత్తం ఎలక్ట్రిక్ వాహనాల్లో (ఈవీ) 10%కి పరిమితం చేయడం, రెండో ఏడాది దీన్ని 20% మేర పెంచడం వీటిలో ఉంది. భారత్‌లో ఈ ఆర్థిక సంవత్సరం 1,00,000 ఈవీలు అమ్ముడవుతాయన్న అంచనాల నేపథ్యంలో తక్కువ టారిఫ్‌లను, అందులో 10%కి, అంటే 10,000 వాహనాలకు పరిమితం చేయొచ్చని తెలుస్తోంది. దేశీయంగా గత ఆర్థిక సంవత్సరం 50,000 పైచిలుకు ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడయ్యాయి. మరోవైపు, టెస్లా కూడా భారత్‌లో స్థానికంగా జరిపే కొనుగోళ్లను క్రమంగా పెంచుకునే అవకాశం ఉంది. తొలి రెండేళ్లలో మేడిన్ ఇండియా కార్ల విలువలో 20%, ఆ తర్వాత 4 ఏళ్లలో 40% మేర కొనుగోలు చేసేందుకు కంపెనీ అంగీకరించవచ్చని తెలుస్తోంది.

ఐటీ షేర్లకు అమ్మకాల ఒత్తిడి

- మరోసారి స్వల్ప లాభాల ముగింపు
- 66 వేల దిగువకు సెన్సెక్స్
- 19,800 స్థాయిని కోల్పోయిన నిఫ్టీ



ముంబై: ఐటీ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో శుక్రవారం స్టాక్ సూచీలు స్వల్ప నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 48 పాయింట్లు నష్టపోయి 66 వేల స్థాయి దిగువన 65,970 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఎనిమిది పాయింట్లు తగ్గి 19,800 దిగువన 19,794 వద్ద నిలిచింది. ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం మిశ్రమంగా మొదలయ్యాయి. జాతీయ, అంతర్జాతీయంగా ట్రేడింగ్‌ను ప్రభావితం చేసే కీలకాంశాలేవీ లేనందున సూచీలు పరిమిత శ్రేణిలో కదలాడాయి. ఐటీతో పాటు ప్రభుత్వరంగ బ్యాంకులు, కన్జూమర్, ఇంధన షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. మరోవైపు మెటల్, ఫార్మా, ప్రైవేట్ రంగ బ్యాంకులకు చెందిన చిన్న తరహా కంపెనీల షేర్లు రాణించాయి.

- ఈ ఆర్థిక సంవత్సరంలో 4–3 నూతన ఉత్పత్తులను ఆవిష్కరణతో పాటు నూతన వ్యాపార ప్రీమియంలో రెండంకెల వృద్ధిని సాధిస్తామని చైర్మన్ సిద్ధార్థ మొహంతి ధీమా వ్యక్తం చేయడంతో ఎల్‌ఐసీ షేరు 9.50% లాభపడి రూ.678 వద్ద ముగిసింది. లిస్టింగ్ నుంచి ఈ షేరుకిదే అతి పెద్ద ర్యాలీ. ఫలితంగా కంపెనీ మార్కెట్ విలువ ఒక్కరోజులోనే రూ.38 వేల కోట్లు పెరిగి రూ.4.28 లక్షల కోట్లకు చేరింది.
- హిండెన్‌బర్గ్ ఆరోపణలు పరిశీలించాలంటూ కోరుతూ ధాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీం కోర్టు తీర్పు రిజర్వ్ చేయడం అదానీ గ్రూప్‌లోని 10 కంపెనీల షేర్లూ లాభాల్లో ముగిశాయి. ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్ ప్రైజెస్ (2.3%, అదానీ పవర్ 4.06%, అదానీ టోటల్ గ్యాస్ 1.2%, అదానీ ఎనర్జీ సెల్యూషన్స్ 0.84%, అదానీ గ్రీన్ ఎనర్జీ 0.77%, అంబుజా సిమెంట్ 0.31% చొప్పున లాభపడ్డాయి.

సాక్షి స్పోర్ట్స్



అనీశ్ భన్వాలాకు కాంస్యం


ఐఎస్‌ఎస్‌ఎఫ్ వరల్డ్ కప్ ఫైనల్లో భారత షూటర్ అనీశ్ భన్వాలా కాంస్య పతకంతో మెరిశాడు. దోహాలో జరుగుతున్న ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో అనీశ్ 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో మూడో స్థానంలో నిలిచాడు. అనీశ్ 27 పాయింట్లు సాధించగా...పీటర్ ఫ్లోరియాన్ (జర్మనీ–35), లీయూహాంగ్ (చైనా – 33) స్వర్ణ, రజతాలు గెలుచుకున్నారు. తాజా ఫలితంతో వరల్డ్ కప్ సీజన్ ముగింపు ఫైనల్ పోటీల్లో పతకం సాధించిన తొలి భారత షూటర్‌గా హరియాణాకు చెందిన అనీశ్ నిలిచాడు. ఈ ఏడాది చక్కటి ఫామ్‌లో ఉన్న 21 ఏళ్ల ఈ కుర్రాడు వరల్డ్ కప్ సీనియర్ విభాగంలో తన తొలి పతకంతో పాటు ఆసియా చాంపియన్‌షిప్ సీనియర్ విభాగంలోనూ తన తొలి పతకాన్ని గెలుచుకున్నాడు. 2024 పారిస్ ఒలింపిక్స్‌కు కూడా అర్హత సాధించడంలో అతను సఫలమయ్యాడు. మరో వైపు పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఈవెంట్‌లో భారత షూటర్ అఖిల్ షెరాన్ ఐదో స్థానంతో ముగించాడు.

డేవిస్ కప్ సెమీస్‌లో సెర్బియా

- 2–0తో బ్రిటన్‌పై విజయం
- జట్టును గెలిపించిన జొకోవిచ్



మలగ (స్పెయిన్): ప్రపంచ నంబర్‌వన్ టెన్నిస్ ఆటగాడు నొవాక్ జొకోవిచ్ డేవిస్ కప్ క్వార్టర్ ఫైనల్లో కీలకమైన విజయంతో సెర్బియాను సెమీస్‌కు చేర్చాడు. తద్వారా డేవిస్ కప్ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన ఆటగాడిగా ఘనత వహించాడు. టీమ్ ఈవెంట్‌లో గురువారం అర్ధ రాత్రి జరిగిన క్వార్టర్‌ఫైనల్లో సెర్బియా 2–0తో బ్రిటన్‌పై ఘనవిజయం సాధించింది. తొలి సింగిల్స్‌లో లోమిర్ కెమనొవిచ్ (సెర్బియా) 7–6 (7/2), 7–6 (8/6)తో జాక్ డ్రాపెర్ (బ్రిటన్)ను ఓడించగా... రెండో సింగిల్స్‌లో టాప్ ర్యాంక్ ప్లేయర్ జొకోవిచ్ 6–4, 6–4తో కామెరాన్ నోరీ (బ్రిటన్)పై గెలుపొందాడు. 2–0తో ఫలితం తేలడంతో దుసాన్ లాజొవిక్‌తో కలిసి జొకోవిచ్ డబుల్స్ మ్యాచ్ ఆడాల్సిన అవసరం లేకపోయింది. డేవిస్ కప్ టోర్నీల్లో గత మూడేళ్లుగా సెర్బియన్ స్టార్ వరుసగా సాధించిన 21వ విజయమిది. ఓవరాల్‌గా ఈ టీమ్ ఈవెంట్‌లో రికార్డు స్థాయిలో జొకోవిచ్ 44 విజయాలను తన ఖాతాలో వేసుకున్నాడు. కేవలం సింగిల్స్‌నే పరిగణిస్తే జొకోకు ఇది 40వ విజయం అవుతుంది. సెమీస్‌లో సెర్బియా... ఇటలీని ఎదుర్కొంటుంది. మరో క్వార్టర్స్‌లో ఇటలీ 2–1తో నెదర్లాండ్స్‌పై గెలిచింది.



వివాహ బంధంలోకి నవదీప్ సైనీ

భారత క్రికెటర్ నవదీప్ సైనీ శుక్రవారం పెళ్లి చేసుకున్నాడు. తన స్నేహితురాలు స్వాతి అస్థానాను అతను వివాహమాడాడు. దేశవాళీలో ఢిల్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్న పేస్ బౌలర్ సైనీ భారత జట్టు తరఫున 2 టెస్టులు, 8 వన్డేలు, 11 టి20లు ఆడి మొత్తం 23 వికెట్లు పడగొట్టాడు.

సెమీస్‌లో సాత్విక్–చిరాగ్

- క్వార్టర్స్‌లో ఓడిన ప్రణయ్
- చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ



షెన్‌జెన్: భారత స్టార్ షట్లర్లు సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి–చిరాగ్ శెట్టి జోడీ ఈ ఏడాది మరో టైటిల్‌పై కన్నేసింది. చైనా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టాప్ సీడ్ భారత ద్వయం సెమీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. అయితే సింగిల్స్‌లో హెచ్.ఎస్.ప్రణయ్‌కి క్వార్టర్ ఫైనల్లో చుక్కెదురైంది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ జంట 21–16, 21–14తో ఇండోనేసియాకు చెందిన లియో రాలీ కార్నడో–డానియెల్ మార్టిన్ జంటపై అలవోక విజయం సాధించింది. ప్రపంచ ఐదో ర్యాంకు జోడీ అయిన సాత్విక్–చిరాగ్ వరుస గేముల్లో 46 నిమిషాల్లో మ్యాచ్‌ను ముగించింది. తొలి గేమ్‌లో 14–14 స్కోరు దాకా ఇండోనేసియన్ జోడీ నుంచి కొంతవరకు పోటీ ఎదురైనా... ఆ తర్వాత భారత షట్లర్ల ధాటికి ప్రత్యర్థి జంట చతికిలబడింది. తర్వాత రెండో గేమ్‌ను సాత్విక్–చిరాగ్‌లు రెట్టించిన ఉత్సాహంతో మొదలుపెట్టారు. 5–2తో ఆధిక్యంలోకి వెళ్లారు. నెట్‌వద్ద పొరపాట్లతో కొన్ని పాయింట్లు కోల్పోయినప్పటికీ వెంటనే పుంజుకొని ఆడటంతో మళ్లీ ఆధిక్యం 11–6కు పెరిగింది. ఇండోనేసియన్ షట్లర్లు ఆ తర్వాత కోలుకోలేదు. 17–10తో గేమ్‌ను చేతుల్లోకి తెచ్చుకున్న భారత అగ్రశ్రేణి జంట నిమిషాల వ్యవధిలోనే 21–14తో మ్యాచ్‌ను ముగించేశారు. ఈ ఏడాది సూపర్ ఫామ్‌లో ఉన్న భారత జంట ఇండోనేసియా సూపర్–1000, కొరియా సూపర్–500, స్విస్ సూపర్–300 టైటిళ్లను సాధించింది. నేడు జరిగే సెమీఫైనల్లో చైనాకు చెందిన జి తింగ్–రెన్ జియాంగ్ యు జంటతో సాత్విక్–చిరాగ్ జోడీ తలపడుతుంది. పురుషుల సింగిల్స్ ప్రపంచ 8వ ర్యాంకర్ ప్రణయ్‌కి క్వార్టర్స్‌లో ఏదీ కలిసిరాలేదు. 31 ఏళ్ల భారత షట్లర్ 9–21, 14–21తో జపాన్ ఆటగాడు, మూడో సీడ్ కొడయ్ నరవొక చేతిలో సులువుగానే ఓడిపోయాడు. తొలిగేమ్‌లో నరవొకకు 9–8తో పోటీ ఇచ్చిన భారత ఆటగాడు తర్వాత వరుసగా అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకున్నాడు. ప్రపంచ చాంపియన్‌షిప్ రన్నరప్ నరవొక తొలిగేమ్‌లో తన రాకెట్‌ను నెట్‌పై పరిధి దాటిరావడంతో చైర్ అంపైర్ అతని పాయింట్‌ను తిరస్కరించాడు. అయితే ప్రణయ్ అందివచ్చిన అవకాశాల్ని ఒడిసిపట్టలేక పదేపదే పొరపాట్లు చేసి మ్యాచ్‌ను అప్పగించాడు.

తెలంగాణకు 3 పతకాలు



న్యూఢిల్లీ: జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ ప్లేయర్లు సత్తా చాటారు. వ్యక్తిగత విభాగం జూనియర్ పురుషుల 50 మీటర్ల రైఫిల్ ప్రోన్‌లో రోహిత్ కవిటి కాంస్యం గెలుచుకున్నాడు. 621.10 స్కోరుతో రోహిత్ మూడో స్థానంలో నిలిచాడు. టీమ్ విభాగం జూనియర్ పురుషుల 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో రోహిత్ కవిటి, అబ్దుల్ ఖలీఫ్ ఖాన్, అద్నాన్ ఖుస్రోలతో కూడిన జట్టు మొదటి స్థానంలో నిలిచి స్వర్ణం గెలుచుకోగా, ఈ ముగ్గురే సభ్యులుగా ఉన్న జట్టు పురుషుల 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ సివిలియన్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించింది.

పిస్టోరియస్‌కు పెరోల్



ప్రిటోరియా: గర్ల్‌ఫ్రెండ్‌ను హత్య చేసిన కేసులో గత తొమ్మిదేళ్లుగా జైల్లో ఉన్న మాజీ ఒలింపియన్, ప్రముఖ బ్లేడ్ రన్నర్ ఆస్కార్ పిస్టోరియస్‌కు పెరోల్ లభించింది. దక్షిణాఫ్రికాకు చెందిన పిస్టోరియస్ పారాలింపిక్స్‌లో ఆరు స్వర్ణపతకాలు గెలుచుకోవడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఎందరికో స్ఫూర్తిగా నిలిచి ప్రశంసలు పొందాడు. అయితే తన కెరీర్ అత్యుత్తమ దశలో ఉన్న సమయంలో తన గర్ల్‌ఫ్రెండ్ రీవా స్టీన్‌కాంప్‌ను హత్య చేసి జైలుపాలయ్యాడు. వలంటైన్స్‌డే రోజు ఆమెతో జరిగిన వాగ్వాదం నేపథ్యంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ కేసులో పిస్టోరియస్‌కు మొత్తం 13 ఏళ్ల 5 నెలల జైలు శిక్ష పడింది.

సెమీస్‌లో శ్రీవల్లి రష్మిక



బెంగళూరు: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల ప్రపంచ టెన్నిస్ టూర్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ భమిడిపాటి శ్రీవల్లి రష్మిక సెమీ ఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో 21 ఏళ్ల శ్రీవల్లి 6–1, 6–4తో భారత్‌కే చెందిన వైష్ణవి అడ్కర్‌పై సునాయాస విజయం సాధించింది. సెమీస్‌లో రష్మిక థాయ్‌లాండ్‌కు చెందిన రెండో సీడ్ లాన్లానా తారరుదితో తలపడుతుంది. క్వార్టర్స్‌లో ఆమె 6–1, 6–2తో ఏడో సీడ్ డిలెటా చెరుబిని (ఇటలీ)ని ఓడించింది. ఈ టోర్నీలో హైదరాబాదీ యువతారతో పాటు మరో ఇద్దరు భారత క్రీడాకారిణులు జీల్ దేశాయ్, రుతూజ భోసలే సెమీస్‌కు దూసుకెళ్లారు. క్వార్టర్ ఫైనల్లో జీల్ దేశాయ్ 3–6, 6–7 (8/2), 6–4తో అంటోనియా షమిడ్ట్ (జర్మనీ)పై చెమటోడ్చి నెగ్గింది. రుతూజ 7–6 (8/4), 1–6, 6–1తో కజకిస్తాన్‌కు చెందిన ఐదో సీడ్ జిబెక్ కులంబయెవాను కంగుతినిపించింది.

'ధోని నుంచి నేర్చుకున్నాను'

తన ఆటతీరుపై రింకూ సింగ్



విశాఖపట్నం: ఆస్ట్రేలియాతో జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో భారత జట్టు విజయంలో రింకూ సింగ్ కీలక పాత్ర పోషించాడు. చివర్లో దూకుడుగా ఆడాల్సిన స్థితిలో ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతంగా నిలబడి అతను ఫినిషర్‌గా మ్యాచ్ పూర్తి చేశాడు. ఈ లక్షణాన్ని తాను మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని నుంచి నేర్చుకున్నట్లు రింకూ సింగ్ చెప్పాడు. 'నేను ఇంత ప్రశాంతంగా ఉండగలిగానంటే అందుకు ప్రత్యేక కారణం ఉంది. ఇలాంటి స్థితిలో ఎలా ఆడాలని నేను మహి భాయ్ (ధోని)తో మాట్లాడాను. ముఖ్యంగా ఆఖరి ఓవర్లో ఒత్తిడికి లోను కాకపోవడానికి ఆయన ఇచ్చిన సూచనలే కారణం. సాధ్యమైనంత ప్రశాంతంగా ఉండటంతో పాటు నేరుగా బౌలర్‌పైనే పూర్తి దృష్టి పెట్టాలని ఆయన చెప్పారు' అని రింకూ సింగ్ వెల్లడించాడు. చివరి బంతికి ఒక పరుగు కావాల్సి ఉండగా రింకూ ఆత్మవిశ్వాసంతో దానిని చక్కటి సిక్సర్‌గా మలిచాడు. అయితే అబాట్ వేసిన ఆ బంతి నోబాల్ కావడంతో సిక్స్ లెక్కలోకి రాలేదు. 'డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లాక అక్షర్ చెప్పే వరకు ఈ విషయం నాకు తెలీదు. అయితే సిక్స్ కాలేకపోవడం పెద్ద అంశం కాదు. మ్యాచ్ గెలవడమే మనకు ముఖ్యం. అది జరిగింది చాలు' అని రింకూ సింగ్ వ్యాఖ్యానించాడు.

చిత్తుగా ఓడిన తెలంగాణ

జాతీయ హాకీ చాంపియన్‌షిప్



చెన్నై: జాతీయ సీనియర్ హాకీ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్టుకు భారీ పరాజయం ఎదురైంది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఒడిశా 7–0 గోల్స్ తేడాతో తెలంగాణను ఓడించింది. ఒడిశా తరఫున దిప్సన్ తిర్కీ (24వ నిమిషం), రజిన్ కందుల్నా (25, 60), అమిత్ రోహిదాస్ (31), అజయ్ కుమార్ ఎక్కా (36), నీలమ్ సంజీప్ (43), రోషన్ మిన్జ్ (57) గోల్స్ సాధించగా...తెలంగాణ ఒక్క గోల్ కూడా కొట్టలేకపోయింది. మరో మ్యాచ్‌లో పంజాబ్ 13–0తో ఉత్తరాఖండ్‌పై ఘన విజయం సాధించింది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, జుగ్‌రాజ్ సింగ్ 'హ్యాట్రిక్' గోల్స్ సాధించడం విశేషం. ఇతర మ్యాచ్‌లలో ఉత్తరప్రదేశ్ 8–1తో రాజస్తాన్‌ను, పుదుచ్చేరి 6–0తో కేరళను, ఢిల్లీ 23–0తో అరుణాచల్‌ప్రదేశ్‌ను ఓడించాయి.

పాక్‌లో డేవిస్ కప్ ఆడేందుకు సుమిత్, శశి విముఖత

అసంతృప్తి వ్యక్తం చేసిన 'ఐటా'

న్యూఢిల్లీ: భారత సింగిల్స్ టెన్నిస్ స్టార్లు సుమిత్ నగాల్, శశికుమార్ ముకుంద్ పాకిస్తాన్‌లో డేవిస్ కప్ ఆడేందుకు నిరాకరించారు. డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్–1 ప్లేఆఫ్ 'టై'లో భాగంగా భారత్ వచ్చే ఫిబ్రవరిలో పాకిస్తాన్‌తో తలపడాల్సివుంది. అయితే భారత్ తరఫున ఉత్తమ సింగిల్స్ ప్లేయర్లు అయిన సుమిత్ నగాల్ (141 ర్యాంకు), శశికుమార్ (477 ర్యాంకు) చిరకాల ప్రత్యర్థితో ఆడేందుకు విముఖత వ్యక్తం చేశారు. అయితే వారిద్దరు వైదొలగేందుకు కారణాలు వెల్లడించలేదు. కానీ విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు నగాల్ తనకు అంతగా అలవాటు లేని గ్రాస్ కోర్టులో ఆడేందుకు సిద్ధంగా లేనని అన్నాడు. హార్డ్ కోర్టుల్లో రాణించే సుమిత్ ఈ కారణంతో పాక్ వెళ్లేందుకు ఆసక్తి చూపించకపోగా, శశికుమార్ ముకుంద్ మాత్రం ప్రత్యేకించి ఏ కారణం చెప్పకుండానే తప్పుకున్నట్లు తెలిసింది. ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్ (ఐటా) దేశం తరఫున ఆడేందుకు నిరాకరించిన ఆటగాళ్లపై అసంతృప్తి వెలిబుచ్చింది. 'ఇది చాలా తప్పు. దేశానికి ప్రాతినిధ్యం వహించాల్సినపుడు ఇలాంటి కారణాలు చూపడం ఏమాత్రం సమంజసం కాదు. ఈ విషయాన్ని ఎగ్జిక్యూటివ్ కమిటీ దృష్టికి తీసుకెళ్లాం' అని ఐటా ఉన్నతాధికారి తెలిపారు.

అభివృద్ధిలో పాలుపంచుకుందాం

- గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్
- గుంటూరులో 'వికసిత్ భారత్ – సంకల్ప యాత్ర' ప్రారంభం



మాట్లాడుతున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

గుంటూరు రూరల్: దేశాభివృద్ధిలో అందరం పాలుపంచుకుందామని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. గుంటూరు రూరల్ మండలం లాలుపురంలోని ఏఎస్ఆర్ కన్వెన్షన్‌లో శుక్రవారం 'వికసిత్ భారత్–సంకల్ప యాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా గవర్నర్ పాల్గొన్నారు. ముందుగా ఆయుష్మాన్ భారత్‌కు సంబంధించి ఏర్పాటు చేసిన వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం ప్రధాని మోదీ సందేశంతోపాటు ఏపీ అభివృద్ధిపై ప్రదర్శించిన లఘు చిత్రాన్ని తిలకించారు. తదుపరి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరుగుతున్న ఈ క్యాంపెయిన్‌లో ప్రభుత్వ ప్రవేశపెడుతున్న పథకాలు, వాటి ప్రయోజనాలపై అర్హులైన ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పలు రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి అవార్డులు అందజేశారు. ఏపీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగించుకోవాలని సూచించారు. స్టేట్ నోడల్ ఆఫీసర్ పీయూష్‌కుమార్, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ప్రసంగించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, మేయర్ మనోహర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకూ 'ఆధార్' ఆధారిత హాజరు

- బోగస్ కూలీల నమోదును అరికట్టేందుకు కేంద్రం నిర్ణయం
- దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో డిసెంబర్ 4 నుంచి అమలు
- ప్రస్తుతానికి ఈ విధానం ఓ ఆప్షన్ మాత్రమే..
- పాత విధానంలోనూ హాజరు నమోదుకు అవకాశం



సాక్షి, అమరావతి: ఉపాధి హామీ పథకంలో బోగస్ కూలీల నమోదును అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరే ఉపాధి కూలీలకూ ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు హాజరు ప్రక్రియను ప్రవేశపెట్టనుంది. ఫీల్డ్‌అసిస్టెంట్ల వద్ద ఉండే మొబైల్ ఫోన్‌లోని యాప్ ద్వారా కూలీల హాజరును ఈ విధానంలోనే నమోదు చేస్తారు. కేంద్రం ప్రస్తుతం ఈ విధానాన్ని తప్పనిసరి చేయకుండా.. ఇప్పుడు అమల్లో ఉన్న విధానానికి అదనంగా డిసెంబర్ 4 నుంచి అన్ని రాష్ట్రాల్లో ఈ ప్రక్రియను ప్రారంభించనుంది. పనులు కోరిన వారి వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్ సేకరించి, వారికి పని కేటాయించే ఒక్క రోజు ముందు వారికి ఎక్కడ, ఎన్ని రోజులు పని కేటాయించారన్న వివరాలను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ రూపొందించిన ఎన్ఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేస్తారు. ఆ పని జరిగినన్ని రోజులూ ముందుగా నమోదు చేసిన కూలీల్లో రోజూ ఎవరెవరు పనికి వచ్చారో పని జరిగే ప్రదేశంలోనే యాప్‌లో వారి పేర్ల వద్ద హాజరైనట్టు టిక్ చేస్తారు. అంతేకాదు, కూలీలు పనిచేస్తున్నప్పుడు ఒక ఫొటో తీసి దానిని కూడా ఆ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. అయితే, ఆ ఫొటోలో పనిచేస్తున్న కూలీలు ఎవరన్నది వారి ముఖాలు స్పష్టంగా కనిపించినా, కనిపించకపోయినా.. కూలీల సంఖ్య మాత్రం స్పష్టంగా తెలిసేలా ఫొటోను అప్‌లోడ్ చేసేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే, కొత్త విధానంలో కూలీల హాజరును ఫీల్డ్ అసిస్టెంట్ మొబైల్ యాప్‌లో టిక్ రూపంలో నమోదు చేసే బదులు.. ఆ కూలీ ముఖాన్ని ఫొటో తీస్తారు. ఆ వ్యక్తికి సంబంధించిన ఆధార్‌లో నమోదైన ఫొటోతో ఈ ఫొటో సరిపోలాకే హాజరు పడేలా మొబైల్ యాప్‌లో సాఫ్ట్‌వేర్‌ను ఆధునీకీకరించనున్నారు.

ఇకపై అలా వీలుపడదు..

జియో కోఆర్డినేట్ల(ఆ ప్రాంత వివరాలకు సంబంధించిన శాటిలైట్ ద్వారా నిర్దేశించిన కొలతలు)ను ఆ పనికి అనుమతి తెలిపే సమయంలో పని ప్రదేశంలోనే ఇప్పటి వరకు నమోదు చేస్తున్నారు. కొత్త విధానంలో పని ప్రాంతంలోనే ఫీల్డ్ అసిస్టెంట్లు ఆయా కూలీల ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు హాజరును యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. జియో కోఆర్డినేట్లు నమోదు చేసిన ప్రాంతంలో కాకుండా వేరొక ప్రాంతంలో హాజరు నమోదుకు ప్రయత్నించినా వీలుపడదు.

ప్రస్తుతానికి రెండు విధానాల్లోనూ నమోదుకు అవకాశం

ఆధార్ ఆధారిత కూలీల ముఖ గుర్తింపు హాజరు ప్రక్రియకు సంబంధించి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరీ అమిత్ కటారియా ఇటీవల అన్ని రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటిదాకా కూలీల హాజరు నమోదు ప్రక్రియకు అనుసరించే విధానానికి అదనంగా డిసెంబర్ 4 నుంచి యాప్ ద్వారా కూలీల ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు హాజరు నమోదు చేసేలా ఆధునికీకరించిన ఎన్ఎంఎంఎస్ యాప్ అందుబాటులోకి తెస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతానికి రెండు ప్రక్రియల్లో హాజరు నమోదుకు వీలున్నా.. రానున్న రోజుల్లో ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు హాజరు నమోదుకే ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్రాలకు సూచించారు.

కోటీశ్వరులకు కొదువలేదు

దేశంలో 8.49 లక్షల మంది మిలియనీర్లు

సాక్షి, అమరావతి: వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత్‌లో మిలియనీర్లు భారీగా పెరుగుతున్నారు. దేశంలో 2000 సంవత్సరంలో 37వేల మంది మిలియనీర్లు ఉండగా, 2022కు ఆ సంఖ్య 8,49,000కు చేరింది. రానున్న ఐదేళ్లలో భారత్‌లో మిలియనీర్లు మరో 69శాతం పెరిగి 14,36,000కు చేరనున్నట్లు యూబీఎస్ గ్లోబల్ వెల్త్ నివేదిక వెల్లడించింది. లాక్‌డౌన్ సమయంలో ఇతర దేశాలతో పోలిస్తే భారతదేశం జీడీపీ వృద్ధిరేటు అధికంగా ఉండటం, 2021 సమయంలో ఇండియన్ స్టాక్ మార్కెట్లు 31శాతం వృద్ధి చెందడం కోటీశ్వరుల సంఖ్య పెరగడానికి ప్రధాన కారణమని ఆ నివేదిక పేర్కొంది. ప్రస్తుతం దేశంలో రూ.820 కోట్ల కంటే ఎక్కువ ఆస్తి ఉన్నవారు 5,480 మంది ఉన్నట్లు యూబీఎస్ గ్లోబల్ వెల్త్ అంచనా వేసింది.

ప్రపంచవ్యాప్తంగా 8.5కోట్లకు చేరనున్న కోటీశ్వరులు

ప్రపంచవ్యాప్తంగా 2022 నాటికి 5.9 కోట్లుగా ఉన్న కోటీశ్వరుల సంఖ్య 2027 నాటికి 2.6 కోట్లు పెరిగి 8.5 కోట్లకు చేరుతుందని యూబీఎస్ గ్లోబల్ వెల్త్ నివేదిక వెల్లడించింది. అత్యధికంగా అమెరికాలో 2.64 కోట్లు, చైనాలో 1.32 కోట్ల మంది కోటీశ్వరులు ఉంటారని పేర్కొంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.